
మంగళవారం
1•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 187
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

నూతన సంవత్సర శుభాకాంక్షలు

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

అత్యద్భుతంగా యాదాద్రి నిర్మాణం

- నిర్మాణంలో అధికారుల శ్రద్ధ చాలా బాగుంది
- ప్రతిష్ఠాత్మకంగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం కృష్ణశిలలతో నిర్మాణమవుతూ అత్యద్భుతంగా రూపుదిద్దుకొంటున్నదని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రశంసించారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు కొండపైకి చేరుకొన్న గవర్నర్‌కు వైటీడీఏ వైస్‌చైర్మన్ జీ కిషన్‌రావు, ఆలయ ఈవో ఎన్ గీత, డీసీపీ ఈ రామచంద్రారెడ్డి ఘనస్వాగతం పలికారు. ప్రధానార్చకులు నల్లంథిగల్ లక్ష్మీనరసింహాచార్యులు, అర్చక బృందం గవర్నర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం కొండపై నిర్మాణ పనులను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. గర్భాలయాన్ని యథాతథంగా ఉంచుతూ ప్రధానాలయం కృష్ణశిలలతో నిర్మించడం దేశంలోనే అరుదని చెప్పారు. 'ఎంత గొప్పగా నిర్మాణం జరుగుతున్నదో.. బయటి ప్రపంచానికి ఇప్పుడే తెలుస్తున్నది.. రాజగోపురాలు, ప్రాకారాలు కనుల విందుగా రూపొందాయి.. ఇంత గొప్ప నిర్మాణాలు చేపట్టినవారిని ప్రశంసించకుండా ఉండలేకపోతున్నాను' అంటూ సంతోషం వ్యక్తంచేశారు.



సోమవారం యాదాద్రి కొండపైన జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్



ఉమ్మడి హైకోర్టు భవనం వద్ద 2018 డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం ఆఖరి సూర్యాస్తమయం



రాష్ట్ర ప్రజలకు గవర్నర్, సీఎం కేసీఆర్ కొత్త సంవత్సర శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వేర్వేరుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. న్యూ ఇయర్‌లో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని గవర్నర్ ఆకాంక్షించారు. రాజ్‌భవన్ దర్బార్‌హాల్‌లో మంగళవారం సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ఆయన ప్రజలను కలుస్తారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొత్త సంవత్సరంలో మరింత ముందుకుపోవాలని ఆకాంక్షిస్తున్నట్టు సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరిసేలా దీవించాలని భగవవంతుడిని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.

సరికొత్త ఆలోచనలతో ముందుకు పోదాం: హరీశ్

రాష్ట్ర ప్రజలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో ఎన్నో ఆశయాలు, లక్ష్యాలను సాధించి, సరికొత్త ఆలోచనలతో ముందుకుపోవాలని అభిలషించారు. గత ఏడాదిలో అద్భుతమైన ప్రగతి సాధించుకున్నామని, దానికి నిదర్శనం మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడమేనని అన్నారు. ఈ ఏడాది అన్నిరంగాల్లో రాష్ట్ర మరింత ప్రగతి సాధించాలని, కాళేశ్వరం ప్రాజెక్టుతో కోటి ఎకరాల మాగాణి రాష్ట్రంగా సస్యశ్యామలం కావాలని కోరారు.

ప్రజలకు కొత్త విజయాలు చేకూరాలి: ఎంపీ కవిత

కొత్త సంవత్సరం ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని నిజామాబాద్ పార్లమెంటు సభ్యురాలు కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ప్రజలందరికీ కొత్త విజయాలు చేకూర్చాలని, ఎన్నో అనందాలు పౌరుల జీవితాల్లో నిండాలని కోరారు. కొత్త ఏడాదిలో నిర్దేశించుకున్న లక్ష్యాలన్నీ నెరవేరాలని ఎంపీ కవిత ఆకాంక్షించారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.50 గంటలకు

సూర్యాస్తమయం: 5.49 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం, ఏకాదశి, నక్షత్రం: స్వాతి ఉదయం 8.45 వరకు, తదుపరి విశాఖ, అమృతఘడియలు: లేవు, రాహుకాలం మధ్యాహ్నం 3.04 నుంచి సాయంత్రం 4.27 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.02 నుంచి 9.46 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.10 నుంచి 2.53 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 2.34 నుంచి సాయంత్రం 4.10 వరకు.

లోకం పోకడ



అమరావతికి తరలిన ఏపీ జడ్జీలు

- తెలంగాణ న్యాయమూర్తుల ఆత్మీయ వీడ్కోలు
- భావోద్వేగానికి గురైన జడ్జీలు, న్యాయవాదులు
- ఏపీ లాయర్లకు తెలంగాణ లాయర్ల అల్పాహార విందు
- ప్రత్యేక బస్సుల్లో ఏపీ రాజధానికి న్యాయవాదులు, సిబ్బంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం నుంచి ప్రత్యేక హైకోర్టులు ప్రారంభంకానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో సోమవారం ఉమ్మడి హైకోర్టు ప్రాంగణంలో ఉద్విగ్న వాతావరణం నెలకొన్నది. చివరిరోజైన సోమవారం ఉమ్మడి హైకోర్టులో విధులు ముగించుకున్న ఏపీ న్యాయమూర్తులు ఉదయం 11.30 గంటలకు కుటుంబసభ్యులతో కలిసి అమరావతికి బయల్దేరారు. ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులైన జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు మిగతా న్యాయమూర్తులకు తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులైన టీబీఎన్ రాధాకృష్ణన్, ఇతర న్యాయమూర్తులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇద్దరు చీఫ్ జస్టిస్‌లు కలిసి కేక్ కట్‌చేశారు. హైకోర్టు ప్రాంగణంలో ఏపీ న్యాయమూర్తులు, న్యాయవాదులకు తెలంగాణ న్యాయవాదులు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఇన్నేండ్లు ఎంతో స్నేహపూర్వకంగా కలిసిమెలిసి పనిచేసిన వారంతా ఇప్పుడు విడిపోవాల్సి రావడంతో భావోద్వేగానికి గురయ్యారు. ఎక్కడున్నా మనమంతా ఒక్కటేనంటూ వారిని తెలంగాణ న్యాయవాదులు సముదాయించారు. మళ్లీ కలుద్దాం.. హైదరాబాద్‌కు వచ్చినప్పుడు వస్తాం.. ఏపీకి వస్తే మీరు తప్పకుండా రావాలి.. అంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు.

కన్నీటిపర్యంతమైన సిబ్బంది..

ఏపీ హైకోర్టుకు కేటాయించిన న్యాయమూర్తులు, సిబ్బంది ఐదు ప్రత్యేక బస్సుల్లో ఆ రాష్ట్రానికి బయలుదేరడంతో వారికి తెలంగాణ న్యాయమూర్తులు, స్థానిక ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. స్నేహితులను విడిచి కొత్త ప్రాంతానికి వెళ్లాల్సిరావడంతో పలువురు సిబ్బంది కన్నీటిపర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ సునీల్‌గౌడ్, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు గండ్ర మోహన్‌రావు, ఎంకే ముకీద్, విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామన్నదొర, తెలంగాణ బార్ ఉపాధ్యక్షుడు హరిప్రీత్, ప్రధాన కార్యదర్శులు కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, సుంకరి జనార్దన్‌గౌడ్, అడ్వకేట్ జేఏసీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు కల్యాణ్‌రావు, అనిల్‌కుమార్, యాదగిరి, వెంకటేశ్‌గౌడ్, కే శ్రీధర్, రూపాసింగ్, పాశం సుజాత, పాశం కృష్ణారెడ్డి, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఏపీ కేసులకు సంబంధించిన ఫైళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వ్యాన్లలో అమరావతికి తరలించారు.



సోమవారం ఉమ్మడి హైకోర్టు నుంచి ఏపీ న్యాయమూర్తులకు ఉద్వేగభరితంగా వీడ్కోలుపలుకుతున్న తెలంగాణ న్యాయ సిబ్బంది

విడిపోక తప్పదు

రెండు రాష్ట్రాలు విడిపోయినప్పుడు హైకోర్టులు విడిపోవడం అనివార్యం. న్యాయానికి దగ్గరైన ఏపీ న్యాయవాదులకు, ప్రజలకు నా శుభాకాంక్షలు. గతంలో మూడు రాష్ట్రాలు కొత్తగా ఏర్పడినప్పుడు హైకోర్టులు కూడా వెంటనే ఏర్పడ్డాయి. తెలంగాణ విషయంలో ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ప్రస్తుతం ఏపీలో హైకోర్టు ఏర్పాటు వల్ల ఆ రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుంది.

– ఏ నర్సింహారెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్

ఏపీ న్యాయవాదులకు వీడ్కోలు

రెండు హైకోర్టులు ఏర్పడటం వల్ల ఇరు రాష్ట్రాల న్యాయవాదులకు మంచి అవకాశాలు లభిస్తాయి. సిబ్బంది, ఉద్యోగులకు కూడా మేలు జరుగుతుంది. పదోన్నతుల్లో తెలంగాణ న్యాయవాదులకు మంచి భవిష్యత్తు ఉంటుంది.

– దామోదర్‌రెడ్డి, హైకోర్టు తెలంగాణ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు

అన్నదమ్ముల్లా విడిపోయాం

ఇన్నేండ్లు కలిసి పనిచేసిన న్యాయవాదులంతా ఒక్కసారిగా వెళ్లిపోవాల్సి రావడం కొంత ఇబ్బంది కలిగించే విషయమే అయినా కొద్ది రోజుల్లో అంతా సర్దుకుంటుంది. ఏపీ న్యాయవాదులకు మంచి అవకాశాలు లభిస్తాయి. మౌలిక సదుపాయాలు, హైకోర్టు తరలింపునకు సమయం లేకపోవడం వంటి సమస్యలున్నా వాటిని అధిగమిస్తాం.

– రామన్నదొర, హైకోర్టు ఏపీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు

తెలంగాణ రాష్ట్రం సంపూర్ణం

ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సంపూర్ణమయింది. ఏపీ న్యాయవాదులు వెళ్లిపోవడం కొంత వెలితిగా అనిపించినప్పటికీ ఎన్నటికైనా విడిపోకతప్పదు. ప్రత్యేక హైకోర్టుతో తెలంగాణ న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు, సిబ్బందికి మంచి అవకాశాలు లభిస్తాయి.

– గండ్ర మోహన్‌రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుతో తెలంగాణ న్యాయవాదుల పోరాటాలకు ఫలితం దక్కింది. హైకోర్టు ఏర్పాటులో ఎనలేని కృషి చేసిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు తెలంగాణ న్యాయవాదుల తరపున కృతజ్ఞతలు.

– కొంతం గోవర్ధన్‌రెడ్డి, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ

ఏపీ న్యాయవాదులకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

- హైకోర్టు తరలింపుపై అత్యవసర విచారణకు తిరస్కరణ
- ప్రత్యేక హైకోర్టుల ప్రారంభానికి మార్గం సుగమం

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపుపై సుప్రీంకోర్టు ఆశ్రయించిన ఏపీ న్యాయవాదులకు చుక్కెదురైంది. హైకోర్టు తరలింపు అంశంపై అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. అమరావతిలో నిర్మిస్తున్న తాత్కాలిక హైకోర్టు భవన నిర్మాణం పూర్తయ్యే వరకు హైదరాబాద్ నుంచి ఏపీ హైకోర్టు తరలింపు నిర్ణయాన్ని వాయిదా వేయాలని కోరుతూ ఏపీ న్యాయవాదుల సంఘం సుప్రీంకోర్టులో శనివారం పిటిషన్ దాఖలుచేసిన విషయం విదితమే. జనవరి 2న ఈ పిటిషన్‌పై సాధారణ విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

ఉమ్మడి హైకోర్టులోనూ అదే పరిస్థితి

అమరావతిలో హైకోర్టు భవన నిర్మాణం పూర్తయ్యేవరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టును తరలించవద్దన్న ఏపీ న్యాయవాదుల పిటిషన్‌ను సోమవారం ఉమ్మడి హైకోర్టు కొట్టేసింది. అమరావతిలో భవన నిర్మాణాలు పూర్తయ్యేవరకు ఏపీ హైకోర్టును హైదరాబాద్‌లోనే కొనసాగించాలని పిటిషనర్లు చేసిన విజ్ఞప్తిని జస్టిస్ రామసుబ్రమణియన్ నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది.

వందేండ్ల ప్రస్థానం.. ఉన్నత న్యాయస్థానం

- 1919లో ఏర్పాటు.. 2019లో విభజన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిజాంరాజు 1919లో ఏర్పాటుచేసిన హైకోర్టు.. వందేండ్లు పూర్తయిన తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులుగా విడిపోయింది. మూసీనదికి దక్షిణం వైపు ఠీవీగా కనిపించే ఈ అరుదైన, అందమైన భవనాన్ని సారాసెనిక్ శైలిలో నిర్మించారు. నవాబ్‌ఖాన్ బహదూర్ మీర్జా అక్బర్‌బేగ్ ఈ భవనానికి చీఫ్ ఇంజినీర్‌గా వ్యవహరించారు. 1915 ఏప్రిల్ 15న ప్రారంభమైన దీని నిర్మాణం.. 1919 మార్చి 31న పూర్తయింది. 1920 ఏప్రిల్ 20నాడు అప్పటి ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ దీనిని ప్రారంభించారు. అప్పట్లో దానిని నిజాం రాజ్యం హైకోర్టుగా పిలిచేవారు. 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన అంతమైన తర్వాత ఇది హైకోర్ట్ ఆఫ్ హైదరాబాద్‌గా రూపాంతరం చెందింది. అనంతరం రాష్ట్రాల పునర్విభజన చట్టం 1956 ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు హైకోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా మారింది. 2014లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు విడిపోయిన తర్వాత హైకోర్ట్ ఆఫ్ జ్యూడికేచర్ ఎట్ హైదరాబాద్ ఫర్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ, అండ్ ది స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా మారింది. 2019 జనవరి ఒకటి నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రత్యేకంగా హైకోర్టులు ఏర్పడటంతో ప్రస్తుత ఉమ్మడి హైకోర్టు భవనం హైకోర్ట్ ఆఫ్ తెలంగాణగా మారింది. ఎన్నో ఏండ్ల పోరాటం తర్వాత నిజాం నిర్మించిన హైకోర్టు భవనం మళ్లీ తెలంగాణ హైకోర్టుగా మారడం విశేషం. అది కూడా సరిగ్గా వందేండ్ల క్రితం తెలంగాణలో అద్భుతంగా నిర్మించిన భవనంలో ఏర్పడిన హైకోర్టు.. పలుమార్లు పేర్లు మార్చుకుని.. ఇప్పుడు తెలంగాణ హైకోర్టుగా అదే భవనంలో పురుడుపోసుకోవడం గమనార్హం.

హైకోర్టు తెలంగాణ ఉద్యోగుల ఆందోళన

- స్థానికత ఆధారంగా ఉద్యోగులను విభజించాలని విజ్ఞప్తి

ఉమ్మడి హైకోర్టులో పనిచేస్తున్న దాదాపు 1,700 మంది ఉద్యోగులు, సిబ్బందిని స్థానికత ఆధారంగా విభజించాలని తెలంగాణ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు చీఫ్ జస్టిస్ టీబీఎన్ రాధా కృష్ణన్‌కు విజ్ఞప్తిచేశారు. హైకోర్టు ఉద్యోగులను సీనియార్టీ ప్రకారం విభజిస్తే తెలంగాణ స్థానికత కలిగి ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హరిమోహన్‌రెడ్డి, నిషాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

రాయలసీమలో ఏపీ హైకోర్టు ఏర్పాటు చేయాలి

- రాయలసీమ న్యాయవాదుల నిరసన

ఏపీ హైకోర్టును రాయలసీమలో ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతానికి చెందిన న్యాయవాదులు సోమవారం హైకోర్టు వద్ద ఆందోళన నిర్వహించారు. శ్రీబాగ్ ఒడంబడికలోని అంశాలకు ఏపీ సీఎం చంద్రబాబు తూట్లు పొడుస్తున్నారని వారు ఆరోపించారు. ఏపీ హైకోర్టును అమరావతిలో ఏర్పాటుచేస్తే రాయలసీమవాసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.



సోమవారం ఉమ్మడి హైకోర్టు వద్ద ఆందోళనకు దిగిన రాయలసీమ న్యాయవాదులు





ఏపీ న్యాయాధికారులకు వీడ్కోలు పలుకుతున్న తెలంగాణ న్యాయవాదులు



ప్రత్యేక బస్సుల్లో ఏపీకి బయలుదేరిన ఆ రాష్ట్ర న్యాయ సిబ్బంది



ఏపీ కేసులకు సంబంధించిన ఫైళ్లను వ్యాన్లలో తరలిస్తున్న దృశ్యం

పంజా విసురుతున్న చలిగాలులు

- గజగజ వణికిపోతున్న రాష్ట్రం.. ఏడు జిల్లాల్లో 'కోల్డ్‌వేవ్ అలర్ట్'
- ఆదిలాబాద్ జిల్లా అర్లి(టి)లో కనిష్ఠ ఉష్ణోగ్రత 2.7 డిగ్రీలుగా నమోదు
- మరో ఐదురోజులు ఇదే పరిస్థితి

ప్రత్యేకప్రతినిధి/హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంపై చలిగాలులు పంజా విసురుతున్నాయి. నాలుగురోజులుగా ఎముకలు కొరికే చలితో జనం అల్లాడుతున్నారు. గ్రామాల్లో చీకటి పడితేచాలు అడుగుబయటపెట్టలేని పరిస్థితి. ఉత్తర, ఈశాన్య దిశ నుంచి వీస్తున్న గాలుల తీవ్రత ఆదివారం రాత్రి నుంచి మరింత పెరిగినట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. మరో ఐదురోజులపాటు చలిగాలుల జోరు కొనసాగుతుందన్నారు. రాత్రిపూట చలిగాలులు, ఉదయం దుప్పటిలా కమ్మేస్తున్న మంచు సాధారణ జనజీవనంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. ఆదిలాబాద్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. పైప్‌లైన్లలో నీళ్లు కూడా గడ్డకట్టుకుపోతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా భీంపురం మండలం అర్లి(టి) గ్రామంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 2.7 డిగ్రీలకు పడిపోయింది. ఇదే గ్రామంలో శనివారం 3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అసాధారణ పరిస్థితి ఉండొచ్చని వాతావరణశాఖ 'కోల్డ్‌వేవ్ అలర్ట్'ను ప్రకటించింది. మంగళవారం రాత్రి గాలులు ప్రమాదకరంగా వీస్తాయని హెచ్చరించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. ఆదిలాబాద్, పెద్దపల్లి, మెదక్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయిలో పడిపోయాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణస్థాయి కంటే 2 నుంచి 9 డిగ్రీలవరకు తగ్గడంతో చలికి జనం గడగడ లాడుతున్నారు. ఈనెల 5వ తేదీవరకు చలిగాలుల తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి రాజారావు తెలిపారు. చలిగాలులతో వరిపైరుకు తెగుళ్లు ఆశించే అవకాశాలు ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



నిజామాబాద్‌లోని బైపాస్‌రోడ్డులో కమ్ముకున్న పొగమంచు

చలి తీవ్రతకు ముగ్గురు మృతి

చలి తీవ్రత కారణంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు మృత్యువాతపడ్డారు. వరంగల్ రూరల్ జిల్లా కోనాపురంలో కల్లెపు లచ్చమ్మ(95), సంగారెడ్డి జిల్లా కంగ్టిలో అమృత్ దంపతుల 2 నెలల కుమారుడు, నిర్మల్ జిల్లా మందపల్లికి చెందిన యెయ్య సునీత (40) ప్రాణాలు కోల్పోయారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
ఆసిఫాబాద్	4.4	25.3
మంచిర్యాల	4.4	25.3
ఆదిలాబాద్	4.4	25.3
మెదక్	4.4	31.8
సంగారెడ్డి	4.4	32.0
సిద్దిపేట	4.5	30.9
వికారాబాద్	5.1	29.0
మేడ్చల్ మల్కాజిగిరి	6.8	32.9
మహబూబ్‌నగర్	7.1	33.7
జనగామ	7.7	29.5
నాగర్‌కర్నూల్	7.9	32.1
కరీంనగర్	8.1	32.1
యాదాద్రి భువనగిరి	8.3	32.9
మహబూబాబాద్	8.4	34.1
వరంగల్ అర్బన్	8.5	27.0
పెద్దపల్లి	8.6	27.0
కామారెడ్డి	9.0	28.0
జగిత్యాల	9.0	31.0
హైదరాబాద్	9.5	32.9
సూర్యాపేట	10.0	26.0
వరంగల్ రూరల్	10.0	29.0
నిజామాబాద్	10.2	26.7
జయశంకర్ భూపాలపల్లి	11.0	26.0
నిర్మల్	11.0	27.0
వనపర్తి	11.1	32.9
జోగుళాంబ గద్వాల	11.2	32.1
రాజన్న సిరిసిల్ల	12.0	26.0
రంగారెడ్డి	12.0	28.0
భద్రాద్రి కొత్తగూడెం	12.0	28.0
ఖమ్మం	13.0	27.0
నల్లగొండ	15.0	27.2

నమస్తే తెలంగాణ
2019
మన రాష్ట్రం • మన పత్రిక
నూతన సంవత్సర శుభాకాంక్షలు
WWW.NTNEWS.COM
/NTDAILYONLINE

ఆహార పరిశ్రమలో బ్రాండ్ తెలంగాణ



సోమవారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమతో కల్తీరహిత బ్రాండెడ్ ఉత్పత్తులు

- తొలుత ఆరేడు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్
- వ్యవసాయం, ఫుడ్‌ప్రాసెస్ రంగంలో దేశంలో అగ్రభాగాన తెలంగాణ ఉండాలి
- మహిళాసంఘాలను భాగస్వామ్యం చేయాలి.. 45 లక్షల మంది సభ్యులకు శిక్షణ ఇవ్వాలి: సీఎం

- ప్రజల అవసరాలకు తగ్గట్టు పంటల ఉత్పత్తి
- పంటకాలనీలపై అంచెలంచెలుగా అవగాహన
- పండించే ప్రతి పంటకు డిమాండ్ ఉండాలి
- రైతులందరినీ సంఘటితపరిస్తే గొప్ప ఫలితాలు
- విదేశాలకు తెలంగాణ ఉత్పత్తులు ఎగుమతి చేయాలి
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్
- కార్యాచరణ రూపొందించాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో మరో ప్రతిష్ఠాత్మక కార్యక్రమం అమలుకు రంగం సిద్ధమవుతున్నది. ఇటీవలి ఎన్నికల్లో ప్రముఖంగా ప్రకటించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఆహార పరిశ్రమలో తెలంగాణ బ్రాండ్‌ను తీసుకువచ్చేందుకు, నాణ్యమైన, కల్తీ లేని ఆహార పదార్థాలను ప్రజలకు అందించేందుకు కసరత్తు మొదలుపెట్టారు. ఈ మేరకు సోమవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ తీరుతెన్నులు, భవిష్యత్తులో అవలంబించాల్సిన విధానాలు, మహిళా సంఘాలను భాగస్వాములను చేయటం, రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు తదితర అంశాలపై జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణలో పండిన పంటలను ఫుడ్ ప్రాసెసింగ్‌చేసి, నాణ్యమైన కల్తీలేని, బ్రాండెడ్ ఉత్పత్తులను ప్రజలకు అందించాలన్నారు. రైతులందరినీ సంఘటితపరుచడం ద్వారా దీనిని సాధించవచ్చని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో మహిళాసంఘాలను భాగస్వాములను చేయాలని సీఎం స్పష్టం చేశారు. 45 లక్షల మంది సభ్యులున్న నాలుగు లక్షల మహిళా సంఘాలకు ఈ విషయంలో శిక్షణ ఇవ్వాలని చెప్పారు. రాష్ట్రాన్ని పంటకాలనీలుగా విభజించి, తద్వారా రైతులు పండించే ప్రతి పంటకు డిమాండ్ వచ్చేలా కార్యాచరణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆహార, వ్యవసాయరంగానికి సంబంధించిన పలు విషయాల్లో సరైన గణాంకాలు లేనందున రకరకాల సమస్యలు

మిగతా 4వ పేజీలో



2019 న్యూఇయర్‌కు ఘనస్వాగతం

కొత్త సంవత్సరం వేళ దేశదేశాల్లో వేడుకలు

5

నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ సిడ్నీలోని ఒపేరా హౌజ్ వద్ద ఆకాశానికి ఎగసిన పటాకులు

రైతుబంధుకు మమత జై

స్ఫూర్తినిచ్చిన తెలంగాణ ప్రతిష్ఠాత్మక పథకాలు

- బెంగాల్‌లో క్రిషక్‌బంధు పేరిట ఐదువేల పెట్టుబడిసాయం
- 72 లక్షల మంది అన్నదాతలకు ప్రయోజనం
- రైతుబీమా కింద మృతిచెందిన రైతులకు 2 లక్షల పరిహారం
- పంటబీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది
- ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ప్రకటన
- ఇప్పటికే ఒడిశాలో రైతుబంధు తరహా పథకం
- అమలుకు సిద్ధమైన జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న రైతుబంధు, రైతుబీమా పథకాలు పలు రాష్ట్రాలను ఆకర్షిస్తున్నాయి. రైతాంగ సమస్యల పరిష్కారానికి కీలక అంశాలుగా నిలిచిన తెలంగాణ రైతుబంధు పథకాన్ని ఇప్పటికే ఒడిశా, జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వాలు స్వీకరించాయి. ఒడిశా ప్రభుత్వం కాలియా పేరిట పథకాన్ని ప్రకటించగా.. తాజాగా దేశంలోని కీలక రాష్ట్రంగా ఉన్న పశ్చిమబెంగాల్ కూడా తెలంగాణ బాటలోనే పయనించింది. రాష్ట్రంలోని 72 లక్షల మంది రైతులకు లబ్ధికూర్చేలా ఏటా ఎకరానికి ఐదువేల

మిగతా 4వ పేజీలో

- బెంగాల్ రైతులకు న్యూ ఇయర్ గిఫ్ట్





సాగు వెలుగులకు ఏడాది

- 24 గంటల ఉచిత కరంటుకు నేటితో సంవత్సరం పూర్తి
- విద్యుత్ రంగంలో ఘనవిజయాలు అందించిన 2018
- సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వం.. సీఎండీ నాయకత్వం
- శ్రమించిన విద్యుత్ సంస్థల ఉద్యోగులు, కార్మికులు

8

కోటి ఎకరాల స్వప్న వీక్షణం

- నేడు కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించనున్న సీఎం కేసీఆర్
- సరిగ్గా ఏడాది కిందట క్షేత్రస్థాయిలో పర్యటించిన ముఖ్యమంత్రి
- రెండ్రోజులు కాళేశ్వరం, పునర్జీవ పథకం పనులను చూడనున్న సీఎం
- పనుల పురోగతిపై ఫీడ్‌బ్యాక్ ఇచ్చిన తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల బృందం

హైదరాబాద్/జయశంకర్ జిల్లా ప్రతినిధి, పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ/మల్యాల:

రానున్న ఏడాదిన్నర, రెండేండ్లలో రాష్ట్రంలోని కోటి ఎకరాలకు సాగునీరు అందించాలనే జల సంకల్పంతో ఉన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. తన స్వప్నాన్ని క్షేత్రస్థాయిలో వీక్షించనున్నారు. ఇందుకోసం ప్రాజెక్టుల బాటకు మంగళవారం శ్రీకారం చుడుతున్నారు. తొలిరోజు కాళేశ్వరం, రెండోరోజు ఎస్సారెస్పీ పునర్జీవ పనులను ఆయన పరిశీలించనున్నారు. దాదాపు ఏడాది క్రితం క్షేత్రస్థాయిలో ఈ ప్రాజెక్టుల పనులను పరిశీలించిన సీఎం.. మరోసారి స్వయంగా నిర్మాణపనులను గమనించేందుకు వస్తుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి ఒంటిగంటకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డకు

మిగతా 4వ పేజీలో

మన హైకోర్టు మనకే

100 యేండ్ల ప్రస్థానం



1920 ఏప్రిల్ 20న హైకోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్

- 1920 నిజాం రాజ్యం హైకోర్టు
- 1948 హైకోర్ట్ ఆఫ్ హైదరాబాద్
- 1956 హైకోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్
- 2019 హైకోర్ట్ ఫర్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ

అమరావతికి తరలిన ఏపీ జడ్జీలు

తెలంగాణ న్యాయమూర్తుల ఆత్మీయ వీడ్కోలు

భావోద్వేగానికి గురైన జడ్జీలు, న్యాయవాదులు

2



తెలంగాణలో మరో చారిత్రక ఘట్టం

నేటినుంచి రెండు రాష్ట్రాలకు ప్రత్యేక హైకోర్టులు

తెలంగాణ హైకోర్టుగా పేరు మార్పు



సోమవారం ఉమ్మడి హైకోర్టులో కేక్ కట్‌చేస్తున్న తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ రాధాకృష్ణన్, ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్

- చీఫ్ జస్టిస్‌ల ప్రమాణ స్వీకారం నేడే
- రాజ్‌భవన్‌లో జస్టిస్ రాధాకృష్ణన్, విజయవాడలో జస్టిస్ ప్రవీణ్‌కుమార్
- ఏపీ న్యాయమూర్తులకు సుప్రీంకోర్టులో చుక్కెదురు
- హైకోర్టు తరలింపుపై అత్యవసర విచారణకు అంగీకరించని సర్వోన్నత న్యాయస్థానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణలో మరో చారిత్రక ఘట్టానికి తెర లేవనున్నది. ప్రత్యేక హైకోర్టు కోసం ఎన్నో ఏండ్ల నుంచి ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజల స్వప్నం మరికొద్ది గంటల్లో సాకారం కానున్నది. 2014 జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌ను విభజించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటుచేసినప్పటికీ హైదరాబాద్‌లో గత నాలుగేండ్లుగా రెండు తెలుగు రాష్ట్రాలకూ సేవలందిస్తున్న ఉమ్మడి హైకోర్టును మంగళవారం విభజించనున్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైదరాబాలోని రాజ్‌భవన్‌లో ఉదయం 8.30 గంటలకు చీఫ్ జస్టిస్ రాధాకృష్ణన్‌తో గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, హోంమంత్రి మహమూద్‌అలీతోపాటు హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొంటారు. ఈ కార్యక్రమం

మిగతా 4వ పేజీలో

తండాల్లో నవయుగం

కొత్త పంచాయతీల్లో ఎన్నికల కోలాహలం ■ సాకారం కానున్న మావ నాటె.. మావ రాజ్

'తొలి పాలకవర్గం'గా చరిత్ర సృష్టించేందుకు పోటీ ■ ఏకగ్రీవానికి గ్రామ పెద్దల ప్రయత్నాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గిరిపుత్రుల దశాబ్దాల కల త్వరలో నెరవేరబోతున్నది. మావ నాటె.. మావ రాజ్(మా తండాలో.. మా రాజ్యం) సాకారం దిశగా ఇప్పటికే తండాలు, గూడేలు గ్రామ పంచాయతీలుగా మారాయి. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో కొత్తగా ఏర్పడిన గిరిజన పంచాయతీల్లో కోలాహలం నెలకొన్నది. పట్టణాల్లో స్థిరపడినవారు సైతం తమ పల్లెలో రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. గ్రామస్థులంతా తమ తొలి పాలకవర్గాన్ని ఎన్నుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అభివృద్ధే ప్రధాన ఎజెండాగా చర్చిస్తున్నారు. చదువుకున్న వారిని ఎన్నుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. గ్రామ పెద్దలంతా కలిసి ఏకగ్రీవం వైపు అడుగులు వేస్తున్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రూ.10 లక్షల నజరానాతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని చెప్తున్నారు. నూతన పంచాయతీ రాజ్ చట్టం ద్వారా కొత్తగా 4,383 గ్రామ పంచాయతీలు అవతరించాయి. ఇందులో 2,551 తండాలు, గూడేలు పంచాయతీలుగా ఆవిర్భవించాయి. వీటిల్లో 1,177 గ్రామాలు పూర్తిగా గిరిజనులు నివసిస్తున్న తండాలే. జనాభా ప్రాతిపదికన వీటిని పూర్తిగా ఎస్టీలకే కేటాయించారు. ప్రభుత్వం మరో 1,281 గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించింది. వీటికితోడు మిగతా పంచాయతీల్లో రిజర్వేషన్ ప్రకారం 688 గ్రామాలు ఎస్టీలకు దక్కాయి.

ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు

గతంలో తండాలు, గూడేలకు చెందిన ప్రజలు ఓటుహక్కు వినియోగించుకునేందుకు కిలోమీటర్ల దూరం వెళ్లి పక్క గ్రామంలో వేసి

మిగతా 9వ పేజీలో

చంపుకుతింటున్న చలి

2

మరో ఐదురోజులు ఇంతే

ఆదిలాబాద్ జిల్లాలోని అర్లి(టీ) గ్రామంలో రికార్డు స్థాయి కనిష్ఠం 2.7°

హైదరాబాద్: 9.5°

ఏపీలోనూ పరాభవమే

బాబును ఎదుర్కొనేందుకు ఏపీ ప్రజలు చాలు

పూటకో పార్టీతో పొత్తు చంద్రబాబుకే చెల్లు!

మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

ఆంధ్రాలో అవినీతి పాలన

దత్తత ముసుగులో పాలమూరుకు దగా

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

కుట్రలకు చిరునామా చంద్రబాబు

ఏపీలో ఓటమి తథ్యం: ఎంపీ గుత్తా

కల్లు తాగిన కోతిలా బాబు

టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య

అవినీతికి బాబే ప్రామాణికం

ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

9

తగ్గిన వంటగ్యాస్ ధరలు



సబ్సిడీ సిలిండర్‌పై రూ.5.91, సబ్సిడీయేతర సిలిండర్‌పై రూ.120.50 తగ్గింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: నూతన సంవత్సరం వేళ వంట గ్యాస్ ధరలు తగ్గాయి. 14.2 కిలోల సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.5.91, సబ్సిడీయేతర సిలిండర్‌పై రూ.120.50 తగ్గిస్తున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. నెల వ్యవధిలో వంట గ్యాస్ ధరలు తగ్గడం ఇది రెండోసారి. డిసెంబర్ 1న సబ్సిడీతో కూడిన వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.6.52 తగ్గగా, సబ్సిడీయేతర వంట గ్యాస్ ధర రూ.133 తగ్గింది. అంతకుముందు జూన్ నుంచి వరుసగా ఆరుసార్లు ధరలు పెరిగాయి. కాగా, తాజాగా తగ్గిన ధరలు డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచే అమల్లోకి వస్తాయని ఐవోసీ తెలిపింది. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు తగ్గడం, అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ పెరగడంతో వంట గ్యాస్ ధరలు తగ్గినట్లు వెల్లడించింది.

పోలీసులకు ఉత్తమ సేవాపతకాలు

నూతన సంవత్సరం సందర్భంగా అందజేత ■ ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో పోలీసు, ఇతర విభాగాల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి సేవాపతకాలను అందజేయనున్నారు. ఈ మేరకు ఆయా పతకాలకు అర్హులను నిర్ణయిస్తూ తెలంగాణ రాష్ట్ర పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఫైర్‌సర్వీస్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పేర్లను సోమవారం ప్రభుత్వం వెల్లడిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఈ అవార్డులను అందజేయనున్నారు. ఎంపికైన వారిలో తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖకు సంబంధించి శౌర్య పతకం గ్రేహౌండ్స్ విభాగంలో ఆరుగురికి, ఇంటెలిజెన్స్ విభాగంలో 15 మందికి, తెలంగాణ రాష్ట్ర పోలీసు మహోన్నత సేవాపతకం 17 మందికి, తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉత్తమ సేవాపతకం వివిధ విభాగాల్లోని దాదాపు 91 మందికి ఇవ్వనున్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు కఠిన సేవా పతకం 50 మందికి నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు సేవా పతకం జిల్లాల వారీగా 371 మందికి ఇవ్వనున్నారు. డీజీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పరిధిలో మహోన్నత సేవాపతకం ఒకరికి, ఉత్తమ సేవాపతకం ఇద్దరికి, సేవాపతకం 15 మందికి అందజేయనున్నారు. రాష్ట్ర ఫైర్ విభాగంలో ఉత్తమ సేవాపతకం ఇద్దరికి, ఫైర్ సేవాపతకం 14 మందికి, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో మహోన్నత సేవాపతకం ఒకరికి, ఉత్తమ సేవాపతకం ముగ్గురికి, సేవాపతకం 9 మందికి, యాంటీ కరప్షన్ బ్యూరో పరిధిలో ఉత్తమ సేవాపతకం అయిదుగురికి, సేవాపతకం 18 మందికి అందజేయాలని నిర్ణయించారు.



తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు ఏర్పాటైన సందర్భంగా మంగళవారం నిర్వహించే హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును ఆహ్వానిస్తున్న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఏ వెంకటేశ్వర్‌రెడ్డి. చిత్రంలో లా సెక్రటరీ వీ నిరంజన్ కూడా ఉన్నారు.



ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ తీరుతెన్నులు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై సోమవారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, మండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, రాష్ట్ర హోంశాఖ సలహాదారు అనురాగ్‌శర్మ తదితరులు కూడా ఉన్నారు.

ఆహార పరిశ్రమలో బ్రాండ్ తెలంగాణ

అయిదోపేజీ తరువాయి...

తలెత్తుతున్నాయని, వీటిని అధిగమించాల్సిన ఆవశ్యకత ఉన్నదన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల మీద కోట్లమంది ఆధారపడి ఉన్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా ఆ శాఖలు పనిచేయాలని చెప్పారు. దేశం మొత్తంలోనే ఉత్తమమైన వ్యవసాయ, ఉద్యానవన, ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులలో తెలంగాణ అగ్రభాగాన ఉండాలని సీఎం ఆకాంక్షించారు. రైతులను ఆదుకునే విషయంలో యావత్ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.

సమన్వయంతో పనిచేయండి

'ఈ సమీక్షాసమావేశం ఫుడ్‌ప్రాసెసింగ్‌కు సంబంధించిన అంశాలపై ఒక అవగాహనకు రావటానికి ఏర్పాటైంది. దురదృష్టవశాత్తు చాలా విషయాల్లో సరైన గణాంకాలు లేకపోవటంవల్ల సరైన నిర్ణయానికి రావటం కష్టమవుతున్నది. రాష్ట్రంలో ఎంత ధాన్యం పండుతుంది? ఎంతమేరకు పండ్ల ఉత్పత్తి జరుగుతున్నది? ఏ మేరకు ప్రజల ఆహార అవసరాలు తీరుతున్నవి? అనే విషయాలపై సరైన గణాంకాలుండాలి. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, సంబంధిత ఇతర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలొస్తాయి. దీని కొరకు ఏంచేయాలో ఆలోచించాలి. దీనిద్వారా రైతుల్లో అశాంతిపూర్తిగా తొలిగిపోతుంది. ఈ క్రమంలో మొదటి అడుగుగా రైతు సమన్వయ సమితులు ఏర్పాటుచేశాం. వాళ్లకు క్రమపద్ధతిలో శిక్షణనివ్వాలి. తరువాత వ్యవసాయ విస్తరణాధికారులను నియమించాం. భూమి లెక్కలు కూడా తేల్చటంతో వ్యవసాయ అనుకూల భూమి ఎంతుందో తేలింది. పండిన పంటకు గిట్టుబాటు ధర లభించాలి. ఇదంతా ఒక గొలుసుకట్టు కార్యక్రమంలా జరుగాలి. తద్వారా వ్యవస్థ బాగుపడితే చాలామంచిది' అని సీఎం అన్నారు.

సహకార పద్ధతిలో రైతులు సంఘటితం కావాలి

'రైతులందరూ ఒకేరకమైన పంట వేస్తే సమస్యలు తలెత్తుతాయి. కనుక.. పంట మార్పిడిపై వాళ్లకు అవగాహన కల్పించాలి. రైతుల సంప్రదాయబద్ధమైన కొన్ని అలవాట్లలో కొంత మార్పు రావాలి. అందరు రైతులు ఒకేరకమైన పంట వేస్తే జరిగే లాభనష్టాలమీద చర్చ జరుగాలి. ముల్కనూరు గ్రామం అనుభవాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అక్కడ సహకార పద్ధతిలో రైతులను సంఘటితపరచటం ద్వారా గొప్ప ఫలితాలు వచ్చాయి. ఫలానావిధంగా నడుచుకుంటే లాభం కలుగుతుందని రైతులకు వ్యవసాయ శాఖాధికారులు నమ్మకం కలిగిస్తే బ్రహ్మాండమైన ఫలితాలు వస్తాయి. వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త అశోక్‌గులాటీని ఢిల్లీలో కలిసినప్పుడు రాష్ట్రంలో ఈ విషయాలలో వర్క్‌షాప్ నిర్వహించాలని ఆహ్వానించాను. త్వరలో ఆయన రాష్ట్రానికి వస్తారు' అని సీఎం చెప్పారు.

పంటకాలనీలుగా రాష్ట్రం

'రాష్ట్రాన్ని కచ్చితంగా పంటకాలనీలుగా విభజించాలి. రైతు పండించే పంటకు డిమాండ్ ఉండాలి. మన ఆహార అవసరాలేమిటో తెలుసుకోవాలి. రైతాంగం ఏ పంటలు వేయడానికి అలవాటు పడ్డదో అర్థం చేసుకుని ఒకేసారి వాళ్లమీద మన అభిప్రాయాలను రుద్దకుండా అంచెలంచెలుగా పంటకాలనీలపై అవగాహన కలిగించాలి. గ్రామీణ ఆహార అవసరాలతో పాటు, నగర, పట్టణ ప్రజల ఆహార అవసరాలకు తగువిధంగా ఉత్పత్తులు జరుగాలి. కూరగాయలు, కొత్తిమీర, జీలకర్ర లాంటివి కూడా దిగుమతులు చేసుకోవడం దురదృష్టం. నగరాలు, పట్టణాల దరిదాపుల్లో కూరగాయల పెంపకం జరుగాలి. వచ్చే వానకాలంకల్లా కాళేశ్వరం నీళ్లు వస్తాయి. కొత్త ఆయకట్టు వస్తుంది. రాబోయే రెండేండ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తయి, కోటి ఎకరాలకు పైగా సాగునీరందుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. చెరువులు నిండుతాయి. ఈ నేపథ్యంలో ఎటువంటి భూమిలో ఎలాంటి పంటవేయాలో రైతులకు అవగాహన కలిగించాలి' అని సీఎం కేసీఆర్ తెలిపారు.

విదేశాలకు తెలంగాణ ఉత్పత్తులు ఎగుమతి చేయాలి

'ఎటువంటి వ్యవసాయ ఉత్పత్తినైనా ప్రాసెస్‌చేస్తే దాని ధర పెరుగుతుంది. ఉదాహరణకు మిరపకాయ నుండి కారంపొడి లేదా పసుపు కొమ్ముల నుండి పసుపు తీసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ వస్తువు కొనాలన్నా కల్తీ అవుతున్నది. మనం గనక మార్కెట్లో ఒక బ్రాండ్ నేమ్‌తో.. మన ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులకు అదీ ప్రభుత్వపరంగా తయారైన వస్తువన్న నమ్మకం కలిగించాలి. దీనికొరకు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రారంభించాలి. మన ఆలోచనలను కార్యరూపంలో తీసుకుని వచ్చి అమలు పరుచాలి. ఏ ప్రాంతంలో ఎన్ని, ఏ రకమైన ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు ఉండాలో నిర్ణయించాలి. మన రాష్ట్ర అవసరాలకు సరిపోను మిగిలినవి పక్క రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేయాలి. ఈ యావత్ ప్రక్రియలో ఐకేపీ-మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలి. ఏ మేరకు వీరిని భాగస్వాములను చేయవచ్చో అధ్యయనం చేయాలి. మనదేశంలో 130 కోట్ల ప్రజలున్నారు. పెద్ద దేశీయ మార్కెట్. ఏ రాష్ట్రంలో ఏ పంట పండదో దాన్ని విశ్లేషించి, మన వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా వాటిని పండించగలగాలి. తద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులను తయారు చేయాలి. దేశ విదేశాల్లో అత్యుత్తమమైన ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఎక్కడుందో గుర్తించి అలాంటిది మన రాష్ట్ర వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాటు చేసుకునే విషయంపై అధ్యయనం చేయాలి' అని సీఎం కేసీఆర్ అన్నారు.

రైతులు నియంత్రిత విధానంలో పంటలు పండించేలా చూడాలి

'రైతులు నియంత్రిత విధానంలో పంటలు పండించేలా చూడాలి. ప్రతి కుంట భూమిలో ఏ విత్తనం పెడుతున్నామో వ్యవసాయ శాఖకు తెలియాలి. మంచి మేలురకమైన విత్తనాలు రైతులకు ఇవ్వాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో తదనుగుణమైన పరిశోధనలు జరుగాలి. అంతర్జాతీయ విపణిలో మన భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోలేని పరిస్థితిలో ఉండటం దురదృష్టకరం. దీన్ని అధిగమించాలి. ప్రతి గ్రామం ఆ గ్రామప్రజల అవసరాలు తీర్చే స్థాయిలో కూరగాయలు పండించాలి. మిగిలినవి సమీపంలోని నగరాలు, పట్టణాలకు సరఫరా చేయాలి' అని సీఎం చెప్పారు.

ఆదాయం బాగా ఉంది.. నూతన వరవడికి సిద్ధం కావాలి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా ఉంది. గత నాలుగు సంవత్సరాల్లో సగటున 17.17% వృద్ధిరేటు సాధించాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 29.97% వృద్ధిరేటు ఉంది, జీఎస్డీపీలో ప్రథమ స్థానంలో ఉన్నాం. వచ్చే ఐదేండ్లలో రూ.10 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేయబోతున్నాం. అన్నివిధాలా మన పెరుగుదలకు అవకాశాలున్నాయి. అందుకే మూసపద్ధతిలో ఆలోచించకుండా నూతన వరవడికి సిద్ధం కావాలి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఈ సమావేశంలో జరిగిన చర్చల ప్రాతిపదికగా ఆలోచనలు పంచుకుని ఎలా ముందుకు పోవాలో నిర్ణయించాలని అధికారులను సీఎం కోరారు.

మహిళా సంఘాల భాగస్వామ్యంతో...

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఒక సామూహిక ప్రయత్నమని, మహిళా బృందాలతోపాటు పలువురిని ఇందులో భాగస్వాములను చేయాలని సీఎం కేసీఆర్ చెప్పారు. తొలుత ఒక ఆరేడు మండలాలను పైలట్ పద్ధతిన తీసుకుని కార్యక్రమం ప్రారంభించాలని, ఆ తరువాత పెద్ద ఎత్తున ప్రారంభించొచ్చని అన్నారు. ఉన్నతస్థాయి సమీక్షలో వచ్చిన అభిప్రాయాల ప్రాతిపదికన అధికారులు వివిధ స్థాయిల్లో మేధోమథనం, వర్క్‌షాపులను నిర్వహించాలని సూచించారు. కేంద్రప్రభుత్వపరంగా ఫుడ్ ప్రాసెసింగ్‌లో అమలుపరుస్తున్న కార్యక్రమాలను అధ్యయనం చేయాలని, అంతర్జాతీయ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమపైనా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఎంత ఖర్చు పెట్టడానికైనా ప్రభుత్వం వెనుకాడదని అన్నారు. ఉత్తమస్థాయి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకోసం ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లి అధ్యయనం చేసి రావొచ్చని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు సంబంధించి ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

పంటకాలనీల ఏర్పాటుతోపాటుకు కృషిచేయాలని, విత్తన కంపెనీలపై నియతంత్రణ కొనసాగించాలని సీఎం కేసీఆర్ అన్నారు. కల్తీ విత్తనాల అమ్మకం పూర్తిగా నిషేధించాలని, కల్తీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విరివిగా అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వరి నాటు యంత్రాలు, కలుపుతీసే యంత్రాలు, పసుపు రైతులకు ఇవ్వాల్సిన యంత్రాలను అందుబాటులో ఉంచడానికి కార్యాచరణ రూపొందించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులు నర్సింగ్‌రావు, భూపాల్‌రెడ్డి, స్మితాసబర్వాల్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్‌శర్మ, మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, ఆనంద్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, వ్యవసాయ ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

మన హైకోర్టు మనకే

అయిదోపేజీ తరువాయి...

ముగియగానే గవర్నర్ నరసింహన్ ఉదయం 9 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళతారు. అక్కడి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మధ్యాహ్నం 12 గంటలకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్‌తో గవర్నర్ ప్రమాణస్వీకారం చేయిస్తారని రాజ్‌భవన్‌వర్గాలు తెలిపాయి. ఈ విభజనతో ఉమ్మడి హైకోర్టు ఇకమీదట తెలంగాణ హైకోర్టుగా కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్ కోసం ఆ రాష్ట్ర రాజధాని అమరావతిలో కొత్తగా ఏర్పాటుచేసిన హైకోర్టు మంగళవారం నుంచి లాంఛనంగా పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి హైకోర్టు పేరును 'హైకోర్ట్ ఫర్ ది తెలంగాణ స్టేట్'గా మార్చారు. ఈ మేరకు పాత బోర్డును తొలిగించి కొత్త బోర్డును ఏర్పాటుచేశారు. ఇదిలావుంటే.. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఏపీ న్యాయవాదులకు చుక్కెదురైంది. హైకోర్టు తరలింపుపై అత్యవసర విచారణ జరుపాలన్న ఏపీ న్యాయవాదుల విన్నపాన్ని సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక హైకోర్టులు ప్రారంభమయ్యేందుకు మార్గం సుగమమైంది. విభజన నేపథ్యంలో సోమవారం ఉదయం ఉమ్మడి హైకోర్టులో ఉద్విగ్నభరిత వాతావరణం నెలకొన్నది. ఏపీకి కేటాయించిన న్యాయమూర్తులు, పరిపాలనా సిబ్బంది తీవ్రభావోద్వేగాల నడుమ ఉమ్మడి హైకోర్టును వీడి అమరావతికి తరలివెళ్లారు. చివరిరోజైన సోమవారం ఉమ్మడి హైకోర్టులో విధులు ముగించుకున్న ఏపీ న్యాయమూర్తులు.. ఉదయం 11.30 గంటలకు తమ కుటుంబ సభ్యులతో కలిసి అమరావతికి బయల్దేరారు. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు మిగతా న్యాయమూర్తులకు తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, ఇతర న్యాయమూర్తులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇద్దరు చీఫ్ జస్టిస్‌లు కలిసి కేక్ కట్‌చేశారు. హైకోర్టు ప్రాంగణంలో ఏపీ న్యాయమూర్తులు, న్యాయవాదులకు తెలంగాణ న్యాయవాదులు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఇన్నేండ్లు ఎంతో స్నేహపూర్వకంగా కలిసిమెలిసి పనిచేసిన వారంతా ఇప్పుడు విడిపోవాల్సి రావడంతో ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. ఎక్కడ ఉన్నా మనమంతా ఒక్కటేనంటూ వారిని తెలంగాణ న్యాయవాదులు సముదాయించారు. మళ్లీ కలుద్దాం.. హైదరాబాద్‌కు వచ్చినప్పుడు వస్తాం.. ఏపీకి వస్తే మీరు తప్పకుండా రావాలి.. అంటూ ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు.

రైతుబంధుకు మమత జై

అయిదోపేజీ తరువాయి...

ఆర్థికసాయం అందించనున్నట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ సోమవారం ప్రకటించారు. 'క్రిషక్ బంధు' పేరిట ఈ సాయాన్ని రెండు విడుతల్లో అందిస్తామని తెలిపారు. 2019 జనవరి నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తేనున్నారు. మరోవైపు రైతుబీమా పథకం ద్వారా 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసున్న రైతులు ఏ కారణంగా మరణించినా.. రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం బాధిత కుటుంబానికి అందిస్తామని సీఎం మమత స్పష్టంచేశారు. అదేవిధంగా పంట బీమా ప్రీమియంను ప్రభుత్వమే పూర్తిగా చెల్లిస్తుందని తెలిపారు. అయితే.. ఈ పథకాల పూర్తి విధివిధానాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది.

రైతుబంధు అమలుకు సిద్ధమైన జార్ఖండ్!

రైతుకు పంట పెట్టుబడిసాయం అందించేందుకు ఉద్దేశించిన రైతుబంధు పథకాన్ని జార్ఖండ్‌లోనూ అమలుచేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. పథకం అమలు తీరుతెన్నులను అధ్యయనం చేసేందుకు ఇటీవల ఆ రాష్ట్ర అధికారుల బృందం తెలంగాణలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించిన విషయం తెలిసిందే. తెలంగాణ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమావేశమైన జార్ఖండ్ అధికారులు.. రైతుబంధు పథకం అమలు తీరుతెన్నులను తెలుసుకున్నారు. ఇది రైతుల ప్రయోజనాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని భావించి.. జార్ఖండ్‌లో ఎకరానికి ఏడాదికి రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించినట్టు సమాచారం. జార్ఖండ్‌లో సుమారు 22 లక్షలమందికి ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

దేశానికి దిక్సూచిగా రైతుబంధు

రైతును రాజు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టిన రైతుబంధు పథకం దేశానికి దిక్సూచిగా మారింది. వాస్తవానికి ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేసీఆర్ అభిలషిస్తున్నారు. తొలుత ఎకరానికి ఎనిమిదివేలు చొప్పున రెండు విడుతలుగా రాష్ట్రంలోని దాదాపు 53లక్షల మంది రైతులకు పంట సాయం అందించారు. ఈ సాయాన్ని మరో రెండు వేలు పెంచి.. ఏటా పదివేల రూపాయలను పంటసాయంగా అందిస్తామని ఇటీవలి ఎన్నికల్లో కేసీఆర్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ మేరకు రాబోయే వానకాలం సీజన్‌లో ఎకరానికి రూ.5 వేల చొప్పున పంట పెట్టుబడి సాయాన్ని అందించేందుకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ఇదే తరహాలో రైతు ఏదైనా కారణంతో చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడవద్దని భావించిన సీఎం కేసీఆర్.. రైతుబీమా కింద రూ.5 లక్షల పరిహారాన్ని ఆ కుటుంబానికి అందజేస్తూ ఆపత్కాలంలో అండగా నిలుస్తున్నారు. ఈ పథకాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశాలయ్యాయి. వివిధ రాష్ట్రాలు వీటిని అధ్యయనం చేస్తూ.. అమలుకు ఆసక్తి చూపుతున్నాయి.

13 నుంచి 'అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్'

- పతంగుల పండుగకు అనుబంధంగా నిర్వహణ
- ఏర్పాట్లపై పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతర్జాతీయ పతంగుల పండుగకు అనుబంధంగా స్వీట్స్ ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు పర్యాటక, సాంస్కృతికశాఖ సన్నద్ధమవుతున్నది. ఈ నెల 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే ఈ వేడుక ఏర్పాట్లపై సోమవారం ఆశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అధికారులతో సమీక్షించారు. గత ఏడాది నిర్వహించిన స్వీట్ ఫెస్టివల్‌లో 1000 రకాల స్వీట్స్‌తో స్టాల్స్ ఏర్పాటుచేశామని 15 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. స్వీట్స్, పతంగులను ఒకే వేదికపై సందర్శించేందుకు దేశ, విదేశీయులు పెద్దసంఖ్యలో తరలివచ్చారన్నారు. ఈ ఏడాది సుమారు 10 లక్షల మంది సందర్శకులు తరలివస్తారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు.

కోటి ఎకరాల స్వప్న వీక్షణం

అయిదోపేజీ తరువాయి...

చేరుకుంటారు. ఇక్కడ గోదావరి నదిపై తెలంగాణ, మహారాష్ట్ర మధ్య నిర్మిస్తున్న బరాజ్ నిర్మాణ పనులను పరిశీలిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1.50 గంటలకు మేడిగడ్డ నుంచి బయల్దేరి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 2 గంటలకు ఇదే మండలంలోని కన్నెపల్లి వద్ద నిర్మిస్తున్న పంపుహౌజ్‌ను సందర్శిస్తారు. అనంతరం అక్కడే భోజనం చేస్తారు. తర్వాత ఈ పంపుహౌజ్ వద్ద ఉన్న కార్యాలయంలో ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిపై సాగునీటి శాఖ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కన్నెపల్లి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.10 గంటలకు మహదేవపూర్ మండలంలోని అన్నారం వద్ద గోదావరిపై నిర్మిస్తున్న బరాజ్ వద్దకు సీఎం చేరుకుంటారు. అరగంట పాటు ఇక్కడ బరాజ్ నిర్మాణ పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 3.45 గంటలకు పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని సుందిల్ల బరాజ్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 4.15 గంటలకు గోలివాడ పంపుహౌజ్ పనులను పరిశీలించి ఐదు గంటలకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తీగలగుట్టపల్లి వద్ద ఉన్న ఇంటికి చేరుకుంటారు. రాత్రి తీగలగుట్టపల్లిలో బసచేసి బుధవారం ఉదయం 10.30 గంటలకు బయల్దేరి ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో భాగంగా నిర్మించే రాజేశ్వరరావుపేట పంపుహౌజ్‌ను సందర్శిస్తారు. 11.45 గంటలకు మాల్యాల మండలం రాంపూర్ పంపుహౌజ్ నిర్మాణ పనులను పరిశీలించి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బేగంపేట విమానాశ్రయం చేరుకుంటారు.



సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో సోమవారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ పంప్‌హౌస్ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, ఎస్పీ ఆర్ భాస్కరన్, జగిత్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ బేతి రాజేశం, రామగుండం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పెద్దపల్లి జోన్ డీసీపీ సుదర్శన్‌గౌడ్, గోదావరిఖని ఏసీపీ రక్షిత కే మూర్తి తదితరులు వేర్వేగా మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లు, కన్నెపల్లి పంపుహౌజ్, గ్రావిటీ కెనాల్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన కోసం గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా పర్యటన...

సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల పర్యటన ప్రణాళికాబద్ధంగా కొనసాగనుంది. సీఎం సూచన మేరకు సోమవారం హెలికాప్టర్‌లో తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం (ట్రీ) బృందం కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌లు, మూడు పంపుహౌజ్ పనుల పురోగతిని పరిశీలించింది. పనుల పురోగతిపై సీఎం కేసీఆర్‌కు ఫీడ్‌బ్యాక్ ఇచ్చింది. కొన్నిరోజుల కిందట సమీక్ష.. తాజాగా విశ్రాంత ఇంజినీర్ల ఫీడ్‌బ్యాక్‌తో మంగళవారం క్షేత్రస్థాయిలోకి సీఎం వెళుతున్నారు. రెండ్రోజుల పర్యటన తర్వాత ఈ నెల 3 లేదా 4వ తేదీల్లో సమగ్రంగా సమీక్ష నిర్వహించనున్నారు.

శరవేగంగా పనులు

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైనింగ్‌లో భాగంగా రూపొందించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో ప్రధానమైన మేడిగడ్డ బరాజ్ పనులకు సీఎం కేసీఆర్ 2016 మే రెండో తేదీన శంకుస్థాపన చేశారు. పనులను శరవేగంగా కొనసాగించడంతోపాటు.. మరోవైపు అంతర్రాష్ట్ర, సీడబ్ల్యూసీ అనుమతుల ప్రక్రియను అంతే వేగంగా పూర్తిచేశారు. రికార్డుస్థాయిలో జరుగుతున్న కాళేశ్వరం పనుల వేగం దేశ సాగునీటిరంగాన్ని సైతం అబ్బురపరిచింది. సాక్షాత్తూ కేంద్ర జలసంఘం చైర్మన్ సైతం కాళేశ్వరం ప్రాజెక్టు పనులను చూసి అబ్బురపడ్డారు. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌లతోపాటు పంపుహౌజ్‌ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేస్తే రైతులకు సాగునీటి ఫలాలు అందించవచ్చనేది సీఎం కేసీఆర్ సంకల్పం. ఈ క్రమంలోనే ఆయన 2017 డిసెంబరు 6-7 తేదీల్లో స్వయంగా వెళ్లి పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీర్లు, వర్క్‌ఏజెన్సీలకు దిశానిర్దేశం చేశారు. ఆ క్రమంలో గత ఏడాది కాళేశ్వరం కాంక్రీట్ పనుల వేగంలో రికార్డు నమోదైంది. రెండోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్నిరోజుల కిందట తొలిసారిగా సమీక్ష నిర్వహించిన సీఎం కేసీఆర్.. మేడిగడ్డ బరాజ్ నిర్మాణ పనుల వేగవంతానికి మరోసారి దిశానిర్దేశం చేశారు. ఆయన సూచనల మేరకు ఇంజినీర్లు, కంపెనీల ప్రతినిధులు రంగంలోకి దిగడంతోనే గత నెల 22-23 తేదీల్లో కేవలం 24 గంటల్లోనే 16,722 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనుల రికార్డు నమోదైంది. అటు ఎస్సారెస్పీ పునర్జీవ పథకం కూడా అంతేవేగంతో సాగుతున్నది. కాళేశ్వరంతోపాటు ఎస్సారెస్పీ పునర్జీవ పథకంద్వారా ఈ వానకాలం పంటకే సాగునీరు ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆ క్రమంలోనే క్షేత్రస్థాయిలో పనులను స్వయంగా పరిశీలించి.. నిర్ణీత సమయంలో పనుల పూర్తికి చేపట్టాల్సిన చర్యలపై యంత్రాంగానికి దిశానిర్దేశం చేసేందుకు తాజా పర్యటన చేపడుతున్నారు.

గ్రామీణ నిరుద్యోగులకు న్యాక్ ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో న్యాక్ పలు అంశాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకు అర్హత కలిగిన నిరుద్యోగులు కొండాపూర్‌లోని న్యాక్‌లో ఆధార్, విద్య, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆరు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లచ్చిందేవి తలుపు తట్టింది!

- తవ్వకాల్లో ఇద్దరు దినసరి కూలీలకు దొరికిన వజ్రం
- వేలంలో రూ.2.55 కోట్లు పలికిన ధర



భోపాల్: అదృష్టమంటే వీరిదే. లచ్చిందేవి వారి తలుపు తట్టింది. మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాలోని కూలీలు మోతీ లాల్, రఘువీర్ ప్రజాపతి రాత్రికిరాత్రే కోటీశ్వరులయ్యారు. వీరిద్దరు పన్నా మట్టి దిబ్బల్లో వజ్రాల కోసం తవ్వకాలు జరిపారు. అక్టోబర్ 9న వీరికి 42.9 క్యారెట్ల డైమండ్ దొరికింది. 'క్యారెట్‌కు రూ. 6 లక్షల చొప్పున వజ్రానికి తాజాగా నిర్వహించిన వేలంలో రూ.2.55 కోట్ల ధర పలికింది. ఝాన్సీ వ్యాపారి, యూపీ బీఎస్పీ నేత దీన్ని సంయుక్తంగా దక్కించుకున్నారు. 12% రాయల్టీ, పన్నులు మినహా రూ.2.30 కోట్లు మోతీ లాల్, రఘువీర్‌లకు సమంగా మరో నెలలో అందజేస్తాం' అని జిల్లా డైమండ్ పరిరక్షణ అధికారి తెలిపారు.



సోమవారం అమృత్‌సర్‌లో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న యువతులు

న్యూఇయర్‌కు ఘన స్వాగతం

- కొత్త సంవత్సరం వేళ దేశదేశాల్లో వేడుకలు

సిడ్నీ: కొత్త సంవత్సరం 2019కి ఘన స్వాగతం లభించింది. నూతన సంవత్సర సందర్భంగా ప్రపంచమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఆయా దేశాల ప్రజలు పటాకులు పేలుస్తూ, సంగీత వాయిద్యాల హోరుతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. సోమవారం అర్ధరాత్రి గడియారంలో రెండు ముల్లులు 12 మీదికి రాగానే ఆయా దేశాలలో సంబురాలు అంబరాన్నంటాయి. ఆస్ట్రేలియాలో మొదలైన వేడుకలు ఆసియా, యూరోప్, ఆఫ్రికా మీదుగా అమెరికా వరకు కొనసాగనున్నాయి. సూర్యుడు తొలుత ఉదయించే ఆస్ట్రేలియాలో కొత్త వసంతానికి స్వాగతం పలికి సిడ్నీ వాసులు వేడుకలకు నాంది పలికారు. నగరంలోని హార్బర్ బ్రిడ్జ్, ఒపెరా హౌస్ వద్ద జరిగిన వేడుకలకు 15 లక్షల మందికి పైగా హాజరయ్యారు. మునుపెన్నడూలేని రీతిలో 12 నిమిషాలు సాగిన పటాకుల పేలుళ్ల ప్రదర్శన కన్నుల పండువగా నిలిచింది. ఆస్ట్రేలియా 2019ని దేశీయ భాషల సంవత్సరంగా పాటిస్తున్నది. ఉగ్రవాద ముప్పు నేపథ్యంలో ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రముఖ నగరాలలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. హాంగ్‌కాంగ్‌లోని విక్టోరియా హార్బర్‌లో జరిగిన పటాకుల పేలుళ్లు ఆకాశంలో హరివిల్లును ఆవిష్కరించాయి. ఇండోనేషియా రాజధాని జకార్తాలో జరిగిన సామూహిక వివాహ కార్యక్రమంలో వందల సంఖ్యలో జంటలు ఒక్కటయ్యాయి. ఇటీవల సునామీతో అతలాకుతలమైన పలు దీవుల్లో మృతుల గౌరవార్థం వేడుకలను రద్దు చేశారు. జపాన్ వాసులు ఆలయాలకు బారులుదీరారు. రష్యాలో భారీ స్థాయిలో వేడుకలు నిర్వహించారు. మాస్కో నగర పార్కులన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్కేటింగ్ కోసం వెయ్యికిపైగా మంచు మైదానాలను ఏర్పాటు చేశారు. పారిస్ నగరంలో సౌండ్ అండ్ లైట్ షో జరిగింది. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ప్రజలు సంగీత హోరులో మునిగారు. బ్రిటన్ రాజధాని లండన్, స్కాట్లాండ్ రాజధాని ఎడిన్‌బర్గ్‌లోనూ సంబురాలు ఘనంగా జరిగాయి. అనేక తీపి జ్ఞాపకాలతోపాటు కొన్ని చేదు అనుభవాలను మిగిల్చిన 2018కి వీడ్కోలు పలికిన ప్రపంచ ప్రజలు 2019 వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది జపాన్‌లో రగ్బీ ప్రపంచ కప్, ఇంగ్లండ్‌లో క్రికెట్ ప్రపంచ కప్ పోటీలు, ఖతార్‌లో అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జరుగనున్నాయి.

బంగ్లా పీఠం హసీనాదే..

మొత్తం 300కు 288 సీట్లు గెలుచుకున్న అధికార కూటమి

- ప్రతిపక్ష కూటమికి కేవలం ఏడు సీట్లే
- ఫలితాలను అంగీకరించడం లేదన్న విపక్షాలు
- మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్.. కుదరదన్న ఎన్నికల సంఘం
- హసీనాను అభినందించిన ప్రధాని మోదీ, మమతా బెనర్జీ



ఢాకా, డిసెంబర్ 31: బంగ్లాదేశ్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనాకు చెందిన అధికార కూటమి భారీ విజయాన్ని సాధించింది. పార్లమెంట్‌లోని 300 స్థానాలకు గాను అవామీ లీగ్ నేతృత్వంలోని మహా కూటమి 288 సీట్లను గెలుచుకుందని ఎన్నికల సంఘం కార్యదర్శి హిలాలుద్దీన్ అహ్మద్ సోమవారం ప్రకటించారు. హింసాయుత వాతావరణంలో ఆదివారం ఎన్నికలు జరుగగా, ఓట్ల లెక్కింపు సోమవారం మధ్యాహ్నానికి పూర్తయ్యిందని పేర్కొన్నారు. పోలైన ఓట్లలో అధికార కూటమి 82 శాతం సాధించి 96 శాతం సీట్లను గెలుచుకుందని తెలిపారు. ఇక ప్రతిపక్ష జాతీయ ఐక్య ఫ్రంట్ (ఎన్‌యూఎఫ్) 15 శాతం ఓట్లతో కేవలం ఏడు సీట్లలో గెలుపొందిందని చెప్పారు. ఇతరులు మూడు స్థానాలను గెలుచుకున్నారని తెలిపారు. ఒక నియోజకవర్గంలో పోలింగ్‌ను వాయిదా వేయగా, మరో స్థానంలో అభ్యర్థి మరణించిన కారణంగా ఫలితాన్ని ప్రకటించలేదు. ప్రధాని నరేంద్ర మోదీ షేక్ హసీనాకు ఫోన్‌చేసి ఎన్నికల్లో విజయంపై ఆమెకు అభినందనలు తెలిపారు. బంగ్లాదేశ్‌లో అభివృద్ధి పనులకు తమ మద్దతు కొనసాగుతుందని చెప్పారు. నాలుగోసారి బంగ్లా ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న 71 ఏండ్ల హసీనా ఆ పదవిలో వరుసగా మూడోసారి కొనసాగనున్నారు. ఆమె ప్రత్యర్థి, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నాయకురాలు ఖలీదా జియా ప్రస్తుతం అవినీతి కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలను ప్రతిపక్ష ఎన్‌యూఎఫ్ కూటమి తిరస్కరించింది. ఈ ఎన్నికలు పచ్చి బూటకమని, ఫలితాలను తాము అంగీకరించడం లేదని పేర్కొంది. ఎన్నికలను రద్దు చేసి, నిష్పక్షపాతమైన తాత్కాలిక ప్రభుత్వం ఆధ్వర్యంలో మళ్లీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. దేశంలోని దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాలలో అక్రమాలు జరిగాయని ఎన్‌యూఎఫ్ కన్వీనర్ కమల్ హొస్సేన్ ఆరోపించారు. ఈ ఆరోపణలను అధికార అవామీ లీగ్ కూటమి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహమాన్ తోసిపుచ్చారు. ఎన్నికలు జరిగిన తీరుపై స్వదేశీ, విదేశీ పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టుగా తాజా ఎన్నికలు నిర్వహించే ప్రశ్నే లేదని ఈసీ స్పష్టం చేసింది.

నాలుగోసారి పీఠంపై ఉక్కు మహిళ

వరుసగా మూడోసారి మొత్తంగా నాలుగోసారి ప్రధాని పదవిని చేపట్టనున్న షేక్ హసీనా బంగ్లాదేశ్‌లో ఉక్కు మహిళగా.. దేశంలో అత్యధిక కాలం ఆ పదవిలో ఉన్న నేతగా చరిత్ర సృష్టించారు. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు, బంగబంధు షేక్ ముజీబుర్ రెహమాన్ ఐదుగురు సంతానంలో హసీనా అందరికన్నా పెద్దవారు. 1947, సెప్టెంబర్ 28న జన్మించిన హసీనా.. 1968లో అణుశాస్త్రవేత్త ఎంఏ వాజిద్ మియాను పెండ్లాడారు. ఆయన 2009లో మృతి చెందా రు. వారికి ఒక కుమారుడు సజీబ్ వాజిద్ జాక్, కుమార్తె సైమా వాజిద్ హుస్సేన్ పుతుల్ ఉన్నారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లో పాల్గొన్న హసీనా..1975లో తండ్రి, తల్లి, ముగ్గురు సోదరుల దారుణ హత్యల నేపథ్యంలో అవామీలీగ్ పార్టీ నేతగా మారారు. కొంతకాలం భారత్‌లో ప్రవాస జీవితం గడిపారు. 1981లో పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆరేండ్ల ప్రవాసం తర్వాత 1981, మే 17న తిరిగి తన స్వదేశం వెళ్లారు. సైనిక నియంత హుస్సేన్ ముహ్మద్ ఎర్షాద్‌ను గద్దె దింపేందుకు ఆమె 1983లో ఒక కూటమిని ఏర్పాటు చేశారు. ఈ పోరులో 1990లో ఖలీదా జియాకు చెందిన బీఎన్‌పీతోనూ పొత్తు పెట్టుకున్నా తరువాత బద్ధ శత్రువులయ్యారు. గత 28 ఏండ్లలో వారిద్దరూ ఒకరి తరువాత ఒకరుగా ప్రధాని పదవిలో ఉన్నారు. ఖలీదా జియా భర్త, సైనిక పాలకుడు జియావుర్ రెహమాన్‌ను 1996లో ఓడించిన హసీనా తొలిసారి ప్రధాని పదవిని చేపట్టారు. బంగ్లాలో ప్రజాస్వామికంగా ఎన్నికై పూర్తికాలం పదవిలో కొనసాగిన తొలి ప్రధానిగా కూడా హసీనా రికార్డు సృష్టించారు. 2001లో జియా మరోసారి ప్రధానిగా ఎన్నికయ్యారు.

పాక్ దాడిని తిప్పికొట్టిన భారత్ సైన్యం

- ఇద్దరు పాక్ సైనికుల మృతి.. నౌగమ్ సెక్టార్‌లో ఘటన

శ్రీనగర్: భారత్‌పై దాడికి పాకిస్థాన్ పన్నిన కుట్రను భగ్నం చేసినట్లు భారత సైన్యం అధికార ప్రతినిధి సోమవారం తెలిపారు. భారీగా కురుస్తున్న పొగమంచుతో లోపించిన దృశ్య గోచరత, దట్టమైన అడవుల మాటున పాక్ సైనికులుగా భావిస్తున్న వారు అక్రమంగా భారత భూభాగంలోకి రావడానికి ప్రయత్నించారు. ఆదివారం తెల్లవారుజామున నౌగం సెక్టార్ పరిధిలోని నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి ఫార్వర్డ్ పోస్ట్‌పై పాక్ సరిహద్దు యాక్షన్ టీం (బ్యాట్) కాల్పులు జరిపింది. అదే సమయంలో పాక్ బలగాలు ఫిరంగులు, రాకెట్ లాంచర్లతో కాల్పులకు దిగాయి. పాక్ బ్యాట్‌కు భారత్ ధీటుగా సమాధానమిచ్చింది. రాత్రంతా ఇరు పక్షాల మధ్య కాల్పులు జరిగాయి. సరిహద్దుల్లోని వివిధ ప్రాంతాల్లో పరిస్థితి అంచనా కోసం సైన్యం గాలింపు చేపట్టిందని, ఈ క్రమంలో ఇద్దరు పాక్ సైనికులు మరణించారని గుర్తించినట్లు చెప్పారు. వారివద్ద గల శక్తిమంతమైన పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీంతో పాక్ సైన్యం భారీగా దాడికి ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తున్నదని భారత్ సైన్యం అధికార ప్రతినిధి తెలిపారు.మరి కొందరు చొరబాటుదారులు తప్పించుకుని పారిపోయి ఉండవచ్చునని అనుమానిస్తున్నామన్నారు. మృతులు పాక్ సైనికుల దుస్తులు ధరించి ఉన్నారని తెలిపారు. ఆ మృతదేహాలను స్వాధీనం చేసుకోవాలని పాక్‌కు తెలిపామన్నారు. భారత్ భూభాగంపై దాడి చేసేందుకు పాక్ సైనికులు పన్నిన కుట్రను భగ్నం చేసినందుకు జవాన్లను సైనికాధికారులు అభినందించారు.

మండోలి జైలుకు సజ్జన్‌కుమార్

- 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో ఇటీవల దోషిగా తేలిన కాంగ్రెస్ మాజీ నేత
- సోమవారం కోర్టు ఎదుట లొంగుబాటు.. జైలుకు తరలింపు



న్యూఢిల్లీ: సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషిగా తేలిన కాంగ్రెస్ మాజీ నేత సజ్జన్‌కుమార్‌ను కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు సోమవారం మండోలి జైలుకు తరలించారు. 1984నాటి అల్లర్ల కేసులో ఈ నెల 17న ఢిల్లీ హైకోర్టు తీర్పును చెప్పింది. అభియోగాలు ఎదుర్కొన్న ఆరుగురిని దోషులుగా తేల్చిన కోర్టు.. సజ్జన్‌కు మరణించేవరకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. డిసెంబర్ 31లోగా లొంగిపోవాలని కోర్టు గడువు విధించింది. తనకు మరో నెల గడువు పొడిగించాలన్న ఆయన అభ్యర్థనను జడ్జి అంగీకరించలేదు. దీంతో సోమవారం మెట్రోపాలిటన్ కోర్టు ముందు సజ్జన్‌కుమార్ లొంగిపోయాడు. శిక్ష అమలుకోసం ఉత్తర ఢిల్లీలోని మండోలి జైలుకు ఆయనను తరలించాలని మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ అదితి గార్గ్ ఆదేశించారు. తనను తీహార్ జైలుకు పంపాలన్న సజ్జన్‌కుమార్ అభ్యర్థనను జడ్జి తిరస్కరించారు. మండోలి జైల్లోనే.. సిక్కు ఖైదీలకు దూరంగా ఉంచేలా చూడాలన్నారు. తర్వాత పోలీసులు సజ్జన్‌కుమార్‌ను మండోలి జైలుకు తరలించారు. ఇదే కేసులో పదేండ్ల జైలుశిక్ష ఖరారైన మాజీ ఎమ్మెల్యేలు కిషన్ ఖోకర్, మహేందర్‌యాదవ్ కూడా కోర్టు ముందు లొంగిపోయారు.

రష్యాలో ఓ నివాస భవనంలో భారీ పేలుడు

- నలుగురు మృతి.. 70 మంది ఆచూకీ గల్లంతు

మాస్కో, డిసెంబర్ 31: రష్యాలోని మాగ్నిటోగార్స్క్‌లోగల ఓ నివాస భవనంలో జరిగిన భారీ పేలుడులో ఓ భవనం కుప్పకూలి నలుగురు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. కాగా 70 మంది ఆచూకీ తెలియడం లేదని అధికారులు తెలిపారు. మాస్కోకు 1700 కి.మీ.ల దూరంలోని పారిశ్రామిక నగరమైన మాగ్నిటోగార్స్క్‌లో స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉదయం ఆరు గంటలకు గ్యాస్ వల్ల పేలుడు సంభవించిందని పేర్కొన్నారు. పేలుడు కారణంగా కొత్త సంవత్సరం ప్రారంభంలో వందల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారని వారు వాపోయారు. భవన శిథిలాల కింది నుంచి 28 మందిని కాపాడామని, మరో 70 మంది ఆచూకీ తెలియడం లేదని తెలిపారు. అయితే 50 మంది వరకు శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చునని జాతీయ టెలివిజన్ తెలిపింది.



పేలుడు ధాటికి కుప్పకూలిన భవనం

సూట్‌కేసుల్లో ఖషోగ్గి శరీర భాగాలు తరలింపు

- సీసీటీవీ ఫుటేజితో వెలుగులోకి...



అంకారా, డిసెంబర్ 31: టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లోని సౌదీ దౌత్య కార్యాలయంలో దారుణ హత్యకు గురైన వాషింగ్టన్ పోస్ట్ జర్నలిస్ట్ జమాల్ ఖషోగ్గి శరీర భాగాలను ముగ్గురు వ్యక్తులు తరలిస్తున్న సీసీటీవీ ఫుటేజీ తాజాగా వెలుగులోకి వచ్చింది. దౌత్య కార్యాలయానికి సమీపంలోనే ఉన్న సౌదీ దౌత్యాధికారి నివాసానికి ముగ్గురు వ్యక్తులు ఐదు సూట్‌కేసులు, రెండు పెద్ద బ్యాగులు తీసుకెళ్తున్నట్లు ఫుటేజీలో రికార్డయింది. ఆ బ్యాగుల్లో ఖషోగ్గి శరీర భాగాలను తరలించినట్లు టర్కీ ఉన్నతాధికారులు వెల్లడించినట్లు ఏ హ్యాబర్ టీవీ చానల్ పేర్కొంది. అక్టోబర్ 2న ఖషోగ్గి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. తనకు వ్యతిరేకంగా కథనాలు రాయడంతో సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ 15 మంది బృందాన్ని పంపించి ఖషోగ్గిని హత్య చేయించారని టర్కీ ఆరోపిస్తున్నది.

ట్రిపుల్ తలాక్‌పై ప్రతిష్టంభన!

- పెద్దల సభలో గట్టెక్కని బిల్లు.. అడ్డుకున్న విపక్షం
- ఎంపిక కమిటీకి ప్రతిపాదిత బిల్లును పంపాలని డిమాండ్
- గందరగోళం మధ్య రేపటికి రాజ్యసభ వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: అధికార, విపక్ష పార్టీల పోరుతో ట్రిపుల్ తలాక్ బిల్లుపై ప్రతిష్టంభన నెలకొంది. విపక్షాల ఆందోళనల మధ్యే సోమవారం రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే దీనిపై మధ్యాహ్నం చర్చను చేపట్టాల్సి ఉండగా, ప్రతిపక్షం వ్యూహాత్మకంగా దానిని అడ్డుకున్నది. దీంతో సోమవారంనాడు బిల్లుపై ఎలాంటి చర్చ జరుగకుండానే సభ వాయిదా పడింది.ముస్లిం సామాజికవర్గంలో మూడుసార్లు తలాక్ చెప్పి భార్యకు విడాకులు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని 2018 మే నెలలో సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఈ క్రమంలో ముందుగా ఆర్డినెన్స్ తీసుకువచ్చిన కేంద్రం.. ఆ తర్వాత లోక్‌సభలో ఇటీవల బిల్లును ప్రవేశపెట్టింది ఆమోదం పొందింది. అయితే రాజ్యసభలో బిల్లును పాస్ చేయించుకోవడం అధికారపక్షానికి సవాల్‌గా మారింది. పెద్దల సభలో ప్రభుత్వానికి సంఖ్యాబలం తక్కువగా ఉండటం, దీనికితోడు ఇతర పార్టీల నుంచి మద్దతు లభించకపోవడంతో బిల్లుపై ప్రతిష్టంభన నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ముస్లిం మహిళల (వివాహ హక్కుల రక్షణ) బిల్లు-2018ను పెద్దల సభలో ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపాదిత బిల్లులో అనేక లోపాలున్నాయని, దానిని సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందుకు తిరస్కరించడంతో రాజ్యసభలో గందరగోళం కొనసాగింది. విపక్షం ఎంతకీ వెనక్కి తగ్గకపోవడంతో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ రాజ్యసభను జనవరి 2కు వాయిదా వేశారు.




రాజ్యసభలో ఆందోళన చేస్తున్న విపక్షాలు

లోక్‌సభలోనూ గందరగోళం

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు అంశంపై కాంగ్రెస్ సోమవారం కూడా లోక్‌సభలో ఆందోళనకు దిగింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేయాలని పట్టుబట్టింది. అయితే సభలో చర్చ జరిపేందుకు తాము సిద్ధమేనని, అయితే ప్రతిపక్షం ఆ చర్చ నుంచి పారిపోవద్దని ప్రభుత్వం పేర్కొన్నది. మరోవైపు ప్రత్యేక హోదాకు సంబంధించి టీడీపీ, కావేరీ నదీజలాల అంశంపై అన్నాడీఎంకే సభ్యులు నిరసనలకు దిగారు. దీంతో తొలుత 50 నిమిషాలపాటు వాయిదా పడిన లోక్‌సభ.. తర్వాత రోజంతా పలుమార్లు వాయిదా పడుతూనే సాగింది. ఈ గందరగోళం మధ్య ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సవరణ బిల్లు సభ ఆమోదం పొందింది.

సీఐసీగా సుధీర్ భార్గవ

- మరో నలుగురు సమాచార కమిషనర్ల నియామకం
- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర




న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ (సీఐసీ)గా సుధీర్ భార్గవ నియమితులయ్యారు. ఆయనతోపాటు మరో నలుగురిని సమాచార కమిషనర్లుగా నియమిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆర్‌కే మాథుర్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారి యశ్వర్ధన్ కుమార్ సిన్హా, మాజీ ఐఆర్‌ఎస్ అధికారి వనజ ఎన్ సర్నా, మాజీ ఐఏఎస్ అధికారి ఎన్‌కే గుప్తా, మాజీ లా సెక్రటరీ సురేశ్‌చంద్రలను సమాచార కమిషనర్లుగా నియమించారు. కాగా, ఈ విషయమై కేంద్రం పారదర్శకత పాటించలేదని అంజలీ భరద్వాజ, రిటైర్డ్ కమాండర్ లోకేశ్ బత్రా ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కేంద్రం ఉల్లంఘించిందన్నారు. ఎక్కువ మంది బ్యూరోక్రాట్లను సమాచార కమిషనర్లుగా నియమించడమేమిటని కేంద్ర సమాచార మాజీ కమిషనర్ శ్రీధర్ ఆచార్యులు ప్రశ్నించారు.

జాదవ్ కేసు.. పాక్ సెల్ఫ్‌గోల్

కుల్‌భూషణ్ కేసుతో సారూప్యమున్న మరో కేసులో ఐసీజే తీర్పునకు పాక్ మద్దతు

న్యూఢిల్లీ: గూఢచర్యం ఆరోపణలపై పాకిస్థాన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్(47) కేసును పోలిన మరో ఉదంతంలో అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) తీర్పునకు పాక్ మద్దతు తెలిపింది. తద్వారా జాదవ్ కేసులోనూ భారత వాదనకు పరోక్షంగా బలం చేకూర్చినట్లయ్యింది. 2004 నాటి కేసులో.. ఉరిశిక్ష విధించిన అవెనా, పలువురు మెక్సికన్ జాతీయులకు తమ దౌత్య సిబ్బందిని కలుసుకునే అవకాశాన్ని అమెరికా ఇవ్వలేదు. దీనిపై అమెరికా ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుపట్టిన అంతర్జాతీయ న్యాయస్థానం.. అది వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నది. ఉరిశిక్ష విధించిన అంతర్జాతీయ ఖైదీలు తమ దేశ దౌత్యసిబ్బందితో సంప్రదించకుండా నిరోధించడం హక్కులను కాలరాయడమేనని స్పష్టంచేసింది. ఈ తీర్పుపై జరిగిన ఓటింగ్‌లో భారత్‌తో పాటు పాక్ కూడా తీర్పునకు మద్దతిచ్చింది. అయితే మరణశిక్షను ఎదుర్కొంటున్న కుల్‌భూషణ్ ఉదంతంలోనూ భారత దౌత్యాధికారులు ఆయనను సంప్రదించకుండా పాక్ నిరోధిస్తూ వచ్చింది. అవెనా కేసులో ఐసీజే తీర్పునకు మద్దతివ్వడం ద్వారా పరోక్షంగా పాక్ తన తప్పిదాన్ని అంగీకరించినట్లయ్యింది.



స్టాంపు పేపర్ల కుంభకోణంలో తెల్గీ నిర్దోషి

- అతడు చనిపోయిన ఏడాదికి తీర్పు చెప్పిన నాసిక్ కోర్టు



నాసిక్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోట్ల రూపాయల నకిలీ స్టాంప్ పేపర్ల కుంభకోణం కేసులో ప్రధాన సూత్రధారి అబ్దుల్ కరీం తెల్గీ సహా ఏడుగురు నిందితులను మహారాష్ట్రలోని నాసిక్ కోర్టు సోమవారం నిర్దోషులుగా ప్రకటించింది. నిందితులకు వ్యతిరేకంగా ఆధారాలు లేక వారిని విడుదల చేస్తున్నట్లు తెలిపింది. విషాదమేమిటంటే తెల్గీ మరణించిన ఏడాది తర్వాత ఈ తీర్పు వచ్చింది.ఈ కేసులో 2001లో తెల్గీని అరెస్టు చేయగా, 2004 ఆగస్టులో సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది. తెల్గీకి ఈ కేసులో కోర్టు 30 ఏండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.202 కోట్ల భారీ జరిమానా విధించింది.పరప్పన జైల్లో శిక్షను అనుభవిస్తుండగానే తెల్గీ 2017లో మరణించాడు.

అలాగైతేనే మద్దతు

- ఎంపీ, రాజస్థాన్‌లలో కాంగ్రెస్‌కు మాయావతి అల్టిమేటం



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలకు బీఎస్పీ అధినేత్రి మాయావతి ఝలక్ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాల నిరోధక చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దని ఏప్రిల్‌లో జరిగిన భారత్‌బంద్‌లో పాల్గొన్న ఆందోళనకారులపై మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో నమోదైన కేసులను ఎత్తివేయాలని మాయావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక లేఖ విడుదల చేశారు. ఆ కేసులను కొట్టివేయకపోతే ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకుంటామని సోమవారం ఆమె స్పష్టం చేశారు.

సోనియా, రాహుల్ జోక్యం చేసుకోలేదు

- రక్షణ ఒప్పందాల్లో వారి ప్రమేయం లేదు
- అగస్టా వెస్ట్‌ల్యాండ్ కేసులో బీజేపీ అసత్యాలను సృష్టిస్తున్నది: ఆంటోనీ



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: యూపీఏ హయాంలో కుదిరిన రక్షణ ఒప్పందాల్లో సోనియా గాంధీ,రాహుల్‌గాంధీ ఏనాడూ జోక్యం చేసుకోలేదని మాజీ రక్షణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోనీ స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరుస్తూ అగస్టా వెస్ట్‌ల్యాండ్ కేసులో బీజేపీ ప్రభుత్వం అసత్యాలను సృష్టిస్తున్నదని మండిపడ్డారు. పార్లమెంట్ ఆవరణలో ఆదివారం ఆంటోనీ మీడియాతో మాట్లాడారు. కేంద్రం ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ కేసుపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించినది యూపీయే ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. రాఫెల్ ఒప్పందంపై తమ పార్టీ చేస్తున్న ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు బీజేపీ ప్రభుత్వం యత్నిస్తున్నదని విమర్శించారు.

ఈ 'ఫ్యామిలీ బామ్' ఏంటో తెలుసా?: అమిత్‌షా

మరోవైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా సోమవారం వరుస ట్వీట్లలో 'గాంధీ'లపై విరుచుకుపడ్డారు. 'మిసెస్ గాంధీకి సంబంధించిన ప్రశ్నల వివరాలను మిషెల్ తన లాయర్‌కు ఎందుకు పంపాడో ఎవరికైనా తెలుసా? వాటిని మిసెస్ గాంధీకే అతడు చేరవేయాలనుకున్నాడా? ఎందు కు?' అని షా ప్రశ్నించారు. మిషెల్ తన కిచ్చిన చీటీలో మందుల వివరాలు ఉంటాయేమోనని భావించానని మిషెల్ లాయర్ పేర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. జెండూబామ్, టైగర్ బామ్ గురించి తెలుసు.. అయితే మధ్యవర్తి కోరుతున్న ఈ 'ఫ్యామిలీ బామ్' ఏంటో ఎవరికైనా తెలుసా? అని షా వ్యంగ్యంగా ప్రశ్నించారు.

కిడ్నాప్ చేసి.. జైలుకు తీసుకెళ్లి..

- ఆస్తి పత్రాలపై సంతకాలు
- యూపీలో దారుణం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికార దుర్వినియోగం, అక్రమ లావాదేవీలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. లక్నోకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మోహిత్ జైస్వాల్‌ను ఆయన ఇంటి వద్ద నుంచే అతిఖ్ అహ్మద్ అనే రాజకీయ నాయకుడు-అండర్ వరల్డ్ డాన్ అనుచరులు కిడ్నాప్ చేసి, దేవరియా జైలు లోపలికి తీసుకెళ్లి చిత్ర హింసలకు గురిచేశారు. రూ.40 కోట్ల విలువ చేసే ఆస్తి పత్రాలపై బలవంతంగా సంతకం చేయించుకుని తిరిగి మోహిత్ జైస్వాల్‌ను ఆయన ఇంటి వద్ద వదిలేసి వెళ్లారు. ఈ ఘటనపై సమగ్ర నివేదిక సమర్పించాలని జైలర్‌ను ఆదేశించినట్లు డియోరియా జిల్లా ఎస్పీ తెలిపారు.



రైల్వే బోర్డు చైర్మన్‌గా వీకే యాదవ్

న్యూఢిల్లీ: రైల్వేబోర్డు చైర్మన్‌గా వినోద్‌కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఆయన ఇప్పటివరకూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. దక్షిణమధ్య రైల్వే జీఎంను రైల్వేబోర్డు చైర్మన్‌గా నియమించటం ఇదే ప్రథమం. యాదవ్ 1980వ బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వే సర్వీస్ అధికారి. రైల్వేబోర్డు చైర్మన్‌గా ఉన్న అశ్వినీ లోహానీ సోమవారం పదవీ విరమణ చేశారు.

ప్రముఖ కన్నడ నటుడు లోకనాథ్ కన్నుమూత



బెంగళూరు: ప్రముఖ కన్నడ నటుడు సీహెచ్ లోకనాథ్ (91) గుండెపోటుతో సోమవారం కన్నుమూశారు. ఆయనకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు. లోకనాథ్ సుమారు ఆరు దశాబ్దాలపాటు 650కి పైగా చలన చిత్రాలు, సీరియళ్లు, వెయ్యికి పైగా నాటకాల్లో నటించారు.లోకనాథ్.. 1970లో 'సంస్కార' చిత్రంతో చలనచిత్ర రంగంలోకి అరంగేట్రం చేశారు. ఈ సినిమాలో ఆయన పాత్రకు జాతీయ అవార్డు కూడా లభించింది. శంకర్‌నాగ్ దర్శకత్వంలో 'యాక్సిడెంట్' అనే చిత్రం లో లోకనాథ్ నటించారు. భూతయ్యన మాగ అయ్యు, మించిన ఒట, నగరహావు, నోది స్వామి నవిద్రు హీగె, కథా సంగమ, కిట్టు పుట్టు చిత్రాలు ఆయనకు పేరు తెచ్చి పెట్టాయి.




ముస్లింల రిజర్వేషన్లు, మహిళల సాధికారత, ఆర్థికాభివృద్ధి గురించి మోదీకి ఎన్నోసార్లు విన్నవించాను. ఆయన మత ప్రాతిపదికన తిరస్కరించారు. ఇప్పుడు ట్రిపుల్ తలాక్ బిల్లు తెచ్చి ముస్లిం మహిళలకు మరిన్ని కష్టాలు తెచ్చారు. ఈ బిల్లుతో బీజేపీ ముస్లింల ఇండ్లల్లోకి ప్రవేశిస్తున్నది.

మెహబూబా ముఫ్తీ, పీడీపీ అధినేత్రి

ట్రిపుల్ తలాక్ బిల్లును ఎవరూ వ్యతిరేకించటం లేదు. కానీ దానికి సవరణలు అవసరమని మాత్రమే అంటున్నాం. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కోరుతున్నాం. లోక్‌సభలో బిల్లు పాసైనంత మాత్రాన రాజ్యసభ రబ్బర్ స్టాంపు కాదు. ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ బిల్లుతో రాజకీయం చేస్తున్నది.

ఆనంద్ శర్మ, కాంగ్రెస్ సీనియర్ నేత



చరిత్రలో నేడు



1785

టైమ్స్ ఆఫ్ లండన్ ఆధ్వర్యంలో 'డెయిలీ యూనివర్సల్ రిజిష్టర్' ప్రచురణ ప్రారంభం.

1801



గ్రేట్ బ్రిటన్‌లో విలీనం కావాలని తీర్మానం చేసిన ఐరిష్ పార్లమెంట్. 'యునైటెడ్ కింగ్‌డమ్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్' అవతరణ.



1916

'జర్నల్ ఆఫ్ నీగ్రో హిస్టరీ' ప్రచురణ ప్రారంభం.

ఉత్తరాదిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాల్లో పరాజయం పాలైన తర్వాత బీజేపీ నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. 2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీకి పూర్వవైభవం తెచ్చేందుకు దేశవ్యాప్తంగా రుణమాఫీని ఆయుధంగా చేసుకోవాలని చూస్తున్నది. ఈ నేపథ్యంలో జనవరి 11, 12 తేదీల్లో ఢిల్లీలో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పార్టీకి దిశానిర్దేశం చేసేందుకు సమాయత్తమవుతుండటం గమనార్హం.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

ఉత్తరప్రదేశ్ నోయిడాలో ఓ కమ్యూనిటీ పార్క్‌లో ముస్లింలు ప్రార్థన చేసుకోవటం, ఆ సందర్భంలో స్థానిక పోలీసులు వ్యవహరించిన తీరు వివాదాస్పదం అవుతున్నది. అలాగే పార్క్‌ను నీటితో తడుపటం అనేది ప్రార్థనకు ఆటంకం కలిగించేందుకే చేశారని ఆరోపిస్తున్న వారూ ఉన్నారు. ఇదిలా ఉంటే బహిరంగ ప్రదేశాల్లో ఆరెస్సెస్ నిర్వహించే శాఖలను కూడా నియంత్రిస్తారా? అని కాంగ్రెస్ నిలదీస్తున్నది. ఏదేమైనా మతపరమైన ప్రార్థనలు బజారుకెక్కటం, వివాదాలకు కేంద్రం కావటం అవాంఛనీయం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

హసీనా విజయం

బంగ్లాదేశ్ ఎన్నికలు జరుగడం ప్రజాస్వామ్య సుస్థిరతకు సూచిక అయితే, షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ మళ్లా విజయం సాధించడం భారత్‌కు అనుకూలమైన పరిణామంగా చెప్పుకోవచ్చు. షేక్ హసీనా అధికారానికి రావడం ఇది నాలుగవ సారి. కాగా వరుసగా ప్రధాని పదవి చేపట్టడం ఇది మూడవసారి. ఎన్నికలు జరిగిన మూడు వందల స్థానాల్లో హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్, మిత్రపక్షాలు 288 స్థానాలు గెలుచుకోవడం అసాధారణం. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య స్థాపనకు ఉద్యమించడంతో పాటు, ప్రధానిగా దేశాభివృద్ధిలో హసీనా పాత్ర చరిత్రాత్మకమైనది. ఈ ఎన్నికల్లో భారత వ్యతిరేక శక్తులు విజయం సాధిస్తాయేమోననే ఆందోళనను కొందరు వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ అధికారానికి వచ్చిన తర్వాత ఇరుగుపొరుగు దేశాల్లో భారత్ ప్రాబల్యం తగ్గడం ఇటువంటి అనుమానాలకు ఒక కారణం. అసోంలో జాతీయ పౌర పట్టిక తయారుచేయడం ద్వారా బంగ్లాదేశ్‌కు చెందిన ఒక మతం వారి భవిష్యత్ ఆందోళనకరంగా మారుతున్నదనే వార్త ప్రచారం పొందింది. రోహింగ్యాల విషయంలో భారత్ బర్మాతో కలిసి బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు వచ్చాయి. మనదేశంలో గో రక్షణ పేర సాగుతున్న దాడులు కూడా బంగ్లాదేశ్‌లో చర్చనీయాంశమయ్యాయి. భారత్ తన పెట్టుబడులను పెంచుకుంటూ బంగ్లాదేశ్‌పై పట్టు బిగిస్తున్నదనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ ప్రచారాలు, పరిణామాలు భారత్‌కు మొదటినుంచి మిత్రపక్షంగా ఉండే అవామీ లీగ్‌పై వ్యతిరేక ప్రభావం చూపుతాయనే ఆందోళన ఉండేది. కానీ బంగ్లా ప్రజలు అవామీ లీగ్‌కు గతంలో ఎన్నడూ లేనంత మెజార్టీని కట్టబెట్టారు.

షేక్ హసీనా విజయం సాధించిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. భారత ప్రజల హృదయాల్లో బంగ్లాదేశ్‌కు ప్రత్యేక స్థానం ఉన్నది. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని భారత ప్రజలు కాంక్షించారు, తోడ్పడ్డారు. కానీ ఒక అగ్రరాజ్యం కుట్ర మూలంగా సైనిక తిరుగుబాటు జరిగి, బంగ్లాదేశ్ భారత్‌కు వ్యతిరేకంగా మారిపోయింది. ఆ తర్వాత ఇంత కాలానికి మళ్ళా రెండు దేశాల బంధం బలపడ్డది. హసీనా అధికారానికి వచ్చిన నాటినుంచి రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలపడ్డాయి. బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక తీవ్రవాద సంస్థలకు స్థానం లేకుండాపోయింది. రైలుమార్గాల విషయంలోనూ పురోగతి ఉన్నది. కొంత సముద్ర తీరం, మరి కొంత బర్మాతో సరిహద్దును మినహాయిస్తే భారత్ బంగ్లాదేశ్ చుట్టూరా ఉంటుంది.

హసీనా విజయం సంగతి ఎట్లా ఉన్నప్పటికీ, బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరిగిన తీరుపై విమర్శలు కూడా ఉన్నాయి. ఎన్నికలు స్వేచ్ఛగా జరుగలేదని ప్రతిపక్షాలు విమర్శించడంతో పాటు కొన్ని అంతర్జాతీయ సంస్థలు కూడా అభిప్రాయపడ్డాయి. దాదాపు వంద మంది అభ్యర్థులు పోలింగ్‌కు ముందే తాము పోటీ నుంచి తప్పుకుంటున్నామని ప్రకటించారు. ప్రతిపక్ష నేత బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధ్యక్షురాలు ఖలీదా బేగం అవినీతి ఆరోపణలతో జైలుశిక్ష అనుభవిస్తున్నారు. అంటే ఎన్నికలకు ముందే ప్రతిపక్ష పార్టీ బలహీనంగా, సమర్థవంతమైన నాయకత్వం లేకుండా ఉన్నది. హింసాయుత ఘటనలు కూడా బాగా జరిగాయి. ఎన్నికల్లో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నప్పటికీ, హసీనా గెలుపును తక్కువచేసి చూడకూడదు. పాకిస్థాన్‌తో పాటు బంగ్లాదేశ్ మొదటినుంచి సైనిక పాలనలో నలిగిపోయిన దేశం. బంగ్లాదేశ్‌లో ఇప్పుడిప్పుడే ప్రజాస్వామిక వ్యవస్థలు కుదుటపడుతున్నాయి. గతంలో ఎన్నికలు జరిగినప్పుడు హసీనా నాయకత్వంలోని అవామీలీగ్ బహిష్కరించిన సందర్భాలున్నాయి. ఇదేవిధంగా గత రెండు ఎన్నికలను ప్రతిపక్ష పార్టీ బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ ఎన్నికలను బహిష్కరించింది. కానీ తాజా ఎన్నికల్లో అన్ని పక్షాలు ఎన్నికల్లో పాల్గొన్నాయి. సైనిక జోక్యం లేకుండా క్రమబద్ధంగా ఎన్నికలు జరుగుతున్నా యి. సైన్యం కన్నా ప్రజా ప్రభుత్వమే బలంగా ఉండి రాజ్యాన్ని నడుపుతున్నది. ప్రజాస్వామ్య వ్యవస్థకు అలవాటు పడినందుకు బంగ్లాదేశ్ రాజకీయపక్షాలను, ప్రజలను అభినందించవలసిందే. గత దశాబ్ద కాలంలో హసీనా నాయకత్వంలో వివిధ రంగాల్లో బంగ్లాదేశ్ సాధించిన అభివృద్ధిని కూడా అంతర్జాతీయ ప్రముఖులు ప్రశంసిస్తున్నారు.

షేక్ హసీనా విజయం సాధించిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. భారత ప్రజల హృదయాల్లో బంగ్లాదేశ్‌కు ప్రత్యేక స్థానం ఉన్నది. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని భారత ప్రజలు కాంక్షించారు, తోడ్పడ్డారు. కానీ ఒక అగ్రరాజ్యం కుట్ర మూలంగా సైనిక తిరుగుబాటు జరిగి, బంగ్లాదేశ్ భారత్‌కు వ్యతిరేకంగా మారిపోయింది. ఆ తర్వాత ఇంతకాలానికి మళ్ళా రెండు దేశాల బంధం బలపడ్డది. హసీనా అధికారానికి వచ్చిన నాటినుంచి రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలపడ్డాయి. బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక తీవ్రవాద సంస్థలకు స్థానం లేకుండాపోయింది. రైలుమార్గాల విషయంలోనూ పురోగతి ఉన్నది. కొంత సముద్ర తీరం, మరికొంత బర్మాతో సరిహద్దును మినహాయిస్తే భారత్ బంగ్లాదేశ్ చుట్టూరా ఉంటుంది. వారు మాట్లాడేది బెంగాలీ భాష. భారత్‌తో చారిత్రక అనుబంధం తెంపుకున్నా తెగనిది. అయినప్పటికీ ఇటీవలి కాలంలో చైనా ప్రభావం భారత్ చుట్టూరా దేశాలలో పెరుగుతున్నది. నేపాల్, భూటాన్ పరిణామాలు ఆందోళనకరంగా మారాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ గెలువడం భారత్‌కు ఎంతో ఊరట కలిగిస్తున్నది. అయితే చిన్న దేశమే కదా అనే చులకన అభిప్రాయం లేకుండా ఇరుగుపొరుగు దేశాల పట్ల సంబంధాలలో భారత్ ఎంతో జాగ్రత్తగా మసలుకోవాలె. అక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా వ్యవహరించాలె. ఏ పార్టీ వచ్చినా భారత్‌తో అనుసరించే విధానం మారకుండా ప్రజాస్వామ్యశక్తులకు మద్దతు ఇవ్వాలె.

జనగళం

కొత్త ఆశలతో..



పల్లవి: కొత్త ఆశలతో– సరికొత్త ఊహలతో
తరగెత్తుమంటోంది.. కాల తరంగం
కొత్త చేతనతో–సరికొత్త ఊపిరితో
పరుగెత్తుమంటోంది జీవిత రంగం.. ||కొ||

చరణం: మోడు వారినా తరువులు కూడా
మొగ్గలు తొడగాలని చూస్తాయి
బీడు వారిన నేలలు కూడా
పంటచేలుగా పరవశిస్తాయి
చింతల చీకటి బతుకులో కూడా
చిరునవ్వులు ఉదయిస్తాయి
ఎంతటి అపజయములు ఎదురైనా
ఎపుడో విజయాల్నందిస్తాయి..||కొ||

చరణం: పూలు పూయని గరికలు కూడా
పుణ్య తిథుల ప్రాధాన్యము పొందును
దీన జనుల దుర్భర జీవనము
దివ్య దశలనూ పొందితీరును
నిరాశ–నిస్పృహలన్నీ వదలి
నిత్య చైతన్య దీప్తితో కదలి
కదం దొక్కితే కర్మ జ్వలించు
కనులు తెరిస్తే ప్రగతి ఫలించు.. ||కొ||

– డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, 92465 41699

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

న్యాయం



మంగారి రాజేందర్

ఆత్మగౌరవ ప్రతీక హైకోర్టు

హైదరాబాద్‌లోనే రెండు హైకోర్టులు పనిచేసే విధంగా సౌకర్యాలను కల్పిస్తామని తెలంగాణ ప్రభుత్వం సంసిద్ధతను సుప్రీంకోర్టుకు తెలిపింది. 2018 డిసెంబర్ 15 నాటికి హైకోర్టు ఏర్పాటుకు పూర్తి సౌకర్యాలు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున న్యాయవాది చెప్పారు. ఏపీలో హైకోర్టు ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాల పట్ల హైకోర్టు న్యాయమూర్తులు సంతృప్తి చెందడాన్ని కూడా సుప్రీంకోర్టు నమోదు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కేంద్రం ఏపీ హైకోర్టు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసింది.

తెలంగాణ ప్రజల జీవితంలో మరో తేదీ అత్యంత ప్రాముఖ్యం సంతరించుకునే వేళ ఇది. అదేమిటంటే 2019 జనవరి 1. 2014 జూన్ 2 ఎంత ముఖ్యమైన రోజో ఇదీ అంతే ముఖ్యమైన రోజు. తెలంగాణ ప్రజల పుట్టినరోజులు, వివాహ తేదీల కన్నా ఇవి చాలా విలువైన తేదీలు. జూన్ 2న తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవిస్తే, 2019 జనవరి1న (అంటే నేడు) హైదరాబాద్ హైకోర్టు తెలంగాణ రాష్ట్రానికే పరిమితమై కొత్త హైకోర్టుగా ఆవిర్భవిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రాధాకృష్ణన్ నేడు ప్రమాణం చేస్తారు. అదేవిధంగా తెలంగాణకు కేటాయించిన హైకోర్టు న్యాయమూర్తులు కూడా నేడే ప్రమాణం చేస్తున్నారు.

ఈ రెండు తేదీలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నాలు. రెండవ శ్రేణి ప్రజలస్థాయి మొదటిశ్రేణి ప్రజలుగా తెలంగాణ ప్రజలు రూపాంతరం చెందుతున్న క్రమం ఇది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి స్వపరిపాలన ఏర్పడినప్పటికీ, సంపూర్ణ తెలంగాణ ఏర్పడలేదు. తెలంగాణ న్యాయవాదులు మరీ ముఖ్యంగా తెలంగాణ న్యాయమూర్తులు వివక్షకు గురయ్యారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా, ఇక్కడి న్యాయమూర్తులు తమ అభీష్టానికి వ్యతిరేకంగా ఏపీలో పనిచేసే పరిస్థితి ఏర్పడింది. కనీసం ఆ న్యామూర్తులను తెలంగాణకు తీసుకువచ్చే ప్రయత్నం కూడా ఉమ్మడి హైకోర్టు చేయలేదు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తెలంగాణ న్యాయమూర్తులు వివక్షకు గురికావడం విషాదకరమైన పరిస్థితి. 2014 జూన్ 2 నాటికే కింది కోర్టుల న్యాయమూర్తుల విభజన జరిగి ఎవరి రాష్ర్టాలను వారికి కేటాయించాలి. ఆ విధంగా హైకోర్టు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దేశంలో న్యాయమూర్తులు ఊరేగింపు చేసే పరిస్థితి ఏర్పడి, చాలా కష్టనష్టాలకు తెలంగాణ న్యాయమూర్తులు గురయ్యారు. ఆంధ్రా సీనియర్ న్యాయమూర్తులు తెలంగాణ ప్రభుత్వాన్ని, తెలంగాణ అధినేతలను కించపరుస్తూ మాట్లాడిన మాటలను ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ న్యాయమూర్తులు మౌనంగా వినవలసిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న న్యాయమూర్తులదీ అదే పరిస్థితి. ఎందుకంటే ప్రిన్సిపల్ జిల్లా జడ్జీలు, ఇతర పై న్యాయమూర్తులు అంతా ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు కావడం. నాలాంటి ఒకరిద్దరు న్యాయమూర్తులు ఈ వివక్షను ధైర్యంగా ఎదుర్కొన్నారు.

అలాంటి న్యాయమూర్తుల పట్ల కూడా పరోక్ష వివక్ష కొనసాగింది. 2014 మార్చి నుంచి టీఎస్‌పీఎస్సీ సభ్యునిగా వెళ్లేవరకు నేను రెండు రాష్ర్టాలకు చెందిన ఆంధ్రప్రదేశ్ అకాడమీకి డైరెక్టర్‌గా దాదాపు రెండేండ్లు పనిచేశాను. నాకన్నా సీనియర్ జిల్లా జడ్జీలు ఎంతోమంది ఉన్నప్పటికీ అప్పటి అకాడమీ అధ్యక్షులు, ఇప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి సుభాష్‌రెడ్డి నన్నే డైరెక్టర్‌గా కొనసాగించడానికి సుముఖత వ్యక్తపరిచారు. కొందరు ఆంధ్రా హైకోర్టు న్యాయమూర్తులు వ్యతిరేకించినప్పటికీ ఆయన దాన్ని పట్టించుకోలేదు. దానికి ప్రధాన కారణం–నేను పాఠాలు బాగా చెప్తానని. 1991లో జ్యుడీషియల్ అకాడమీ మొట్టమొదటి ప్రచురణగా నా తెలుగు 'లా' పుస్తకం వెలువడింది. దాన్ని అప్పటి ప్రధాన న్యాయమూర్తి ఆవిష్కరించారు. అప్పుడు నేను మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్నాను. ఆ తర్వాత నేను రాసిన ఇంగ్లీష్ పుస్తకాన్ని మళ్లీ అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సేన్ గుప్తా ఆవిష్కరించారు. అప్పుడు నేను జిల్లా జడ్జి హోదాలో, సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్‌గా అకాడమీలో పనిచేస్తున్నాను. ఆ పుస్తకం వెయ్యి ప్రతులు కావాలని కర్ణాటక జ్యుడీషియల్ అకాడమీ మా అకాడమీని కోరింది. సర్వీస్ కమిషన్ సభ్యునిగా ఉన్నప్పుడు కూడా –నా పనులకు భంగం కలుగనప్పుడు– వాళ్లు ఆహ్వానించినప్పుడల్లా – నేను జ్యుడీషియల్ అకాడమీలో క్లాసులు తీసుకోవడానికి అతిథిగా వెళ్లేవాడిని. నా అనుభవం రీత్యా, నాకున్న కోరిక రీత్యా నా క్లాసులు చాలా ఉల్లాసంగా సాగేవి. మొదటినుంచి నా క్లాసుల ఫీడ్‌బ్యాక్ చాలా బాగుండేది. ఒక రోజు నా క్లాస్ తీసుకున్నాను. ఆ తర్వాత క్లాస్ ఓ హైకోర్టు న్యాయమూర్తిది. గెస్ట్ రూంలో కల్సినప్పుడు అతను నన్ను ఉండమని చెప్పారు. ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన వ్యక్తి. తన క్లాస్ పూర్తయిన తర్వాత నా క్లాస్ గురించి ఫీడ్‌బ్యాక్ ఆ ట్రైనీ జిల్లా జడ్జీలను అడిగారు. చాలా బాగుందని అందరూ ముక్తకంఠంతో చెప్పారు. అంతేకాదు తమ కోర్సు చివర్లో నన్ను పిలిచారని, ముందు పిలిస్తే ఇంకా బాగుండేదని చెప్పారు. ఈ విషయం ఆయన తన క్లాస్ తర్వాత డైరెక్టర్‌తో నా ముందే చెప్పారు. అంతేకాదు ఆయనకు ఐదు గంటల వరకు వీలు కాకపోతే ఆ తర్వాత క్లాస్ పెట్టి ఆహ్వానించమని చెప్పాడు.

కానీ విచిత్రం.. ఆ తర్వాత ఒక్కసారి మాత్రమే నన్ను అకాడమీకి పిలిచారు. ఆ తర్వాత మానేశారు. ఆంధ్రా న్యాయమూర్తులను మాత్రమే జ్యుడీషియల్ అకాడమీకి పిలువడం మొదలుపెట్టారు. దానివల్ల నాకు ఏ మాత్రం నష్టంలేదు. న్యాయమూర్తులకే నష్టం. ఈ విషయమే అకాడమీ బాధ్యతలు చూస్తున్న ఓ హైకోర్టు న్యాయమూర్తికి ఓ సందర్భంలో వివరించాను. అయినా ఫలితం లేకపోయింది. అదే పరిస్థితి కొనసాగింది. ఇది నా విషయంలో జరిగింది మాత్రమే కాదు, ఓ తెలంగాణ న్యాయమూర్తి విషయంలో జరిగిన వివక్ష. తెలంగాణ హైకోర్టు పూర్తిస్థాయిలో ఏర్పడిన తర్వాత అకాడమీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నది. న్యాయమూర్తుల కొరత ఉంటే పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులను కన్సల్టెంట్లుగా ఉపయోగించుకోవాలి. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా వివక్ష కొనసాగిందని చెప్పడానికి. సర్వీస్‌లో ఉన్న న్యాయమూర్తులు తాము ఎదుర్కొన్న వివక్షను వివరించలేరు. కానీ వాళ్లు ఎంతో వివక్ష అనుభవించారు. నాకు తెలుసు. వాటి గురించి నేను చెప్పడం బాగుండదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే రెండు రాష్ర్టాల్లో రెండు హైకోర్టులు ఏర్పాటు కావాలి. గతంలో మూడు రాష్ర్టాలు ఏర్పడినప్పుడు అదే విధంగా ఏర్పడినాయి. తెలంగాణ విషయంలో అలా జరుగలేదు. హైదరాబా ద్ నగరాన్ని నిర్మించానని విర్రవీగే చంద్రబాబు ఈ నాలుగున్నరేండ్లలో అక్కడ హైకోర్టు భవనాన్ని నిర్మించకపోవడంలోనే ఆయన సమర్థ త ఏపాటిదో అర్థమవుతుంది. తెలంగాణలో వేరుగా హైకోర్టు ఏర్పాటు కాకుండా ఉండటానికి చేయాల్సినదంత చేసి హడావుడిగా రెండింటిని విడదీస్తున్నారని అనవసర ప్రేలాపనను చంద్రబాబు చేస్తున్నారు.

2019 జనవరి 1 నుంచి అమరావతిలో ఏపీ హైకోర్టు పనిచేయడానికి ఉన్న అడ్డంకులు తొలిగిపోయాయని 2018 అక్టోబర్ 29న జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆశాభావాన్ని వ్యక్తంచేసింది. ఇంకా సుప్రీంకోర్టు ఇలా అంది. 'హైకోర్టు ఏర్పాటు చేయడానికి అవసరమయ్యే అన్ని ఆవశ్యకతలు పూర్తయినాయి. కాబట్టి హైదరాబాద్ హైకోర్టును విడగొట్టడానికి అవసరమైన నోటిఫికేషన్‌ను రాష్ట్రపతి ద్వారా కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని ఆశిస్తున్నాం'. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సాధ్యమైనంత త్వరగా తమ బిల్డింగ్‌లో పనిచేస్తుందని ఆశిస్తున్నామని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎ.కె.సిక్రీ, అశోక్ భూషణ్‌లతో కూడిన డివిజన్ బెంచి అభిప్రాయపడింది. హైదరాబాద్‌లోనే రెండు హైకోర్టులు పనిచేసే విధంగా సౌకర్యాలను తాము కల్పిస్తామని తెలంగాణ ప్రభుత్వం తన సంసిద్ధతను సుప్రీంకోర్టుకు తెలిపింది. 2018 డిసెంబర్ 15 నాటికి హైకోర్టు ఏర్పాటుకు పూర్తి సౌకర్యాలు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున న్యాయవాది చెప్పారు. ఏపీలో హైకోర్టు ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాల పట్ల హైకోర్టు న్యాయమూర్తులు సంతృప్తి చెందడాన్ని కూడా సుప్రీంకోర్టు నమోదు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కేంద్రం ఏపీ హైకోర్టు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ దశలో ఏవో లేనిపోని అపోహలు సృష్టించడం ఎంతమాత్రం అభిలషణీయం కాదు.

ఇది సంతోషించాల్సిన విషయం. నా దృష్టిలో ఇప్పుడు రెండు న్యాయబద్ధమైన హైకోర్టులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా ఈ విధంగా తెలంగాణ హైకోర్టు ఏర్పాటైంది. దీనికి కారణమైన న్యాయవాద మిత్రులను, న్యాయమూర్తులను, మరీముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, పార్లమెంట్ సభ్యులను, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బి.వినోద్‌కుమార్‌ను తెలంగాణ ప్రజలు చిరకాలం గుర్తుపెట్టుకుంటారు.

2019 జనవరి 1న తెలంగాణలో ఓ చారిత్రక దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఒక న్యాయవాదిగా, న్యాయమూర్తిగా పనిచేసిన నేను ఆనందంతో పులకించిపోతున్నాను. నేనే కాదు తెలంగాణకు సంబంధించిన ప్రతి వ్యక్తి పులకించిపోతున్నాడు. తెలంగాణకు హైకోర్టు ఏర్పడటం వల్ల సత్వర న్యాయం లభిస్తుందన్న ఆశ కూడా ప్రజల్లో ఏర్పడుతుంది.

హైదరాబాద్ హైకోర్టు, ఆంధ్రా హైకోర్టు విలీనమై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పడింది. అప్పుడు హైదరాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్రా హైకోర్టు న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేయలేదు. హైదరాబాద్ హైకోర్టుకు చెందిన న్యాయమూర్తులు ఆంధ్రా హైకోర్టు న్యాయమూర్తల కన్నా జూనియర్లుగా మారిపోయారు. రెండు రాష్ర్టాలకు కలిపి ఉమ్మడి హైకోర్టు ఏర్పాటు చేసినప్పుడు అందుకు భిన్నంగా ఎవరూ ప్రమాణ స్వీకారం చేయలేదు. ఇప్పుడు రెండు రాష్ర్టాల ప్రధాన న్యాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులు వేర్వేరుగా ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఇది సంతోషించాల్సిన విషయం. నా దృష్టిలో ఇప్పుడు రెండు న్యాయబద్ధమైన హైకోర్టులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా ఈ విధంగా తెలంగాణ హైకోర్టు ఏర్పాటైంది. దీనికి కారణమైన న్యాయవాద మిత్రులను, న్యాయమూర్తులను, మరీ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, పార్లమెంట్ సభ్యులను, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బి.వినోద్‌కుమార్‌ను తెలంగాణ ప్రజలు చిరకాలం గుర్తుపెట్టుకుంటారు.

(వ్యాసకర్త: గతంలో జిల్లా జిడ్జిగా, టీఎస్‌పీఎస్సీ సభ్యులుగా పనిచేశారు)

బాబు సీఎం కావడం ఏపీ దురదృష్టం

విశ్లేషణ



ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లు ఆమోదం పొందినప్పటి నుంచి ఆంధ్ర పాలకులు 'అన్యాయ రాగం' ఆలపిస్తూనే ఉన్నారు. 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వచ్చినప్పటి నుంచి ఆంధ్రా నేతలు అవాకులు, చెవాకులు పేలుతూనే ఉన్నారు. కొందరు శాస్త్రం అంటే తెలియకుండానే విభజన అశాస్త్రీయం అంటారు. అసలు హైదరాబాద్, ఆంధ్రా రాష్ర్టాలను కలుపడమే ఫజల్ అలీ కమిషన్ అభిప్రాయం ప్రకారం అశాస్త్రీయం. ఎందుకంటే తెలంగాణ సంస్కృతి, చరిత్ర పూర్తిగా వేరు. శతాబ్దాలపాటు ప్రత్యేక దేశంగా ఉండి, ప్రపంచంలోని, దేశంలోని ఇతర రాష్ర్టాల నుంచి వివిధ సంస్కృతుల, భాషలకు చెందినవారు ఇక్కడికి వచ్చి స్థిరపడినారు. ఈ రకమైన వైరుధ్యంతో నిజాం సంస్థానంలో ఒక సమ్మిళిత సంస్కృతి పరిఢవిల్లింది. మనుషులను గౌరవించడం, మానవీయంగా చూడటం దీనిలో ముఖ్యంగా ఉండే లక్షణం. అందుకే రెండు విభిన్న మతాలు–హిందూ–ముస్లిం ఈ ప్రాంతంలో సమానంగా ఆదరించబడినాయి. ప్రజలంతా ఒక కుటుంబంలాగా బతికారు.

ముస్లింలు వినాయక చవితి, దసరా చేసుకుంటే హిందువులు రంజాన్, పీర్ల పండుగ చేసుకునేవారు. కానీ ఆంధ్ర ప్రాంత సంస్కృతి దీనికి పూర్తిగా భిన్నం. వందల ఏండ్లు బ్రిటిష్ అణిచివేత కింద బతికినవారికి రెండే భాషలు తెలుసు. మాతృభాష ఆంధ్రం, రాజభాష ఆంగ్లం. వారి సంస్కృతి కూడా వైవిధ్యం లేకుండా ఒకేరకమైనది. కులాల, మతాల వారీగా విభజించబడి బతికిన జాతి. పాలితుడు, పాలకుడు అనే రెండే స్థాయిలకు అలవాటుపడినవారు. అయితే అణిచివేయాలి. లేకపోతే అణి గి ఉండాలి. అది ఆర్య సంస్కృతి. ఆంధ్ర భాష కూడా మార్గ పద్ధతిలో సంస్కృతం వల్ల ప్రభావితమై తెలంగాణ తెలుగుతో పోలిక లేకుండా ఉంటుంది. దేశీ తెలుగు తెలంగాణలో పుట్టిపెరిగిన తేనెలూరు స్వచ్ఛమైన భాష. ఇక ఆర్థికస్థాయి చూస్తే మానవ చరిత్రలోనే అత్యంత సంపన్నుడైన వాడు రాజు అంటే ఈ ప్రాంతంలో సహజ వనరుల సమృద్ధి, మనుషుల పనితనం, కష్టపడే తత్వం తేటతెల్లమవుతుంది కదా!

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో బతికిన ఆంధ్ర ప్రాంత వాసులు తమిళులతో కయ్యం పెట్టుకొని 1953 అక్టోబర్ ఒకటిన విడిపోయారు. మూడేండ్లలోనే ఆర్థికంగా చతికిలపడినారు. 12 కోట్ల అప్పు కేంద్రానికి చెల్లించాల్సిన ఆంధ్రను 67 కోట్ల సర్‌ప్లస్ ధనం ఉన్న హైదరాబాద్‌తో కలిపారు. అదంతా రాజకీయ నాయకుల హ్రస్వదృష్టి వల్ల జరిగింది. ఇప్పుడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటం కాదు ఇది. జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడం. మరిప్పుడు ఆంధ్రా నాయకులు తమ ప్రాంతం అన్యాయమైందనడంలో ఏమైనా నిజం ఉందా? చూద్దాం.

58 ఏండ్ల ఉమ్మడి రాష్ర్టాన్ని అత్యధిక కాలం రాయలసీమ, ఆంధ్ర ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రులు పరిపాలించారు. నాడు, నేడు ఏనాడైనా తెలంగాణ ప్రాంతం సుసంపన్నమైనదే. అంబేద్కర్ గారు చెప్పినట్టు ఆంధ్ర ప్రాంతం ఒయాసిస్సు లాంటిది. మరి 52 ఏండ్లు పాలించిన ఆ ప్రాంత ముఖ్యమంత్రులు ఈ ప్రాంత సంపద అంతా దోచి తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోకుండా ఏం చేసినట్టు? అప్పటినుంచి కాకపోయినా 1969 నుంచైనా, కనీసం 2009 నుంచైనా తమ ప్రాంతంలో ఒక నగరాన్ని రాజధాని స్థాయి కోసం నిర్మించుకోలేకపోయారా? ఈ ప్రాంతాన్ని వెనుకపడేసి, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయక ఈ 58 ఏండ్ల రాష్ట్ర సంపద ఎవరి బొక్కసాల్లోకి వెళ్లింది? దీనికి జవాబు తెలంగాణ ప్రజలకు తెలుసు. కానీ దూరంగా ఉన్న ఆంధ్ర ప్రజలకు తెలియదు. వారు ఈ కాలమంతా పరిపాలించిన కాంగ్రెస్, టీడీపీ నేతలను ఈ విషయంలో నిలదీయాలి.

ఇక ఆంధ్ర ప్రాంతానికి ఇంకొక ఘోరమైన అన్యాయం జరిగింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయినా, ఆంధ్ర ప్రాంతానికి చెంది న మేధావులు, విద్యాంతులు, కళాకారులు మద్రాసులోనే ఉండిపోయారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం రాజకీయ నాయకుల పాలయింది. చెప్పేవాడు లేడు, సామాన్య ప్రజలు మొత్తుకున్నా వినేవాడు లేడు. కేవలం మూడేండ్లలో రాష్ట్రం చతికిలపడింది. 'హిస్టరీ రిపీట్స్ ఇట్ సెల్ఫ్' అన్నట్టు అదే పరిస్థితి మళ్లీ వచ్చింది. ఏమీ చేయకుండా మీడియా మేనేజ్‌మెంట్‌తో డబ్బా కొట్టుకునే చంద్రబాబు విభజనానంతరం ఆంధ్రప్రదేశ్‌కు మొదటి ముఖ్యమంత్రి కావడం ఆ ప్రాంత దురదృష్టం.

ఇక ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు అన్యాయమయ్యాయా? రాష్ట్ర ఆదాయానికి సంబంధించిన లెక్కలు చూస్తే ఇప్పుడు ఆంధ్ర పాలకులు ఎందుకు ఏడుస్తున్నారో? ఎందుకు ఆంధ్ర ప్రజలను మభ్య పెడుతున్నారో అర్థమవుతుంది. ఇన్నేండ్లు కూడా ఉమ్మడి రాష్ట్ర ఆదాయంలో 76 శాతం తెలంగాణ ప్రాంతం నుంచి ఇస్తే 24 శాతం మాత్రమే ఆ రెండు ప్రాంతాల ఆదాయం. అందులో 17 శాతం ఆంధ్ర నుంచి, 7 శాతం రాయలసీమ నుంచి వచ్చేది. హైదరాబాద్ ఒక్కటీ 66 శాతం వాటా కలిగి ఉంటే 10 శాతం తెలంగాణ జిల్లాల నుంచి వచ్చేది. నిజానికి హైదరాబాద్ అభివృద్ధి 1958 తర్వాత రాష్ట్రం కోసం ఏమీ జరుగలేదు. ఒక ప్రభుత్వ విద్యా సంస్థ గానీ, దవాఖాన గానీ తెరిచిందీ లేదు. ఆంధ్ర వ్యాపారస్తుల ప్రైవేట్ సంపద పెంచుకోవడం రాష్ట్రాభివృద్ధి కాదు. వారి సొంత అభివృద్ధి. మరి తెలంగాణ ప్రాంత వనరులు సృష్టించిన 76 శాతం సంపద ఎటు పోయిందో, ఎవరు లాభపడ్డారో తెలుస్తున్నది కదా! ఇన్నాళ్లు తిన్నందుకు సంతోషం లేక చంద్రబాబు మొన్నటి ఎన్నికల సందర్భంలో చెప్పినట్టు హైదరాబాద్ అనే బం గారు బాతు పోయిందని ఆంధ్ర పాలకుల, వ్యాపారస్తుల ఏడుపు! 400 ఏండ్ల నుంచి అభివృద్ధి పథంలో ఉన్న ఈ నగరాన్ని వీళ్లు అభివృద్ధి చేయకపోగా, కబ్జాల వంటి అనైతి క చర్యలతో దీని అందాన్ని నాశనం చేశారు. కనీసం డ్రైనేజీ వ్యవస్థ కూడా నిర్మించక నిర్లక్షం చేశారు. చినుకుపడితే చిత్తడయ్యేట్టు చేశారు. ఒక నగరాన్ని నిర్మించాలన్నా, కాపాడాలన్నా ఆ నగర సంస్కృతి తెలియాలి. దాని చరిత్ర, గుణాత్మకత తెలియాలి. వ్యాపారాత్మక విలువ కాదు.

ఆంధ్ర ప్రాంతానికి ఇంకొక ఘోరమైన అన్యాయం జరిగింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయినా, ఆంధ్ర ప్రాంతానికి చెంది న మేధావులు, విద్యాంతులు, కళాకారులు మద్రాసులోనే ఉండిపోయా రు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం రాజకీయ నాయకుల పాలయింది. చెప్పేవాడు లేడు, సామాన్య ప్రజలు మొత్తుకున్నా వినేవాడు లేడు. కేవలం మూడేండ్లలో రాష్ట్రం చతికిలపడింది. 'హిస్టరీ రిపీట్స్ ఇట్‌సెల్ఫ్' అన్నట్టు అదే పరిస్థితి మళ్లీ వచ్చింది. ఏమీ చేయకుండా మీడియా మేనేజ్‌మెంట్‌తో డబ్బా కొట్టుకునే చంద్రబాబు విభజనానంతరం ఆంధ్రప్రదేశ్‌కు మొదటి ముఖ్యమంత్రి కావడం ఆ ప్రాంత దురదృష్టం. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాజకీయ నాయకుల మాటలకు మోసపోకుండా తెలివిగా వ్యవహరించాలి. వారి రాష్ర్టాన్ని కాపాడుకోవాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

కొత్త సంవత్సరానికి స్వాగతం



సోమవారం అర్థరాత్రి హైదరాబాద్‌లోని బుట్ట కన్వెన్షన్‌లో నూతన సంవత్సర వేడుకల్లో కేరింతలు కొడుతున్న యువత

ట్రైబల్ వర్సిటీ ఏర్పాటు దిశగా అడుగులు

- భూములను పరిశీలించిన కేంద్ర బృందం
- బృందం ప్రతినిధి రెడ్డి సుబ్రహ్మణ్యంను కలిసిన మాజీ డిప్యూటీ సీఎం కడియం
- స్థానికులకు ప్రయోజనం కల్పించాలని వినతి

వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ/ములుగు, నమస్తే తెలంగాణ(జయశంకర్ భూపాలపల్లి): గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. డిసెంబర్ 26న సీఎం కేసీఆర్ ఢిల్లీ పర్యటనలో భాగంగా గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే పనుల్లో వేగం పుంజుకుంది. సోమవారం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని బృందం సభ్యులు ములుగు గట్టమ్మ ప్రాంతంలో భూములను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వరంగల్‌లో సుబ్రహ్మణ్యంను మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కలిశారు. గిరిజన ప్రాంతం, గిరిజన యువత అభివృద్ధికి



రెడ్డి సుబ్రహ్మణ్యంతో సమావేశమైన మాజీ డిప్యూటీ సీఎం కడియం చిత్రంలో నిట్ డైరెక్టర్ రమణారావు

ఉపయోగపడేలా ఉపాధికి మార్గం చూపే ప్రత్యేక కోర్సులను మంజూరు చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ కోరిక మేరకు జూలై నుంచి మొదటి బ్యాచ్ తరగతులు నిర్వహించేందుకు జాకారంలోని యువజన శిక్షణ కేంద్రంలో తాత్కాలిక వసతికి అనువుగా ఉంటుందని తెలిపారు. ఐదు కోర్సులకు 30 సీట్ల చొప్పున తరగతులు ప్రారంభించనున్నట్టు సుబ్రహ్మణ్యం తెలిపారు.

బొకేలు వద్దు.. దుప్పట్లతో రండి

న్యూ ఇయర్ సందర్భంగా అధికారులకు ఆదిలాబాద్ కలెక్టర్ దివ్య దేవరాజన్ సూచన



దివ్యదేవరాజన్, కలెక్టర్

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా మంగళవారం తనకు శుభాకాంక్షలు తెలియజేసే అధికారులు, సిబ్బంది, ఇతరులు పుష్పగుచ్ఛాలు, స్వీట్ బాక్సులకు బదులుగా దుప్పట్లు, శాలువాలు తీసుకురావాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీంతో దుప్పట్లు, శాలువాలు తీసుకొస్తే వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు పేదప్రజలకు వాటిని అందజేయవచ్చని చెప్పారు. కలెక్టర్ తీసుకున్న నిర్ణయాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

వానకాలం నాటికి ఎల్లంపల్లికి నీళ్లు

- మార్చి చివరి నాటికి మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంప్‌హౌస్ సిద్ధం
- అన్నారం బరాజ్ పనులు పూర్తి
- రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి
- కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన రిటైర్డ్ ఇంజినీర్లు



సోమవారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి హైదరాబాద్‌కు వచ్చి ప్రగతిభవన్‌లో సీఎంను కలిసిన రిటైర్డు ఇంజనీర్ల బృందం. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషితో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్



పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ పంప్‌హౌస్‌లో పనులను పరిశీలిస్తున్న రిటైర్డు ఇంజనీర్లు

కాళేశ్వరం(జయశంకర్ భూపాలపల్లి)/మంథని, నమస్తే తెలంగాణ/మంథని రూరల్/అంతర్గాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గోదావరి నదిపై నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు మేడిగడ్డ బరాజ్ ద్వారా వచ్చే వానకాలం నాటికి ఎల్లంపల్లికి చేరుకుంటాయని రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్, తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రధానకార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. తెలంగాణ విశ్రాంత ఇంజినీర్లు సోమవారం హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో ముందుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డకు చేరుకొని ప్రాజెక్టులోని బ్లాక్-4 వద్ద పనులను పరిశీలించారు. అక్కడ నుంచి కన్నెపల్లికి చేరుకొని వ్యూ పాయింట్ నుంచి పనులను వీక్షించారు. అక్కడినుంచి అన్నారం ప్రాజెక్టును సందర్శించారు. తర్వాత పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురంలో నిర్మిస్తున్న సుందిళ్ల బరాజ్, కాసిపేటలో అన్నారం పంపుహౌస్, అంతర్గాం మండలం గోలివాడలో సుందిళ్ల పంపుహౌస్‌ను సందర్శించారు. వీరికి కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ వెంకటేశ్వర్లు దగ్గరుండి బరాజ్‌లు, పంపుహౌస్‌ల నిర్మాణాలు, జరుగుతున్న పనులు, పురోగతిని వివరించారు. వీరు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు చారిత్రాత్మకమైనదని, రీ ఇంజినీరింగ్ విధానంలో నిర్మిస్తున్న ప్రాజెక్టు కావడంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నదన్నారు. మేడిగడ్డ వద్ద నీటి లభ్యత అధికంగా ఉండటంతో అక్కడి బరాజ్‌లోని బ్లాక్-4 నిర్మాణ ప్రగతిలో కొంత వెనుకబడిందన్నారు. అక్కడి నుంచి నీటిని డైవర్ట్‌చేసి పనులు కొనసాగిస్తుండటంతో తిరిగి ఆ పనులు ఊపందుకున్నాయన్నారు. ఇక్కడ 11 మోటర్లు, పంపులు, 87 గేట్ల నిర్మాణాలు కూడా మార్చినాటికి, మేడిగడ్డ బరాజ్‌పనులు ఏప్రిల్ వరకు పూర్తవుతాయని చెప్పారు. కన్నెపల్లి పంపుహౌస్ దగ్గర 11పంపులకు గాను ఇప్పటికే 4 పూర్తయ్యాయని మరో 5 పురోగతిలో ఉన్నాయన్నారు. నిర్ణీత 2 టీఎంసీలతోపాటుగా భవిష్యత్తులో మరో టీఎంసీ నీటిని అదనంగా తీసుకునేలా 11 పంపులతోపాటు మరో 6 పంపులను బిగిస్తున్నారని చెప్పారు. ఇక్కడ మరో ఐదు మోటర్లు రావాల్సి ఉన్నదని, ఇందులో 2 మోటర్లు జనవరిలో, 3 మోటర్లు ఫిబ్రవరిలో వస్తాయని అధికారులు చెబుతున్నారనీ, అవి వస్తే మార్చి చివరి కల్లా కన్నెపల్లి పంపుహౌస్ పనులు పూర్తవుతాయని చెప్పారు. మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంప్‌హౌస్ పనులు మార్చి, ఏప్రిల్ వరకు పూర్తయ్యే అవకాశం ఉన్నదన్నారు. అన్నారం బరాజ్ పనులు పూర్తయ్యాని, ఇక్కడ 66 గేట్లు బిగించడంతోపాటు అప్రోచ్ బ్రిడ్జి సైతం పూర్తయ్యిందని తెలిపారు. 15-20రోజుల్లో బరాజ్ పనులు మొత్తం పూర్తవుతాయన్నారు. సుందిళ్ల బరాజ్ వద్ద చిన్న చిన్న పనులు మినహా భారీ పనులన్నీ పూర్తయ్యాయని చెప్పారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురంలోని సుందిళ్ల బరాజ్‌కు 74 గేట్లు బిగించాల్సి ఉండగా, మొత్తం గేట్లు బిగించామన్నారు. కాసిపేటలోని అన్నారం పంప్‌హౌస్ సైతం చివరి దశకు చేరుకున్నదన్నారు. అంతర్గాం మండలం గోలివాడ పంప్‌హౌస్‌ను సందర్శించారు. గ్రావిటీ కెనాల్, డెలివరీ లైన్, డెలివరీ సిస్టం, మోటర్ల బిగింపు తదితర పనుల పురోగతిపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ చివరి నాటికి 2 టీఎంసీలకు చెందిన 9 పంపులను సిద్ధం చేస్తామని, ఎర్త్ పనులు పూర్తయ్యాయని, 5.56లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు 90శాతం పూర్తయ్యాయని అధికారులు వివరించడంతో పనుల పురోగతిపై ఇంజినీర్ల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. పనులను పరిశీలించాక వచ్చే వానకాలం నాటికి మేడిగడ్డ నీళ్లను ఎల్లంపల్లిలో చూస్తామనే నమ్మకం కలిగిందని శ్యాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శ్యాంప్రసాద్‌రెడ్డి బృందంలో రిటైర్డ్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, రిటైర్డ్ ఇంజినీర్లు వేణుగోపాల్, రాంరెడ్డి, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

సీఎంను కలిసిన బృందం..

రిటైర్డ్ ఇంజినీర్లు సోమవారం కాళేశ్వరం పనులను పరిశీలించి హైదరాబాద్‌కు చేరుకోగానే ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అంశాలను వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

నేడు పాలమూరు-రంగారెడ్డి సందర్శన..

మూడ్రోజుల పర్యటనలో భాగంగా సోమవారం కాళేశ్వరం పనులను పరిశీలించిన విశ్రాంత ఇంజినీర్ల బృందం.. మంగళవారం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించనున్నది. బేగంపేట నుంచి హెలీకాప్టర్‌లో వెళ్లనున్న వీరు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న అంజనగిరి (నార్లాపూర్), వీరాంజనేయ (ఏదుల), వెంకటాద్రి (వట్టెం) రిజర్వాయర్లు, పంప్‌హౌస్ నిర్మాణ పనుల పురోగతిని.. అనంతరం డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న శివన్నగూడెం, గొట్టిముక్కల రిజర్వాయర్ పనులనూ పరిశీలిస్తారు. సమయం అనుకూలిస్తే పాలమూరు ప్రాజెక్టులోని కరివెన రిజర్వాయర్ పనులను కూడా పరిశీలించనున్నారు. బుధవారం ఈ బృందం సీతారామ ప్రాజెక్టు పనులను సందర్శించనున్నది.



కరీంనగర్ జిల్లా కందుగుల గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల

రైతు సంఘాల బలోపేతానికి కృషి

రూ.వెయ్యికోట్లతో కాకతీయ కాల్వ పనులు

హుజూరాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ: రైతు సంఘాలను బలోపేతం చేసేందుకు తన వంతు కృషిచేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. శిథిలావస్థలో ఉన్న కాకతీయ కాల్వను ఆధునీకరించేందుకు రూ.1000 కోట్లు కేటాయించామన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని కందుగులలో సోమవారం రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను ప్రారంభించి మాట్లాడుతూ.. 7500 క్యూసెక్కుల కెపాసిటీ గల కాకతీయ కాల్వలో రెండేండ్లుగా పుష్కలంగా నీటిని వదిలిపెట్టడంతో ఆయకట్టు రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఏవో సునీల్‌కుమార్, టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యయోధుడు దామోదర్‌రావు కన్నుమూత



దామోదర్‌రావు (ఫైల్)

మట్టెవాడ(వరంగల్): ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు, కాకతీయ పత్రిక వ్యవస్థాపకుల్లో ఒకరైన దేవులపల్లి దామోదర్‌రావు(96) అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. వరంగల్‌లోని మట్టెవాడకు చెందిన దామోదర్‌రావు దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు సమకాలికుడు. వరంగల్ మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా పనిచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. దామోదర్‌రావు మరణవార్త తెలుసుకున్న పలువురు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆటోనగర్‌లోని హిందూశ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

మెట్రో

గ్రేటర్ తాగునీటికి శాశ్వత భరోసా

- ఈ నెలలో కేశవాపురం రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తికి చర్యలు
- అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి సమీక్ష
- భూసేకరణకు రూ.100 కోట్లు విడుదలకు సుముఖత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీరు అందించేందుకు ముహూర్తం ఖరారైంది. నగరానికి డెడికేటెడ్ రిజర్వాయర్లు ఉండాలన్న సీఎం కేసీఆర్ సంకల్పం మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం కేశవాపురం దగ్గర పది టీఎంసీల సామర్థ్యంతో భారీ రిజర్వాయర్ నిర్మాణానికి ఈ నెలలోనే శంకుస్థాపన చేయలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్‌లో కీలకమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని సోమవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. భూసేకరణకు రూ.వంద కోట్ల నిధులు విడుదల చేయాలని సూచించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా అటవీ భూముల సేకరణలో మొదటి దశ అనుమతికి రూ.39.07 కోట్లు, రెండో దశ అనుమతికి రూ.100 కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారులు నివేదిక ఇచ్చారు. పట్టా భూముల సేకరణకు రూ.323 కోట్లు, ప్రభుత్వ అసైన్డ్ భూముల సేకరణకు రూ.253 కోట్లు, దేవాదాయ భూముల సేకరణకు రూ.111 కోట్లు.. మొత్తంగా రూ.826 కోట్ల వ్యయం అవుతుందని పేర్కొన్నారు. మొదటి దశలో పనులు చేపట్టేందుకు రూ.438 కోట్లను వెంటనే విడుదల చేయాలని అధికారులు నివేదించారు.

పది టీఎంసీలతో రిజర్వాయర్

కేశవాపురం దగ్గర రూ.4,396.16 కోట్ల అంచనా వ్యయంతో పది టీఎంసీల గోదావరిజలాలను నిల్వ చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఈ రిజర్వాయర్‌కు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న కొండ పోచమ్మ రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను తరలించనున్నారు. దీనికోసం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో 3,965.13 ఎకరాలమేర భూసేకరణ చేయాల్సి ఉన్నది. ఇందులో 1627.17 ఎకరాల ప్రభుత్వ భూమి, 1207 ఎకరాల అటవీ, 574.10 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. మరో 242.24 ఎకరాల అసైన్డ్ భూములతో పాటు 182.35 ఎకరాలమేర దేవాదాయ భూములను కూడా సేకరించాల్సి ఉన్నది. 300 మీటర్ల బేస్ వెడల్పుతో 4.70 కిలోమీటర్ల మేర నిర్మించనున్న రిజర్వాయర్ బండ్ కోసం ఇప్పటికే 1,585 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. అటవీభూముల సేకరణకు బదులుగా జగిత్యాల అటవీ డివిజన్‌పరిధిలో 281ఎకరాలు, యాదాద్రి పరిధిలో 580 ఎకరాల భూమిని బదలాయించాలని అధికారులు నిర్ణయించారు.

మరింత అందంగా చార్మినార్

సాలార్‌జంగ్ మ్యూజియం ఎదుట మూసీపై రూ.231.50 కోట్లతో పాదచారుల వంతెన

- ఈపీసీ పద్ధతిలో టెండర్లకు గ్రీన్‌సిగ్నల్
- పర్యాటకుల కోసం బహుళ అంతస్తుల పార్కింగ్ కాంప్లెక్స్
- చిరువ్యాపారుల కోసం నయాపూల్ పక్కన మరో వంతెన
- హెచ్ఆర్డీసీ బోర్డు సమావేశంలో నిర్ణయం



సాలార్‌జంగ్ మ్యూజియం ఎదుట మూసీపై నిర్మించనున్న పాదచారుల వంతెన నమూనా చిత్రం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ పాతబస్తీలోని సాలార్‌జంగ్ మ్యూజియం ఎదురుగా రూ.231.50 కోట్ల అంచనాతో నిర్మించనున్న పాదచారుల వంతెన డిజైన్‌కు గ్రీన్ సిగ్నల్ పడింది. చార్మినార్‌ను అంతర్జాతీయస్థాయి పర్యాటకప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ పాదచారుల ప్రాజెక్టును చేపడుతున్నారు. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్డీసీఎల్) ఐదో సమావేశం బోర్డు చైర్మన్, సీఎస్ ఎస్కే జోషి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో జరిగింది. ప్రాజెక్టుకు సంబంధించిన రివైజ్డ్ లేఅవుట్స్‌తోపాటు నిర్మాణ నమూనాలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు బోర్డు ఆమోదం తెలిపింది. ఈపీసీ పద్ధతిలో టెండర్లు ఆహ్వానించి పనులు చేపట్టేందుకు కూడా బోర్డు పచ్చజెండా ఊపింది. పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిషోర్, హెచ్ఆర్డీసీఎల్ అధికారులు చార్మినార్ పాదచారుల వంతెన ప్రాజెక్టు పనులపై చర్చించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.35 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు. పర్యాటకుల రాకపోకల సౌకర్యార్థం దీన్ని నిర్మిస్తుండగా.. చిరువ్యాపారుల కోసం నయాపూల్ వద్ద మరో వంతెన నిర్మించాలని నిర్ణయించారు. చార్మినార్‌కు వచ్చే పర్యాటకుల వాహనాలను నిలిపేందుకు బహుళ అంతస్తుల పార్కింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మించాలని ప్రణాళికలు సిద్ధంచేశారు. చార్మినార్ పాదచారుల ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే చార్మినార్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో పేవ్‌మెంట్ పనులు పూర్తవడంతో చార్మినార్ పరిసరాలు కొత్త అందాలను సంతరించుకొన్నాయి. పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చార్మినార్ వద్ద ఇన్నర్, ఔటర్‌రింగ్ రోడ్ల మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించే ఏర్పాట్లుచేశారు. అక్కడి తోపుడు బండ్లు, ఫుట్‌పాత్ వ్యాపారులను అక్కడినుంచి తరలించి చార్మినార్ చుట్టూ బండలు పరిచారు.

దక్కన్ సంస్కృతికి అనుగుణంగా

చార్మినార్ పాదచారుల ప్రాజెక్టు పనుల్లో దక్కన్ సంస్కృతి ఉట్టిపడేలా నిర్మాణశైలి ఉండాలని నిర్ణయించారు. అమృత్‌సర్ అభివృద్ధి ప్రాజక్టు తరహాలోనే చార్మినార్‌కు వెళ్లే వీధుల్లోని భవనాలకు సైతం చార్మినార్ ద్వారాల వంటి డిజైన్లను ఏర్పాటుచేయాలని నిశ్చయించారు. ఈ మేరకు ఫసాడ్ డెవలప్‌మెంట్ నమూనాలను రూపొందించారు.

ఐకానిక్ ప్రాంతంగా అభివృద్ధి

దేశంలోని ప్రఖ్యాత పర్యాటక స్థలాలను ఐకానిక్ ప్రాంతాలుగా గుర్తించి వాటి అభివృద్ధి బాధ్యతను ఒక్కో కేంద్ర ప్రభుత్వ సంస్థకు కేంద్రం అప్పగించింది. చార్మినార్ అభివృద్ధి, సుందరీకరణ బాధ్యతను ఎన్టీపీసీకి అప్పగించారు. చార్మినార్ బ్యూటిఫికేషన్, స్వచ్ఛ కార్యక్రమాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన, బ్యాటరీతో నడిచే వాహనాలు అందించడానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్సార్) కింద రూ.8.19 కోట్లు కేటాయించింది.

ఎన్టీపీసీ చేపడుతున్న పనులు

- సందర్శకుల కోసం బ్యాటరీ వాహనాలు: రూ.251 లక్షలు
- చెత్త ఎత్తివేసేందుకు ఆటో టిప్పర్లు: రూ.42.50 లక్షలు
- స్టీల్ గార్బేజ్ బిన్ల ఏర్పాటు: రూ.9 లక్షలు
- చార్ కమాన్ల సుందరీకరణ, లైటింగ్: రూ.100 లక్షలు
- వాటర్ ఏటీఎం కియోస్కుల ఏర్పాటు: రూ.16 లక్షలు
- పబ్లిక్ టాయిలెట్లు, ఇతర సౌకర్యాలు: రూ.200 లక్షలు
- రోడ్లు శుభ్రపర్చే యంత్రాల కొనుగోలు: రూ.200 లక్షలు


రాజధానిలో డ్రగ్స్ దందా

గోవా టు హైదరాబాద్

ఇద్దరు డ్రగ్స్ విక్రేతల అరెస్ట్

రూ.21 లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత

సీపీ అంజనీకుమార్ వెల్లడి



పట్టుబడిన డ్రగ్స్‌ను చూపుతున్న సీపీ అంజనీకుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తెచ్చి విక్రయిస్తున్న ఇద్దరు సభ్యుల ముఠాను వెస్ట్‌జోన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 89 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ.21 లక్షల వరకు ఉంటుందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ వెల్లడించారు. సోమవారం సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గోవాకు చెందిన లివియో జోసెఫ్ అల్‌మిడా అలియాస్ పీయూష్ అక్కడే ట్రావెల్ వ్యాపారం చేస్తున్నాడు. టూరిస్ట్‌లకు వాహనాలను కిరాయికి ఇస్తుంటాడు. అలా గోవాకు వచ్చిన కొందరు నైజీరియన్ దేశస్థులు తక్కువ ధర(రూ.3 వేలు)కు ఒక గ్రాము చొప్పున కొకైన్‌ను కొని అవసరమైన వినయోగదారులకు దానిని రూ.6 వేల నుంచి రూ.7 వేలకు విక్రయిస్తున్నారు. దీనిని చూసిన పీయూష్ విలాసవంతమైన జీవితంతో పాటు భారీగా ఆదాయం సంపాదించవచ్చని ఈ వ్యాపారంలోకి దిగాడు. ఇదిలా ఉండగా పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన శంకర్ కొన్నేండ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి బంజారాహిల్స్‌లో ఉంటూ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. 8 నెలల క్రితం గోవాకు వెళ్లిన శంకర్‌కు ఒక మధ్యవర్తి ద్వారా పీయూష్ పరిచయం అయ్యాడు. గోవా నుంచి డ్రగ్స్ ప్యాక్‌చేసి శంకర్ ద్వారా హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నాడు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో హైదరాబాద్‌లో కొకైన్ విక్రయించేందుకు పీయూష్ వచ్చాడు. సోమవారం ఉదయం బంజారాహిల్స్‌లో ఇద్దరు డ్రగ్స్ మార్చుకుంటుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 89 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో గ్రాము ప్యాక్‌లలో వీరి వద్ద లభ్యమైనట్టు వెస్ట్‌జోన్ పోలీసులు తెలిపారు. వారు ఎవరెవరికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారనేది తదుపరి విచారణలో వెలుగులోకి వస్తాయని సీపీ వెల్లడించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు బృందం పాల్గొన్నది. డ్రగ్స్ ముఠా సమాచారం సేకరించిన కానిస్టేబుల్ లోకేశ్వర్‌రావును సీపీ అభినందించారు.

మానవత్వం పరిమళించే..!

- పిక్‌పాకెటర్ బిడ్డకు ప్రాణంపోసిన కానిస్టేబుల్ దంపతులు
- అభినందించిన సీపీ అంజనీకుమార్



కానిస్టేబుల్ దంపతులను అభినందిస్తున్న సీపీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పోలీసు దంపతులు మానవత్వాన్ని చాటారు. యాఖత్‌పురాకు చెందిన ఇర్ఫాన్ అనే యువకుడు గుక్కపట్టి ఏడుస్తున్న రెండు నెలలపాపతో ఆదివారం రాత్రి 11.30 గంటలకు అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. గుర్తుతెలియని మహిళ మంచినీళ్లు తీసుకొస్తానని బిడ్డను ఇచ్చివెళ్లి ఎంతకూ రాకపోవడంతో ఇక్కడికి తీసుకొచ్చానని ఈ-కాప్స్ కానిస్టేబుల్ రవీందర్‌కు పాపను అప్పగించి వెళ్లిపోయాడు. డబ్బాపాలు పట్టేందుకు ఆయన యత్నించగా తాగకుండా గుక్కపట్టి ఏడుస్తూనే ఉన్నది. రవీందర్ భార్య ప్రియాంక బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ ప్రస్తుతం ప్రసూతి సెలవుల్లో ఉన్నది. ఆమెకు కొడుకు ఉన్నాడు. రవీందర్ తన చేతిలోని పాప విషయాన్ని భార్యకు ఫోన్లో వివరించాడు. పాప ఏడుపును ఫోన్‌లో విన్న ప్రియాంక చలించిపోయి, వెంటనే అఫ్జల్‌గంజ్ ఠాణాకు వచ్చారు. వెంటనే పాపను హత్తుకొని పాలిచ్చారు. ఆకలితో ఉన్న పాప, ఆ తల్లిపాలు తాగిన తర్వాత ఏడుపు ఆపి, నిద్రపోయింది. పాపను పేట్లబురుజు ప్రసూతి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సోమవారం ఉదయం పాపతల్లి ఆచూకీ లభించింది. చిత్తుకాగితాలు ఏరుకొని జీవనం సాగించే ఫలక్‌నుమాకు చెందిన షబానాబేగంగా ఆమెను గుర్తించారు. ఆమె భర్త ఫిరోజ్‌ఖాన్ పాత నేరస్థుడని, సెల్‌ఫోన్ చోరీకేసులో జైలులో ఉన్నాడని విచారణలో తేలింది. కల్లుకు బానిస అయిన షబానాకు ఇద్దరు ఆడ పిల్లలు. ఒకరు ఐదేండ్ల ఫాతిమా. తమ వద్ద ఉన్న రెండునెలలపాప ఆమె బిడ్డేనని పోలీసులు నిర్ధారించి పాపను అందించారు. మానవత్వం చాటిన పోలీస్ దంపతులను సోమవారం తన కార్యాలయానికి పిలిపించి సీపీ అంజనీకుమార్ అభినందించారు. వారి బాబుకు ఓ బహుమతిని అందించారు.

నేటి నుంచే నుమాయిష్



అబిడ్స్: తెలంగాణ ప్రజలను అలరించేందుకు నుమాయిష్ సిద్ధమయింది. 79వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన నాంపల్లిలో మంగళవారం ప్రారంభం కానున్నది. ఏటా జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు నుమాయిష్ జరుగుతుంది. నుమాయిష్‌ను సందర్శించేందుకు నగరం నలుమూలల నుంచే కాకుండా జిల్లాల నుంచి లక్షల మంది సందర్శకులు తరలివస్తారు. గతేడాది దాదాపు 22 లక్షల సందర్శకులు వచ్చారు. ఈ ఏడాది ఎగ్జిబిషన్ సొసైటీ ప్రాంతం మెట్రో రైలుతో అనుసంధానం కావడంతో సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని ఎగ్జిబిషన్ నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఎగ్జిబిషన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. 60 సీసీ కెమెరాలతోపాటు పోలీస్‌శాఖ ద్వారా శిక్షణ పొందిన 120 మందితో భద్రత చేపడుతున్నారు. ప్రత్యేక మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతనే సందర్శకులను లోనికి అనుమతిస్తారు. అంతర్గత భద్రత కోసం ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా నియమితులైన 130 మంది వలంటీర్లు, దొంగతనాలు జరుగకుండా చూసేందుకు మరో 130 మందితో వాచ్ అండ్ వార్డు సెక్యూరిటీని ఏర్పాటుచేశారు.


హోంమంత్రి చేతుల మీదుగా..

నుమాయిష్‌ను హోంమంత్రి మహమూద్ అలీ నేడు ప్రారంభించనున్నారని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ బీ శ్రీనివాసరావు, కార్యదర్శి జీవీ రంగారెడ్డి తెలిపారు. మాజీ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఈటల రాజేందర్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొననున్నట్టు చెప్పారు. ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకొన్నట్టు పేర్కొన్నారు.

పారదర్శకతతో పెరిగిన టీఎస్‌ఎండీసీ ఆదాయం

■ టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పారదర్శకంగా పని చేయడం వల్ల రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆదాయం పెరుగుతున్నదని టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో శేరి సుభాష్‌రెడ్డికి ఎండీ మల్సూర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపగా ఆయన ఎండీని సన్మానించారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఎస్‌ఎండీసీ ఆదాయం గణనీయంగా పెరిగిందని, సీఎం కేసీఆర్ అభినందించడం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేద్దామని పిలుపునిచ్చారు. నాలుగేండ్లలో టీఎస్‌ఎండీసీకి రూ.2160 కోట్లు, ఈ ఏడాది రూ.610 కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పారు. ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచుతూ పారదర్శకంగా విక్రయిస్తున్నట్టు చెప్పారు.



నర్సింగ్‌రావు స్మితా సబర్వాల్ రాజశేఖర్‌రెడ్డి సుల్తానియా భూపాల్‌రెడ్డి మాణిక్‌రాజ్

సీఎం కార్యాలయ అధికారుల నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : సీఎం కార్యాలయ అధికారులను నియమిస్తూ సీఎస్ ఎస్కే జోషి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం కేసీఆర్ సూచన మేరకు చిన్నపాటి మార్పుతో గతంలో ఉన్న అధికారులనే కొనసాగిస్తున్నారు. సీఎం ముఖ్యకార్యదర్శిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్ నర్సింగ్‌రావును, కార్యదర్శులుగా ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, సందీప్‌కుమార్ సు ల్తానియా, ప్రత్యేక కార్యదర్శులుగా రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ గ్రేడ్-1 కమిషనర్ పీ రాజశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి కే భూపాల్‌రెడ్డి, అదనపు కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి కే మాణిక్‌రాజ్‌లను కొనసాగిస్తూ ఆదేశాలు జారీచేశారు.

పూర్తిస్థాయిలో స్లాట్ విధానం

■ రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్ ఆదేశాలు

■ నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టీకరణ

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: జనవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్లశాఖలో ఆన్‌లైన్‌లో స్లాట్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయాలని ఆ శాఖ కమిషనర్ టీ చిరంజీవులు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటివరకు స్లాట్ విధానం అమలుకాకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో నవంబర్ ఒకటో తేదీ నుంచి అధికారికంగా స్లాట్ విధానం అమలులోకి వచ్చినట్టు గతంలోనే ప్రకటించిన స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ.. పాస్‌పోర్ట్ తరహాలో రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో ముందుగానే స్లాట్ బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించింది. అయితే సాంకేతిక సమస్యలతోపాటు మరికొన్ని ఇతర కారణాల వల్ల పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికీ స్లాట్ విధానం అమలు కావడంలేదు. దీంతో ఏయే కార్యాలయాల్లో స్లాట్ విధానం అమలు కావడంలేదు? అందుకు కారణాలేమిటన్న దానిపై కమిషనర్ సమీక్షించారు. ఈ విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 141 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ విధానాన్ని అమలుచేయాల్సిందేనని అధికారులకు స్పష్టంచేశారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్లాట్ విధానంలోనే రిజిస్ట్రేషన్లు జరుపాలని చిరంజీవులు తెలిపారు. ఒక్కో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 18 మంది స్లాట్‌లు బుక్‌చేసుకునే అవకాశం ఉంది. పబ్లిక్ డాటా ఎంట్రీ పూర్తిచేసి, ఎలక్ట్రానిక్ చలానాను జతపరిచి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్‌చేసుకోవాలి. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ కోసం రావలసిన సమయాన్ని ఆ స్లాట్‌లో కేటాయిస్తారు. ఆ సమయానికి నేరుగా సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. గతంలో కొనుగోలుదారులు డాక్యుమెంట్ రైటర్ వద్ద డాక్యుమెంట్ తయారుచేసుకుని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించేవారు. ఆ తర్వాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు డాటా ఎంట్రీచేసి రిజిస్ట్రేషన్‌చేసేవారు. కానీ ఇకమీదట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాటా ఎంట్రీ ఉండదు. కొనుగోలుదారులే ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ పూర్తిచేసుకుని డాక్యుమెంట్‌ను తయారు చేసుకోవాలి. ఇందుకోసం మీ-సేవా కేంద్రాల సేవలను కూడా వినియోగించుకోవచ్చు. స్లాట్ విధానాన్ని పక్కాగా అమలుచేయడం ద్వారా సబ్‌రిజిస్ట్రార్లకు పనిభారం తగ్గడంతోపాటు రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు ఎక్కువసేపు వేచిఉండాల్సిన అవసరం ఉండదు.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో లైబ్రేరియన్ మెయిన్స్ ఫలితాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ గురుకులాల్లోని లైబ్రేరియన్ పోస్టులకు నిర్వహించిన పరీక్ష మెయిన్స్ ఫలితాలు వెబ్‌సైట్లో పొందుపరిచినట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. ఎంపికైన అభ్యర్థులు వెబ్సైట్‌ను సందర్శించాలని టీఎస్‌పీఎస్సీ కోరింది.

- డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లోని ట్యూటర్ పోస్టుల భర్తీకి జనవరి 7, 8 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. అర్హులైన వారి జాబితా వెబ్‌సైట్లో ఉందని వెల్లడించింది.
- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 కొలువులకు ఎంపికయిన నలుగురు అభ్యర్థుల వివరాలు వెబ్‌సై ట్లో పొందుపరిచినట్లు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేర్కొన్నది.

7 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సికింద్రాబాద్ ఏవోసీ (ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్) సెంటర్‌లో జనవరి 7 నుంచి ఫిబ్రవరి 24 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఇండియన్ ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. 8, 10 తరగతులు ఉత్తీర్ణత సాధించి, 17 నుంచి 23 ఏండ్ల మధ్య వయసున్నవారు అర్హులని పేర్కొన్నది. ఈస్ట్‌మారెడ్‌పల్లిలోని ఏవోసీ సెంటర్‌లో జనవరి 7న సంప్రదించాలని సూచించింది.

సాగు వెలుగులకు ఏడాది

■ వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరంటుకు నేటితో సంవత్సరం పూర్తి

■ విద్యుత్ రంగంలో ఘనవిజయాలు అందించిన 2018

■ సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వం.. సీఎండీ నాయకత్వం

■ శ్రమించిన విద్యుత్ సంస్థల ఉద్యోగులు, కార్మికులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సరిగ్గా 365 రోజుల కిందట తెలంగాణ ప్రభుత్వం వేసిన అడుగు దేశం మొత్తాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది. దేశంలోనే మొదటిసారిగా వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలపాటు విద్యుత్ అందిస్తామని సంచలన నిర్ణయాన్ని ప్రకటించడమే కాదు.. సమర్థంగా అమలుచేసి దేశవ్యాప్తంగా నీరాజనాలు అందుకుంటున్నది. 2018 జనవరి 1వ తేదీన ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు క్షణకాలం అంతరాయం కలుగకుండా వ్యవసాయ రంగానికి కరంటు సరఫరాచేస్తున్నది. 2019కి స్వాగతం పలికిన సందర్భంగా గత ఏడాది విద్యుత్ రంగం మిగిల్చిన మధుర జ్ఞాపకాలు.. అందించిన ఘన విజయాలను నెమరు వేసుకుంటే మొత్తం వెలుగులే కనిపిస్తాయి. ఇదంతా సీఎం కేసీఆర్ సమర్థమైన నాయకత్వం, మార్గదర్శనంతోనే సాధ్యమైంది. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు నేతృత్వంలో విద్యుత్ సంస్థల్లోని ఇంజనీర్లు, అధికారులు, కార్మికులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేశారు. సాగుకు నిరంతర్ విద్యుత్ అందించడంలో దేశానికే మోడల్‌గా నిలిపారు.

విద్యుత్ నామ సంవత్సరం

గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు 24 గంటల కరంటు అందించడం ఒక ఎత్తు అయితే.. విద్యుత్ డిమాండ్‌లో 35 శాతానికిపైగా వాటా ఉండే వ్యవసాయానికి నిరంతరాయంగా ఉచిత విద్యుత్‌ను అందించడం సవాల్‌గా నిలిచింది. అయినా సీఎం సారథ్యంలో అధికారులు, సిబ్బంది శ్రమించి ఏడాదిగా 23.4 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు నిరంతరాయంగా విద్యుత్‌ను అందిస్తున్నారు. సుమారు 97 లక్షల మంది రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు. ఈ ఘనతను దేశం మొత్తం గుర్తించింది. ఫలితంగా తెలంగాణ విద్యుత్ రంగాన్ని అనేక ప్రశంసలు, అవార్డులు వరించాయి.

100/100 మార్కులు

తెలంగాణ ఏర్పడితే చీకటిలో మగ్గాల్సి వస్తుందన్న బెదిరింపులు.. దానికి తగ్గట్టే 2,800 మెగావాట్ల కరంటు లోటు. ఇలాంటి స్థితిలో పగ్గాలు చేపట్టిన సీఎం కేసీఆర్.. ఆరు నెలల్లోనే పరిస్థితిని తలకిందులుచేశారు. పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేసి 24 గంటల కరెంటు సరఫరాను సాకారంచేశారు. రాష్ట్రం ఏర్పడ్డ కొత్తలో 4365.26 మెగావాట్ల విద్యుత్ స్థాపిత సామర్థ్యం ఉండగా, నేడు 15,501 మెగావాట్లకు పెరిగింది. కొత్తగూడెంలోని 800 మెగావాట్ల సీవోడీ కూడా పూర్తిచేసుకుని.. సొంత రాష్ట్రంతో తొలి విద్యుత్ ప్రాజెక్టుగా చరిత్రను సృష్టించారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నిబంధనల ప్రకారం ప్రాజెక్టును 48 నెలల్లో పూర్తిచేయాల్సి ఉండగా.. గడువుకు ముందే పూర్తిచేసి చరిత్రలో నిలిచింది. రాష్ట్రం ఏర్పడేటానికి మన దగ్గర సౌర విద్యుత్ ఉత్పత్తి 31 మెగావాట్లు మాత్రమే. నాలుగున్నరేండ్లలో దాన్ని 3,411 మెగావాట్లకు పెంచి గుజరాత్, రాజస్థాన్‌కు సవాల్ విసిరాం. నాడు తీవ్ర కోతలతో ఉన్న తెలంగాణ.. నేడు రాజస్థాన్‌కు 500 మెగావాట్ల విద్యుత్‌ను పరస్పర బదిలీలో భాగంగా ఎగుమతి చేసే స్థాయికి చేరింది. అందుకే ప్రజలు విద్యుత్ రంగానికి 100కు 100 మార్కులు వేస్తున్నారు.

విపత్తులను ఎదిరించి..


ఇటీవలి తిత్లీ తుఫానుతో ఏపీ మొత్తం అంధకారంలో అలుముకున్నది. తుఫాను దెబ్బకు ఉత్తరాది నుంచి మనకు రావాల్సిన మూడువేల మెగావాట్ల సరఫరా నిలిచిపోయింది. అయినా తెలంగాణలో ఒక్క క్షణంకూడా విద్యుత్ పోలేదు. వార్ధా-డిచ్‌పల్లి 765 కేవీ డబుల్ సర్క్యూట్‌లైను మనకు అండగా నిలిచింది. ఈ సమయంలోనూ వ్యవసాయానికి 24 గంటల కరంటు అందించాం. అది మన శక్తి సామర్థ్యాలకు నిదర్శనం.



తలసరి వినియోగంలో టాప్

సమైక్యరాష్ట్రంలో 2014 మార్చిలో 23 జిల్లాలు కలిపి విద్యుత్ వినియోగం 285 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. 2018 అక్టోబర్ 9న ఒక్క తెలంగాణలోనే 233 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైంది. అదే సమయంలో ఏపీలో 190-195 మిలియన్ యూనిట్లు మాత్రమే. రాష్ట్రం ఏర్పడినప్పుడు 6,660 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఉంటే, 2018 సెప్టెంబర్ 11 నాటికి 10,818 మెగావాట్లకు పెరిగింది. అయినా ఎక్కడా సరఫరాలో అంతరాయం కలులగ లేదు. మొత్తం గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌లో 35 శాతం కంటే ఎక్కువగా వ్యవసాయానికే వాడుకుంటున్నాం.

రైతులు సంతోషంగా ఉన్నారు



విద్యుత్ రంగంలో ఇన్ని ఘన విజయాలు సాధించడానికి మూలం సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వమే. సాగుకు నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభించి ఏడాది గడిచినా ఒక్క క్షణం కూడా అంతరాయం కలుగలేదు. మిగతా రంగాలకూ 24 గంటలు సరఫరా చేస్తున్నాం. ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రంలోని రైతులందరూ సంతోషంగా ఉన్నారు. దిగుబడి సైతం గణనీయంగా పెరిగింది. ఇది రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడుతున్నది.

- ప్రభాకర్‌రావు, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ


నదుల పునర్జీవానికి కార్యాచరణ

■ రాష్ట్రమంతా మురుగునీటి శుద్ధి

■ వాటర్‌షెడ్ మ్యాప్, నీటి నాణ్యతపై పరిశీలన

■ 15లోగా నివేదిక రూపొందించాలి: సీఎస్ జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు నదుల పునర్జీవ కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కేజోషి ఆదేశించారు. నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ ప్రణాళికను 15వ తేదీలోగా రూపొందించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో నదుల పునర్జీవ కమిటీ సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ నదులకు సంబంధించిన పూర్తి వివరాలను సాగు నీటిపారుదలశాఖ, భూగర్భ జలవనరులశాఖ, జలమండలి, పురపాలకశాఖ, పరిశ్రమలతోపాటు వివిధశాఖలు ఐదోతేదీలోగా జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన కేంద్రంకు అందజేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మురుగు నీటి శుద్ధి కర్మాగారాలను నిర్మించడానికి జలమండలిని నోడల్ ఏజెన్సీగా నియమించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. మొత్తం తెలంగాణకు వాటర్‌షెడ్ మ్యాప్ రూపొందించాలని కోరారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీంచాలని, నదులు కాలుష్యానికి గురవుతున్న ప్రాంతాలను గుర్తించి దృష్టి సారించాలని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి నీటి నాణ్యతను, నీటి పరిణామంపై సాగునీటిశాఖ ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని చెప్పారు. మొత్తం సీజన్‌కు సంబంధించి జల సంబంధ పర్యావరణ ప్రవాహంపై నివేదిక రూపొందించాలని సూచించారు. గృహవ్యర్థాలు, భూగర్భజలాలు, పర్యావరణ నష్టం, వరదలు ఎక్కువగా వచ్చే జోన్లతోపాటు ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకొని నివేదిక రూపొందించాలని తెలిపారు. ఈ నివేదికపై మూడోవారంలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. సమావేశంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, పురపాలకశాఖ కార్యదర్శి అర్వింద్‌కుమార్, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్, జలమండలి ఎండీ దానకిషోర్, కాలుష్యనియంత్రణ మండలి సభ్య కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఈపీటీఆర్ఐ డీజీ కల్యాణ్‌చక్రవర్తి, టీఎస్ఐఐసీ ఎండీ వెంకటనరసింహారెడ్డి, నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.




సోమవారం సచివాలయంలో సీఎస్ ఎస్కే జోషి అధ్యక్షతన జరిగిన నదుల పునరుజ్జీవ కమిటీ సమావేశ దృశ్యం

కొత్త జిల్లాల్లో 'నవోదయ'లు కావాలి

■ తెలంగాణ అత్యుత్తమ పథకాల్ని దేశమంతా వర్తింపజేయాలి

■ పలు బిల్లులపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ఎంపీ వినోద్‌కుమార్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏ దేశమైనా ప్రగతిపథంలో దూసుకెళ్లాలంటే విద్యావ్యవస్థ కీలకమని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. సోమవారం రెండోసారి డిమాండ్ ఫర్ గ్రాంట్స్ బిల్లు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఎంపీ వినోద్ మాట్లాడుతూ.. 2020 నాటికి భారత్‌లో యువత జనాభా 34.33 శాతానికి చేరుకోనున్నందున విద్యాసంస్థల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగనున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పెంచిన 31 జిల్లాలను దృష్టిలో పెట్టుకొని కొత్త జిల్లాలకు ఒక్కో నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. ఒక్కో జిల్లాకు ఒక్కో నవోదయ విద్యాలయం ఉండాలని చట్టమే చెప్తున్నదని గుర్తుచేశారు. 2014 వరకు ఏర్పడిన జిల్లాలకు నవోదయ విద్యాలయాలను మంజూరుచేసిన కేంద్రం.. తెలంగాణలో కూడా జిల్లాలు పెరిగిన నేపథ్యంలో నవోదయ బిల్లుకు సవరణ చేయాలని కోరారు. అలాగే, తెలంగాణ సర్కార్ అమలుచేస్తున్న అత్యుత్తమ పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలుచేయాలని కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు. రైతు బంధు, రైతు బీమా పథకాల వల్ల తెలంగాణ రైతులు సంతోషంగా ఉన్నారని వివరించారు. రైతుల జీవితాల్లో వెలుగురేఖల్ని నింపే ఇలాంటి పథకాల్ని దేశవ్యాప్తంగా అమలుచేయాలని కోరారు.

జేఎన్‌టీయూహెచ్‌కే ఎంసెట్ నిర్వహణ!

■ సెట్స్ కమిటీ సమావేశం తర్వాత షెడ్యూల్ జారీ


■ మే నెలలోనే ప్రవేశపరీక్షల నిర్వహణకు అవకాశం

■ మారనున్న నాలుగు ఎంట్రెన్స్‌ల కన్వీనర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కాలేజీల్లో సీట్ల భర్తీకోసం చేపట్టనున్న ఎంసెట్- 2019 నిర్వహణ బాధ్యతలను జేఎన్‌టీయూహెచ్‌కే ఇవ్వడానికి రాష్ట్ర ఉన్నతవిద్యామండలి అధికారులు సన్నాహాలుచేస్తున్నారు. ఈసెట్ -2019 నిర్వహణ బాధ్యతలను కూడా జేఎన్‌టీయూహెచ్‌కే అప్పగించనున్నారు. ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించే పీజీఈసెట్-2019 నిర్వహణ బాధ్యతలను ఓయూకు ఇవ్వాలా లేక కేయూ, జేఎన్‌టీయూహెచ్‌కు అప్పగించాలా అనేది సెట్స్ కమిటీ నిర్ణయిస్తుంది. ఎంసెట్, ఇతర ప్రవేశ పరీక్షలను మే నెలలోనే నిర్వహించే అవకాశాలున్నాయని సమాచారం. ఐసెట్, పీజీఈసెట్, లాసెట్, ఎడ్‌సెట్లకు కన్వీనర్లుగా పనిచేసిన వారు రిటైరవటంతో కొత్తవారికి బాధ్యతలు అప్పగించనున్నారు.

భువనగిరిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం

■ నేడు ప్రారంభించనున్న ఎంపీ బూర నర్సయ్యగౌడ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భువనగిరిలో నెలకొల్పిన పాస్‌పోర్ట్ సేవాకేంద్రంలో మంగళవారం నుంచి సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కేంద్రాన్ని స్థానిక ఎంపీ బూర నర్సయ్యగౌడ్ నేడు ప్రారంభించనున్నట్టు హైదరాబాద్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడించారు. పీవోపీఎస్కే పథకం కింద ఏర్పాటవుతున్న పాస్‌పోర్ట్ కేంద్రాల్లో తెలంగాణలో ఇది ఎనిమిదవ కేంద్రమని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

దేశంలో రోడ్డు ప్రయాణికుల్లో

పెరుగుతున్న నిర్లక్ష్యం

■ కోల్‌కతా, లూథియానా ప్రజల్లో రోడ్డు క్రమశిక్షణ ఎక్కువ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారతీయుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెరుగుతున్నప్పటికీ, నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యం పెరుగుతున్నదని ఫోర్డ్ ఇండియా సంస్థ అధ్యయనం వెల్లడించింది. మెట్రో నగరాల్లో కోల్‌కతా, లూథియానా ప్రజలు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తున్నారని పేర్కొన్నది. పురుషులకంటే మహిళలే ఎక్కువ క్రమశిక్షణ పాటిస్తున్నారని తెలిపింది. 2018 సంవత్సరం ముగుస్తున్న సందర్భంగా ఫోర్డ్ దేశంలోని 10 నగరాల్లో ప్రయాణికులపై అధ్యయనం చేసింది. మెట్రో నగరాల్లో 22 శాతం మంది ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పట్టించుకోవడం లేదని సర్వేలో జనం అంగీకరించారు. 45 శాతంమంది వేగపరిమితిని పట్టించుకోకుండా వెళ్తున్నారని తేల్చింది. 13 శాతం మంది నోపార్కింగ్ సూచికలు పట్టించుకోకుండా తమకు నచ్చినచోట వాహనాలను పార్క్‌చేస్తున్నారని వివరించింది.

కేంద్రం పరిశీలనలో

కాళేశ్వరం జాతీయహోదా

■ కేంద్ర జలవనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

■ తెలంగాణ ప్రభుత్వం అనేకసార్లు హోదా కోరిందన్న మంత్రి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇచ్చే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదని కేంద్ర జలవనరులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ స్పష్టంచేశారు. సోమవారం సభలో రాజ్యసభ సభ్యుడు డీ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన గడ్కరీ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం అనేకసార్లు కేంద్రానికి లేఖ రాసిందని గుర్తుచేశారు. గతేడాది ఆగస్టు 14న కూడా తెలంగాణ ప్రభుత్వం నుంచి ఈ మేరకు లేఖ వచ్చిందని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడమనేది పలు అంశాలపై ఆధారపడి ఉంటుందని, కేంద్ర జలసంఘం సాంకేతిక, ఆర్థికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నదని గడ్కరీ చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థికపరమైన అంశాలు కేంద్ర జలసంఘం సలహా మండలి పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. సలహామండలి ఇచ్చిన సూచనల మేరకు కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. ప్రాజెక్టు పెట్టుబడుల ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వం పంపగా.. వాటికి సంబంధించి కొన్ని సందేహాలపై తిరిగి సెప్టెంబర్ ఆరున రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని, తెలంగాణ నుంచి ఇంకా సమాధానం రావాల్సి ఉందని అన్నారు.



కొందరికి ఆనందం , మరికొందరికి కష్టాలను మిగిల్చిన 2018 ఇకపై ఓ జ్ఞాపకంగా మిగిలిపోనున్నది. 2018కి జగమంతా వీడ్కోలు పలుకుతున్న వేళ సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని బిర్లా టెంపుల్‌పై చివరి సూర్యాస్తమయం ఇలా ఆవిష్కృతమైంది.

హైదరాబాద్- మెదక్ మధ్య

ఆటవీ ప్రాంతాలను పునరుద్ధరించాలి

హెచ్‌ఎండీఏను ఆదేశించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్- మెదక్ మధ్యలో పూర్వపు ఆటవీ ప్రాంతాలను పునరుద్ధరించాలని హెచ్‌ఎండీఏ కమిషనర్ జనార్దన్‌రెడ్డిని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. సోమవారం ప్రగతిభవన్‌లో హెచ్‌ఎండీఏ పరిధి, పరిసర ప్రాంతాల్లో పచ్చదనం పెంపుపై హెచ్‌ఎండీఏ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఔటర్‌రింగ్‌రోడ్ చుట్టుపక్కల పచ్చదనం అభివృద్ధికి ఆటవీశాఖ అధికారులతో కలిసి సమీకృత ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. దేశంలోని ఇతర నగరాల మాదిరిగా హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్ కాకూడదన్నారు. ఇక్కడ నివసించే ప్రజలు ప్రశాంతంగా జీవించాలని చెప్పారు. భవిష్యత్‌తరాలు కూడా సంతోషంగా జీవించేలా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో వీలైనంత ఎక్కువ లంగ్‌స్పేస్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాకర్స్ క్లబ్బులు ఏర్పాటుచేసి, నిర్వహణ బాధ్యతలు వారికే అప్పగించాలని చెప్పారు. హెచ్‌ఎండీఏ పరిధిలో పచ్చదనం పెంపుకోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ఏడాదిలో మీడియా అకాడమీ భవనం

మరణించిన 150 మంది జర్నలిస్టు కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మీడియా అకాడమీ భవన నిర్మాణం ఏడాదిలో పూర్తవుతుందనితెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. సోమవారం సమాచారభవన్‌లో పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో సీఎం కేసీఆర్ సమయం, అనుమతి తీసుకుని కొత్త భవనానికి శంకుస్థాపన జరుపుతామన్నారు. సీఎం ప్రత్యేకశ్రద్ధ వహించి రూ.15 కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు. భవనంలో శాశ్వతతరగతి గదులు ఏర్పాటుచేసి జర్నలిజం కోర్సు ప్రారంభిస్తామని చెప్పారు. ఇప్పటివరకు మరణించిన 47 మంది జర్నలిస్టు కుటుంబాలకు, తీవ్ర అనారోగ్యం బారిన పడిన 16 మంది వర్కింగ్ జర్నలిస్టులకు ఆర్థికసాయం అందించడానికి కమిటీ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమ నిధికి ప్రభుత్వం కేటాయించిన రూ.100 కోట్లలో ఇప్పటివరకు రూ.34.5 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. మరణించిన 150 మంది జర్నలిస్టుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందజేశామని చెప్పారు. ఒక్కో కుటుంబానికి ప్రతినెలా రూ.3 వేల పింఛన్‌ను ఐదేండ్లు అందిస్తామని, మరణించిన జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యను అభ్యసించే 104 మంది విద్యార్థులకు ట్యూషన్ ఫీజుగా రూ.1,000, తీవ్ర అనారోగ్యం బారిన పడిన 52 మంది జర్నలిస్టులకు రూ.50 వేల చొప్పున రూ.26 లక్షల ఆర్థికసాయం చేసినట్లు వివరించారు. సమావేశంలో బీపీపీ స్పెషలాఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, దక్కన్ క్రానికల్ పొలిటికల్ ఎడిటర్ గౌరీశంకర్, సీనియర్ సంపాదకులు టంకశాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాలో అవినీతి పాలన

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



షాద్‌నగర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, నమస్తే తెలంగాణ: ఏపీలో అవినీతి పాలన కొనసాగుతున్నదని, చంద్రబాబు తన ఉనికిని చాటేందుకు ప్రయత్నిస్తున్నారే తప్ప, పాలనపై దృష్టిపెట్టడం లేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్‌తో కలిసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమని.. అలాంటి నాయకుడిని విమర్శించేస్థాయి బాబుకు లేదన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను తొమ్మిదేండ్లు దత్తత పేరుతో చంద్రబాబు దగాచేయలేదా? అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టులను అడ్డుకొని, ఇక్కడి నీళ్లను ఆంధ్రాకు మళ్లించారని మండిపడ్డారు. పాలమూరు కరువును చూపించి ప్రపంచ బ్యాంకుల నుంచి వచ్చిన నిధులను ఏపీకి మళ్లించిన ఘనత బాబుదేనని ధ్వజమెత్తారు. జన్మభూమి పథకంతో మొదలైన బాబు అవినీతి పాలన నేటికీ కొనసాగుతున్నదన్నారు. 108 అంబులెన్స్‌లనూ వదులలేదని చెప్పారు. సీఎం కేసీఆర్‌ను ఆంధ్రా మంత్రులు విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు. కూటమి పేరుతో కుట్రలు చేసేందుకు వచ్చిన చంద్రబాబును ప్రజలు నమ్మలేదని, ఏపీలోనూ ఆయనను నమ్మే పరిస్థితి లేదని తెలిపారు.

కుట్రలకు చిరునామా చంద్రబాబు

- ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

నల్లగొండ, నమస్తే తెలంగాణ: చంద్రబాబుపై సీఎం కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట వాస్తవమేనని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఇవ్వలేదని తిరుపతి వేంకటేశ్వరస్వామిపై బాబు ప్రమాణం చేయాలని ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి సవాల్‌విసిరారు. కుట్రలకు, మోసాలకు చిరునామాగా నిలిచే బాబుకు సీఎం కేసీఆర్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. సోమవారం ఆయన నల్లగొండలో మాట్లాడుతూ.. హైకోర్టు విభజన బాబుకు ఇష్టం లేదని, ఇప్పటికీ బీజేపీ ముసుగు వేసుకుని తిరుగుతున్నాడని ఆరోపించారు. ఏపీ ఎన్నికల్లో చంద్రబాబు ఓటమి తథ్యమన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలకు ఎప్పుడూ అనుకూలంగానే ఉన్నదని చెప్పారు. అయినా సీఎం కేసీఆర్‌ను బద్నాం చేయడానికి ఆర్ కృష్ణయ్య వంటి నేతలు కుట్రలు పన్నుతున్నార న్నారు. కార్యక్రమంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, టీఎస్‌ఎఫ్డీసీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీలోనూ పరాభవమే

అక్కడా టీడీపీకి ఓటమి తప్పదు

- బాబును ఎదుర్కొనేందుకు ఏపీ ప్రజలు చాలు
- పూటకో పార్టీతో పొత్తు చంద్రబాబుకే చెల్లింది
- హైకోర్టును విభజించకుండా బాబు కుట్రలు
- కనీసం కోర్టు గదులను ఎందుకు నిర్మించలేదు?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నిలదీత



సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే బాల్కసుమన్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీడీపీకి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే.. ఏపీలోనూ వస్తాయనే భయం చంద్రబాబులో కనపడుతున్నదని మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి చెప్పారు. ఏపీలో రాబోయే ఫలితాలకు కుంటిసాకులు వెతుక్కోవడానికి చంద్రబాబు ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్నారని ఎద్దేవాచేశారు. తెలంగాణభవన్‌లో సోమవారం ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రశ్నలకు చంద్రబాబు సమాధానాలు ఇవ్వకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బాబును ఎదుర్కోవడానికి ముగ్గురు మోదీలు అవసరంలేదని, ఏపీ ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్, కేసీఆర్ ఏనాడూ కూడా బీజేపీతో కలిసి నడువలేదని, సమదూరాన్ని కొనసాగించిందని చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్, మోదీ ఒకటేనని బాబుతో పాటు ఎంతమంది చెప్పినా ప్రజలు విశ్వసించలేదని గుర్తుచేశారు. అవసరం కోసం పూటకో పార్టీతో పొత్తు పెట్టుకోవడం బాబుకే చెల్లిందన్నారు. తెలంగాణ కోసం కుష్ఠురోగినైనా, గొంగళి పురుగునైనా ముద్దాడుతానని ఉద్యమప్రారంభంలోనే కేసీఆర్ చెప్పారని, అందులో భాగంగానే గతంలో టీడీపీతో పొత్తు పెట్టుకున్నామని గుర్తుచేశారు. 2004లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామని, ఆ ఎన్నికల్లో సమైక్యాంధ్ర నినాదాన్ని వినిపించిన టీడీపీని ప్రజలు ఓడించారని చెప్పారు. 2009లో చంద్రబాబే టీఆర్‌ఎస్ దగ్గరికి వచ్చాడని, ఆయనతో జై తెలంగాణ అనిపించి పొత్తు పెట్టుకున్నామని చెప్పారు. వైస్రాయ్ హోటల్ ఘటనలో కేసీఆర్ సూత్రధారి అయితే, కేసీఆరే సీఎం అయ్యేవారని, బాబును ఎందుకు సీఎం చేస్తారని ప్రశ్నించారు. గతంలో పార్టీని కాపాడటానికి అధికారమార్పిడి చేశానని చెప్పుకున్న బాబు, ఇప్పుడు వైస్రాయ్ ఘటనకు సూత్రధారి కేసీఆర్ అని మాట్లాడి ప్రజల్లో సానుభూతి పొందేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు.

గోబెల్స్ ఆశ్చర్యపోయేలా బాబు అబద్ధాలు

ప్రత్యేకహోదాపై చంద్రబాబు ఎన్ని యూటర్న్‌లు తీసుకున్నాడో ఏపీ ప్రజలు గమనిస్తున్నారని జగదీశ్‌రెడ్డి చెప్పారు. గోబెల్స్‌కూడా ఆశ్చర్యపోయేలా అబద్ధాలు ప్రచారం చేయడంలో బాబు దిట్టని, ఆయన దుష్ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు తిప్పికొట్టారని.. ఏపీ ప్రజలు కూడా ఓడగొట్టాలని నిర్ణయించుకున్నారన్నారు. హైకోర్టు విభజన జరుగకుండా బాబు పన్నిన కుట్రలు ప్రజలకు తెలుసని, నాలుగున్నరేండ్లుగా కనీసం కోర్టు గదులను ఎందుకు నిర్మించలేదని నిలదీశారు. పక్కరాష్ట్రాలతో కేసీఆర్ పరిణతితో వ్యవహరించారని, మహారాష్ట్రతో కుదుర్చుకున్న ఒప్పందమే నిదర్శనమని చెప్పారు. కేసీఆర్‌ను బూచిగా చూపించి ఏపీలో ఓట్లు పొందాలనుకోవడం తెలివి తక్కువతనం అవుతుందని పేర్కొన్నారు.

చంద్రబాబు గజదొంగ

ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

ప్రకాశం: ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఓ గజదొంగ అని, దేశాన్ని దోచుకోవడానికి మరికొంత మంది దొంగలను ఏకంచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. సోమవారం ఆయన ఒంగోలులో మాట్లాడారు. చంద్రబాబు మానసిక పరిస్థితి అంత బాగోలేదని చెప్పారు. కేసీఆర్‌ను ముందుగా రెచ్చగొట్టింది చంద్రబాబేనని స్పష్టం చేశారు. గతంలో తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ అని తిట్టిన చంద్రబాబు.. ఇప్పుడు అదే తల్లి కాంగ్రెస్‌తో సిగ్గులేకుండా కలిశారని విమర్శించారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ కుంభకోణంలో కాంగ్రెస్ పెద్దలే పాత్రధారులని ఆరోపించారు.

ఉత్తమ్... వాస్తవాలు తెలుసుకో

ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ సూచించారు. ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గడువులోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు, రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పాటిస్తున్నదని తెలిపారు. ఉత్తమ్ ఈ విషయాలు తెలుసుకొని మాట్లాడాలని, ప్రతి దాన్ని రాజకీయం చేయడం తగదని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలని నిలదీశారు. కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీల్లో బీసీలకు రిజర్వేషన్, చట్టసభల్లో చైర్మన్, స్పీకర్ పదవులను, ఆరుగురు రాజ్యసభ సభ్యుల్లో నలుగురు బీసీలకే టీఆర్‌ఎస్ అవకాశం కల్పించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కేసీఆర్‌కు ప్రజలు నీరాజనం పలికారని, దీంతో బాబుకు ఓటమి భయం పట్టుకున్నదని చెప్పారు. టీఆర్‌ఎస్ 16 ఎంపీ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు.



సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య. చిత్రంలో టీఆర్‌ఎస్ రాష్ట్రకార్యదర్శి రూప్‌సింగ్ కూడా ఉన్నారు.

కల్లు తాగిన కోతిలా బాబు

టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య ఫైర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ సీఎం చంద్రబాబు మాటలు కల్లు తాగిలా ఉన్నాయని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య ఎద్దేవాచేశారు. వానలు పడితే వాతలు పోవని, చంద్రబాబు పాత చరిత్రను ప్రజలు మరిచిపోరని చెప్పారు. చంద్రబాబుది రెండు కండ్ల సిద్ధాంతమని, ఇప్పటికే ఒక కన్ను పోయిందని.. వచ్చే ఎన్నికల తర్వాత రెండో కన్ను కూడా పోతుందని హెచ్చరించారు. బీసీలకు ఎవరేం చేశారో చర్చించడానికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బహిరంగచర్చకు రావాలని సవాల్ విసిరారు. సోమవారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ రాష్ట్రకార్యదర్శి రూప్‌సింగ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ యాసలో కేసీఆర్ వాస్తవాలు మాట్లాడారని, చంద్రబాబు లాగా అండి,గిండీలు రావని చెప్పారు. ఏపీలో కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి బాబు ఓర్వలేకపోతున్నారని, చంద్రబాబును ఎన్టీఆర్ స్వయంగా 'జామాత దశమగ్రహం'అని అన్నారని గుర్తుచేశారు. పంచాయతీ ఎన్నికలపై సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరిసున్నదని.. ఉత్తమ్, కోదండరాం బీసీలపై మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బీసీ ఫెడరేషన్లకు ఒక్క పైసా కేటాయించలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లపై తీర్మానం చేయాలని సవాల్ విసిరారు. తమిళనాడు తరహా రిజర్వేషన్లు సాధించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు.

ఈసీకి రిజర్వేషన్ల జాబితా

గ్రామాలవారీగా ఖరారు.. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర వ్యాప్తంగా 12,751 గ్రామాలవారీగా పంచాయతీ రిజర్వేషన్ల జాబితాను సోమవారం పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎన్నికల సంఘానికి అందించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు రిజర్వేషన్లపై గెజిట్ విడుదల చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తూ ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసింది. గ్రామాల అభివృద్ధికి అడ్డుపడకూడదనే ఉద్దేశంతో రిజర్వేషన్ల కోటాను తగ్గించక తప్పలేదు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రాష్ట్రంలో 12,751 గ్రామాలు ఏర్పాటయ్యాయి. వీటిలో 1,281 ఏజెన్సీ గ్రామాలుండగా... 100 శాతం ఎస్టీ జనాభా ఉన్న 1,177 గ్రామాలను గిరిజనులకే కేటాయించారు. మిగిలిన 10,293 పంచాయతీల్లో రిజర్వేషన్ల ప్రకారం ఎస్టీలకు 688, ఎస్సీలకు 2,113, బీసీలకు 2,345 కేటాయించగా 5,147 గ్రామాలు జనరల్ స్థానాలుగా ప్రకటించారు. అన్నింటా 50 శాతం రిజర్వేషన్ కేటాయించడంతో మహిళలకు 6,378 పంచాయతీలు దక్కాయి. మెజార్టీ జిల్లాలన్నీ శనివారం రిజర్వేషన్లపై గెజిట్ విడుదల చేశాయి. రెండు, మూడు జిల్లాల్లో కొన్ని ఇబ్బందులు రావడంతో వాటన్నింటినీ క్లియర్ చేసి కలెక్టర్లు గెజిట్ విడుదల చేశారు. రిజర్వేషన్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘానికి అప్పగించామని పంచాయతీరాజ్‌శాఖ అసిస్టెంట్‌కమిషన్ రామారావు ప్రకటించారు. త్వరలోనే పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఇవ్వనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ రెండు, మూడు రోజుల్లో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్నారు. జనవరి 10లోగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి.. తొలి విడుత ఎన్నికలను ఈ నెల 14 వరకు నిర్వహిస్తారని తెలుస్తున్నది.

పంచాయతీ ఎన్నికలకు రూ.50 కోట్లు విడుదల

ఎన్నికల నిర్వహణకు మొత్తం ఖర్చు రూ.120 కోట్లు

ఎస్‌ఈసీకి ఇప్పటివరకు రూ.87 కోట్లు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రూ.50 కోట్లు విడుదల చేస్తూ పంచాయతీరాజ్‌శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేస్తున్న నేపథ్యంలో ఈ నిధులు విడుదలచేశారు. రాష్ట్రంలోని 12,751 గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మొత్తం రూ.120 కోట్లు అవసరమని ఇప్పటికే నివేదించారు. ఇందులో భాగంగా గత ఏడాది జూన్‌లో రూ.37 కోట్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి విడుదలచేశారు. దీంతో ఇంక్, బ్యాలెట్ బాక్స్‌లు కొనుగోలు చేశారు. బ్యాలెట్ పేపర్లు ముద్రించారు. దాదాపు నాలుగు విడుతల్లో సిబ్బందికి శిక్షణనిచ్చారు. ప్రస్తుతం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల షెడ్యూల్‌ను రెండు, మూడురోజుల్లో ప్రకటించే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి రూ.50 కోట్లు విడుదలచేశారు. ఎస్‌ఈసీ ఖాతాకు ఈ నిధులు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు.

అతివేగానికి నలుగురు బలి

- 160 కి.మీల వేగంతో డివైడర్‌ను, వ్యాన్‌ను ఢీకొట్టిన కారు
- గుంటూరులో బీటెక్ విద్యార్థుల దుర్మరణం



ఏపీలోని గుంటూరు-చిలుకలూరిపేట రోడ్డుపై ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

అమరావతి: అతివేగం నాలుగు నిండు ప్రాణాలను బలి తీసుకున్నది. కొత్త సంవత్సర వేడుకలు జరుపుకొనేందుకు ఏడుగురు బీటెక్ విద్యార్థులు ఒకే కారులో బయలుదేరగా..నిర్లక్ష్యపు డ్రైవింగ్ నాలుగు కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. ఏపీలోని గుంటూరు–చిలకలూరిపేట రహదారిపై లాల్‌పురం వద్ద దాదాపు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను, అదేవేగంతో ఓ వ్యాన్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. అందులోని నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కారు బలంగా ఢీకొట్టడంతో వ్యాన్ సైతం బోల్తాకొట్టింది. డ్రైవర్‌కు, క్లీనర్‌కు గాయాలయ్యాయి. మృతులను గుంటూరులోని విద్యానగర్‌కు చెందిన ధనుష్, పెద్దకూరపాడు మండలం కమ్మంపాడుకు చెందిన సాయిరాం, శావల్యపురానికి చెందిన కోటేశ్వరరావు, కపూర్‌గా గుర్తించారు. బాధితులంతా ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండ్ ఇయర్, థర్డ్ ఇయర్ చదువుతున్నట్టు నిర్ధారించారు. వీరంతా 20 ఏండ్లలోపువారే. వీరు కాలేజీ నుంచి మెయిన్ రోడ్డువైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడినవారు గుంటూరులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనేందుకు విజయవాడకు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతికి బాబే ప్రామాణికం

ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో అవినీతి విషయంలో బిఫోర్ చంద్రబాబు(బీసీ), ఆఫ్టర్ చంద్రబాబు (ఏసీ)గా ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంటుందని ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు విమర్శించారు. సోమవారం తెలంగాణభవన్‌లో మాట్లాడుతూ.. శంకుస్థాపనలకు రాళ్లు వేయడంలో బాబుకు బాబే సాటి అని, ఫౌండేషన్ రత్న అవార్డు ఇవ్వొచ్చని ఎద్దేవాచేశారు. కేంద్రం నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టును మోదీ దగ్గర చెంచాగిరి చేసి రాష్ట్రం పరిధిలోకి తీసుకొచ్చి అవినీతికి చిరునామాగా మార్చారని ధ్వజమెత్తారు. దమ్ముంటే కోర్టు స్టేలను ఎత్తివేయించి అవినీతిపై విచారణను ఎదుర్కోవాలని బాబుకు సవాల్ విసిరారు.

'ఐఎంజీ భూముల సేల్‌డీడ్ రద్దుచేయండి'

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ గచ్చిబౌలిలో ఐఎంజీ సంస్థకు ఏపీ సీఎం చంద్రబాబు కట్టబెట్టిన భూముల సేల్‌డీడ్‌లను రద్దుచేయాలని సీనియర్ న్యాయవాది ఇమ్మినేని రామారావు డిమాండ్‌చేశారు. చట్టవిరుద్ధంగా జరిగిన భూబదలాయింపునకు సంబంధించిన దస్తావేజులు చెల్లవని స్పష్టంచేశారు. రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ చిరంజీవులును సోమవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఆగస్టు 2004లో అప్పటి ఉమ్మడి ఏపీ ఆపద్ధర్మ సీఎం బాబు ఐఎంజీ అకాడమీ ఆఫ్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి గచ్చిబౌలిలోని సర్వేనంబర్ 25లో 400 ఎకరాలను కేటాయించగా, కాంగ్రెస్ రద్దుచేసింది. భూముల రిజిస్ట్రేషన్ రద్దుకాలేదని, సేల్‌డీడ్‌లు మనుగడలోనే ఉన్నాయని, రద్దుచేయాలని రామారావు డిమాండ్‌చేశారు. చర్యలు తీసుకొంటామని కమిషనర్ చిరంజీవులు హామీఇచ్చారు.

డిగ్రీలో సమాజ సేవ, స్వచ్ఛత పాఠ్యాంశాలు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమాజసేవ, స్వచ్ఛత అంశాలను డిగ్రీ పాఠ్య ప్రణాళికలో చేర్చనున్నట్టు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్‌మిశ్రా చెప్పారు. త్వరలో వర్సిటీల వీసీలతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ విభాగం 2019 వార్షిక టేబుల్ క్యాలెండర్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంజీఎన్సీఆర్‌ఈ చైర్మన్ ప్రసన్నకుమార్, రాష్ట్ర జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ విష్ణుదేవ్ (ఎస్‌ఎల్వో), ఎన్నెస్సెస్ డిప్యూటీ ఎస్వో ఎన్ జగన్, ఎంజీఎన్సీఆర్‌ఈ ఓఎస్డీ బీ ప్రభాకర్ పాల్గొన్నారు.

తండాల్లో నవయుగం

ఐదోపేజీ తరువాయి...

వచ్చేవారు. ఈసారి అవన్నీ పంచాయతీలుగా మారడంతో.. వారి గ్రామంలోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.13 లక్షల పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తుండగా.. ఇందులో 48 వేల పోలింగ్ బూత్‌లు కొత్తగా ఏర్పడిన గ్రామాల్లోనే ఏర్పాటుకానున్నాయి. దీంతో ఈసారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరుగనుంది.

సరికొత్త చరిత్ర: శివారు పల్లెలు, తండాలు, గూడేలంటే నిర్లక్ష్యం ఉండేది. గ్రామాల ప్రజాప్రతినిధులు కేవలం వారిని ఓటుబ్యాంకుగా వాడుకునేవారు. నిధులు, అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనలో వారిని పట్టిచుకునేవారు కాదు. కనీసం మోరీలు కూడా నిర్మించని తండాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు పరిస్థితి మారబోతున్నది. ఈసారి ఎన్నికల్లో గెలిచినవారు 'తొలి పాలకవర్గం'గా చరిత్రకెక్కనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.20 లక్షల వరకు అభివృద్ధి నిధులు కేటాయిస్తుండటంతో పల్లెల రూపురేఖలు మారనున్నాయి. అభివృద్ధిలో ఇతర గ్రామాలతో పోటీ పడనున్నాయి.


OM SRI CHAKRA CREATIONS
4 లెటర్స్
కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే...
STORY, SCREENPLAY, DIALOGUES, EDITING & DIRECTION R. RAGHURAJ
PRODUCERS DOMMARAJU HEMALATHA, DOMMARAJU UDAYA KUMAR
MUSIC BHEEMS CICEROLEO DOP CHITTI BABU. K


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
A 'DIL' RAJU PRODUCTION
HAPPY NEW YEAR 2019
F2
FUN
FRUSTRATION
సంక్రాంతి అల్లుళ్ళు
SHIRISH - LAXMAN ANIL RAVIPUDI DEVI SRI PRASAD
HARSHITH REDDY SAMEER REDDY
AS PRAKASH TAMMIRAJU VENKAT BANDI RATNA KUMAR
S KRISHNA
జనవరి
12
సంక్రాంతి
విడుదల
ADITYA MUSIC


SUN PICTURES
కళానిధి మారన్ సమర్పించు
సంక్రాంతికి మీ పేటకి వస్తున్నా..
జనవరి
10
విడుదల
'సూపర్ స్టార్' రజినీకాంత్
పేట
అశోక్ వల్లభనేని - కార్తీక్ సుబ్బరాజ్ చిత్రం - అనిరుధ్ సంగీతం


SRI VENKATESWARA CREATIONS
VYJAYANTHI MOVIES
PVP CINEMA
join the journey of RISHI
HAPPY NEW YEAR
2019
SSMB25
THIS APRIL
మహర్షి
VAMSHI PAIDIPALLY
DEVI SRI PRASAD K.U.MOHANAN
HARI-SOLOMON SUNIL BABU K.L.PRAVEEN RAJU SUNDARAM SHRIMANI RAM-LAXMAN

మష్రాఫే మోర్తజా రికార్డు గెలుపు



ఢాకా: బంగ్లాదేశ్ ఎన్నికల్లో అద్భుతం జరిగింది. బంగ్లా వన్డే జట్టు సారథిగా కొనసాగుతూనే ఎన్నికల బరిలోకి దిగిన మష్రాఫే మోర్తజా ఘన విజయం సాధించాడు. తద్వారా క్రికెటర్‌గా కొనసాగుతూనే పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి బంగ్లాదేశ్ ఆటగాడిగా కొత్త రికార్డు నెలకొల్పాడు. అవామీలీగ్ పార్టీ తరఫున నరైల్-2 నియోజకవర్గం నుంచి బరిలోకి దిగిన మోర్తజా ఏకంగా 96 శాతం ఓట్లను సంపాదించుకున్నాడు. మోర్తజాకు 2,74,418 ఓట్లను సంపాదించుకోగా అతని ప్రత్యర్థిగా బరిలోకి దిగిన జతియా వైక్యా ఫ్రంట్ కూటమి అభ్యర్థి పరీద్‌జమాన్ ఫర్హద్ కేవలం 8006 ఓటర్లను పొందాడు. 11వ సాధారణ ఎన్నికల్లో ఘన విజయంతో బంగ్లాదేశ్ తరఫున ఆ దేశ పార్లమెంట్‌కు ఎన్నికైన రెండో క్రికెటర్‌గా మోర్తజా వార్తల్లో నిలిచాడు. నైముర్ రెహమాన్ దుర్జోయ్ తొలిసారి బంగ్లా పార్లమెంట్‌కు ఎన్నికయ్యాడు. వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ అనంతరం క్రికెట్ నుంచి రిటైర్ కానున్న ఈ క్రికెటర్ ఈ విజయంతో రాజకీయాల్లో కొనసాగేందుకు మార్గం సుగమమైంది.

స్మృతి మంధానకు అరుదైన గౌరవం

ఐసీసీ మహిళా క్రికెటర్ ఆఫ్ ది ఇయర్.. వన్డే ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపిక

ఐసీసీ వన్డే జట్టు కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్..

వన్డే టీ,టీ20 జట్లలో చోటు సంపాదించుకున్న స్మృతి, పూనమ్



దుబాయ్: భారత మహిళల స్టార్ ఓపెనర్ స్మృతి మంధానకు అరుదైన గౌరవం దక్కింది. 2018 ఏడాదికిగాను క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నట్లు సోమవారం అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) ప్రకటించింది. అంతేకాదు ఉత్తమ వన్డే ప్లేయర్‌గానూ నిలిచిన మంధన అరుదైన గౌరవం అందుకుంది. 2007లో భారత పేసర్ జులన్ గోస్వామి తర్వాత ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న రెండో భారత మహిళా క్రికెటర్ మంధాన కావడం విశేషం. అంతేకాదు ఒకే క్యాలెండర్ ఇయర్‌లో రెండు ఐసీసీ అవార్డులు అందుకున్న తొలి మహిళా క్రికెటర్‌గానూ కొత్త రికార్డు నెలకొల్పింది. ఆన్‌లైన్ ఓటింగ్‌లో అత్యధిక ఓట్ల సాధనతో మంధాన అవార్డులను గెలుచుకుంది. ఈ ఏడాది ఆడిన 12 వన్డేల్లో 66.90 సగటుతో 669 పరుగులు, 25 టీ20ల్లో 130.67 స్ట్రైక్‌రేట్‌తో 662 పరుగులు చేసింది. అంతేకాదు.. వెస్టిండీస్‌లో ముగిసిన మహిళల టీ20 ప్రపంచకప్‌లోనూ అదరగొట్టింది. మహిళల జట్టు సెమీస్ చేరడంలో కీలకపాత్ర పోషించిన 22 ఏండ్ల మంధాన ప్రపంచకప్ టోర్నీలో 125.35 స్ట్రైక్‌రేట్‌తో 178 పరుగులు సాధించింది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లోనూ దూసుకెళుతున్నది. ఈ ఏడాది వన్డేల్లో 4వ ర్యాంక్‌లో నిలువగా..టీ20 ర్యాంకింగ్స్‌లో 10వ స్థానం సంపాదించుకుంది. 'మైదానంలో మన ప్రతిభకు గుర్తింపుగా అవార్డులు అందుకోవడం చాలా ప్రత్యేకం. అవార్డులు మనల్ని అంకితభావంతో మరింత కష్టపడేలా ప్రేరణనిస్తాయి. దక్షిణాఫ్రికాలో చేసిన సెంచరీ పట్ల నాకు చాలా సంతృప్తిని కలిగించింది. అంతేకాదు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దేశాలతో జరిగిన సిరీస్‌లలోనూ రాణించాను. కాగా, చాలామంది సొంతగడ్డపై నేను భారీస్కోరు చేయడంలేదన్న విమర్శలకు బదులివ్వాలని కోరుకుంటున్నాను' అని అవార్డులు గెలుచుకోవడంపై మాట్లాడుతూ మంధాన పేర్కొంది. మంధాన రెండు ఐసీసీ అవార్డులు అందుకోవడంతో పలువురు భారత క్రికెటర్లతోపాటు ఐసీసీ సీఈవో డేవిడ్ రిచర్డ్సన్ శుభాకాంక్షలు తెలిపారు. అత్యుత్తమ టీ20 ప్లేయర్‌గా ఆసీస్ బ్యాటర్ అలీషా హీలే అవార్డు గెలుచుకోగా.. ఇంగ్లండ్‌కు చెందిన 19 ఏండ్ల ఎడమచేతివాటం స్పిన్నర్ సోఫీ ఎక్సెల్‌స్టోన్ ఉత్తమ వర్ధమాన ప్లేయర్‌గా నిలిచింది.

స్పోర్ట్స్ క్యాలెండర్-2019

క్రికెట్




- జనవరి 3 నుంచి ఆస్ట్రేలియాతో భారత్ నాలుగో టెస్ట్
- శ్రీలంకతో న్యూజిలాండ్ మూడు వన్డేల సిరీస్, ఏకైక టీ20
- పాకిస్థాన్‌తో దక్షిణాఫ్రికా రెండో టెస్ట్
- జనవరి 11 నుంచి పాకిస్థాన్‌తో దక్షిణాఫ్రికా మూడో టెస్ట్
- జనవరి 12 నుంచి ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్
- జనవరి 19 నుంచి పాకిస్థాన్, దక్షిణాఫ్రికా ఐదు వన్డేల సిరీస్
- జనవరి 23 నుంచి భారత్, న్యూజిలాండ్ ఐదు వన్డేల సిరీస్
- వెస్టిండీస్, ఇంగ్లండ్ 3మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్
- జనవరి 24 నుంచి ఆస్ట్రేలియా, శ్రీలంక రెండు టెస్ట్‌ల సిరీస్
- ఫిబ్రవరి 1 నుంచి పాకిస్థాన్, దక్షిణాఫ్రికా మూడు టీ20ల సిరీస్
- ఫిబ్రవరి 6 నుంచి భారత్, న్యూజిలాండ్ మూడు టీ20ల సిరీస్
- ఫిబ్రవరి 13 నుంచి న్యూజిలాండ్, బంగ్లాదేశ్ మూడు వన్డేల సిరీస్, దక్షిణాఫ్రికా, శ్రీలంక రెండు టెస్ట్‌ల సిరీస్
- ఫిబ్రవరి 20 నుంచి వెస్టిండీస్, ఇంగ్లండ్ ఐదు వన్డేల సిరీస్
- ఫిబ్రవరి 28 నుంచి న్యూజిలాండ్, బంగ్లాదేశ్ మూడు టెస్ట్‌ల సిరీస్
- మార్చి 3 నుంచి దక్షిణాఫ్రికా, శ్రీలంక ఐదు వన్డేల సిరీస్
- మార్చి 6 నుంచి వెస్టిండీస్, ఇంగ్లండ్ మూడు టీ20ల సిరీస్
- మార్చి 19 నుంచి దక్షిణాఫ్రికా, శ్రీలంక మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్
- మే 3న ఐర్లాండ్, ఇంగ్లండ్ ఏకైక వన్డే
- మే 5న ఐర్లాండ్, వెస్టిండీస్ వన్డే ఇంగ్లండ్, పాకిస్థాన్ ఏకైక టీ20
- మే 30 నుంచి జూలై 14 వరకు ఐసీసీ వన్డే క్రికెట్ ప్రపంచకప్
- ఆగస్టు 1 నుంచి ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ యాషెస్ టెస్ట్ సిరీస్

టెన్నిస్



- జనవరి 14 నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్
- మే 26 నుంచి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్
- జూలై 1 నుంచి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్
- ఆగస్టు 26 నుంచి యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్
- నవంబర్ 18 నుంచి డేవిస్‌కప్ ఫైనల్స్



- క్రీడాభిమానులకు ఈయేడాది పండుగే పండుగ. జనవరి నుంచి మొదలుపెడితే డిసెంబర్ వరకు టోర్నీలు అభిమానులకు పసందైన విందు అందించనున్నాయి. రెగ్యులర్ టోర్నీలతో సహా మెగా ఈవెంట్లు ఫ్యాన్స్‌కు సరికొత్త అనుభూతులను మిగల్చనున్నాయి.
- జనవరి 9 నుంచి వరల్డ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్

మెగా టోర్నీలు

- మే 30 నుంచి క్రికెట్ వరల్డ్‌కప్
- జూన్ 7 నుంచి ఫుట్‌బాల్ మహిళల వరల్డ్‌కప్
- జూన్ 14 నుంచి యూరోపియన్ గేమ్స్
- జూలై 8 నుంచి పసిఫిక్ గేమ్స్
- జూలై 12 నుంచి స్విమ్మింగ్ వరల్డ్ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్
- సెప్టెంబర్ 20 నుంచి రగ్బీ వరల్డ్‌కప్
- సెప్టెంబర్ 28 నుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్(దోహా)
- అక్టోబర్ 4 నుంచి వరల్డ్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్
- నవంబర్ 7 నుంచి వరల్డ్ చాంపియన్‌షిప్(పారా అథ్లెటిక్స్)

బ్యాడ్మింటన్



- జనవరి 8 నుంచి థాయ్‌లాండ్ మాస్టర్స్
- జనవరి 15 నుంచి మలేషియా మాస్టర్స్
- జనవరి 22 నుంచి ఇండోనేషియా మాస్టర్స్
- ఫిబ్రవరి 19 నుంచి స్పెయిన్ మాస్టర్స్
- ఫిబ్రవరి 26 నుంచి జర్మన్ ఓపెన్
- మార్చి 6 నుంచి ఆల్ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్‌షిప్
- మార్చి 12 నుంచి చైనా మాస్టర్స్ స్విస్ ఓపెన్
- మార్చి 19 నుంచి ఒర్లీన్స్ మాస్టర్స్
- మార్చి 26 నుంచి ఇండియా ఓపెన్
- ఏప్రిల్ 2 నుంచి మలేషియా ఓపెన్
- ఏప్రిల్ 9 నుంచి సింగపూర్ ఓపెన్
- ఏప్రిల్ 30 నుంచి న్యూజిలాండ్ ఓపెన్
- జూన్ 4 నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్
- జూలై 2 నుంచి కెనడా ఓపెన్
- జూలై 9 నుంచి యూఎస్ ఓపెన్
- జూలై 16 నుంచి ఇండోనేషియా ఓపెన్
- జూలై 23 నుంచి జపాన్ ఓపెన్
- జూలై 30 నుంచి థాయ్‌లాండ్ ఓపెన్
- ఆగస్టు 6 నుంచి హైదరాబాద్ ఓపెన్
- ఆగస్టు 19 నుంచి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్
- సెప్టెంబర్ 3 నుంచి చైనీస్ తైపీ ఓపెన్
- సెప్టెంబర్ 10 నుంచి వియత్నాం ఓపెన్
- సెప్టెంబర్ 17 నుంచి చైనా ఓపెన్
- సెప్టెంబర్ 24 నుంచి కొరియా ఓపెన్
- అక్టోబర్ 1 నుంచి ఇండోనేషియా మాస్టర్స్
- అక్టోబర్ 8 నుంచి డచ్ ఓపెన్
- అక్టోబర్ 15 నుంచి డెన్మార్క్ ఓపెన్
- అక్టోబర్ 22 నుంచి ఫ్రెంచ్ ఓపెన్
- అక్టోబర్ 29 నుంచి మకావు ఓపెన్
- నవంబర్ 5 నుంచి చైనా ఓపెన్
- నవంబర్ 12 నుంచి హాంకాంగ్ ఓపెన్
- నవంబర్ 19 నుంచి కొరియా మాస్టర్స్
- నవంబర్ 20 నుంచి స్కాటిష్ ఓపెన్
- నవంబర్ 26 నుంచి సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్
- డిసెంబర్ బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్

హాకీ



- జనవరి 24 నుంచి భారత సీనియర్ మహిళల జట్టు స్పెయిన్ టూర్
- మార్చి 23 నుంచి సుల్తాన్ అజ్లాన్‌షా టోర్నీ
- జూన్ 6 నుంచి ఎఫ్ఐహెచ్ సిరీస్ ఫైనల్స్(పురుషులు)
- జూన్ 15 నుంచి ఎఫ్ఐహెచ్ సిరీస్ ఫైనల్స్ (మహిళలు)

వాణిజ్య

సెన్సెక్స్	నిఫ్టీ
36,068	10,862
↘8	↗3

ముడి చమురు (బ్రెంట్) ↗ 53.38 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	32,270
22 క్యారెట్లు	32,120
వెండి (కిలో)	39,100

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	66.90	72.40
యూరో	76.50	84.50
బహ్రెయిన్ దినార్	178.40	190.40
కువైట్ దినార్	220.80	233.80
సౌదీ రియాల్	17.35	19.15
యూఏఈ దిర్హామ్	17.80	19.40

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	92.00
రిటైల్ లైవ్	114.00
డ్రెస్డ్	165.00
స్కిన్‌లెస్	188.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	439-00
రంగారెడ్డి	439-00
మెదక్	439-00
కరీంనగర్	441-00
వరంగల్	441-00
రిటైల్ ప్రైస్	5-00

నాటి మల్టిబ్యాగర్లే నేడు మట్టిపాలు

స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లు

ఈ ఏడాది 24 శాతం నష్టాలు

గత ఏడాది అనూహ్య రాబడులను అందించిన స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లు.. ఈ ఏడాది వెలవెలబోయాయి. సెబీ కొత్త నిబంధనలు, మార్కెట్ ఒడిదుడుకులు, వ్యాల్యూయేషన్లు అధికంగా ఉండడం వంటి కారణాలతో ఈ షేర్లలో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలు జరిపారు. మరికొన్ని షేర్లు కార్పొరేట్ గవర్నెన్స్ సమస్యలతో సతమతమయ్యాయి. 2018లో బీఎస్ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు 24 శాతం తగ్గి మొత్తం 4,524 పాయింట్లు నష్టపోయింది. కాగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 13.37 శాతం తగ్గి 2,384 పాయింట్లు నష్టపోయింది. గత ఏడాది స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఏకంగా 60 శాతం పెరిగి 7,185 పాయింట్లు లాభపడింది. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 48 శాతం పైగా పెరిగి నికరంగా 5,791 పాయింట్లు లాభపడింది. వడ్డీ రేట్లు పెరగడంతోపాటు రుణ వితరణ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అనేక స్మాల్, మిడ్ క్యాప్ కంపెనీలు వర్కింగ్ క్యాపిటల్ అందక సతమతమయ్యాయి. కొన్ని కంపెనీల విషయంలో షేర్ల ధరలు అమాంతం పెరుగడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిగడంతో పతనం అయ్యాయి. 2018 జనవరి 9న 18,321 పాయింట్ల ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకిన బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్.. అక్టోబర్ 9 నాటికి 13,538 పాయింట్ల కనీస స్థాయికి పతనం అయింది. అలాగే జనవరి 20న 20,183 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన బీఎస్ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్.. అక్టోబర్ 9న 13,396 పాయింట్ల స్థాయికి క్షీణించింది. అనేక షేర్లు ఫండమెంటల్ విలువగా చాలా అధికంగా ట్రేడ్ అవడంతో వాటిని అమ్మేందుకే సంస్థాగత ఇన్వెస్టర్లు మొగ్గు చూపారని సామ్‌కో సెక్యూరిటీస్ సీఈవో జిమీత్ మోదీ అభిప్రాయపడ్డారు. మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు సంబంధించి సెబీ నిర్వచనాన్ని కూడా మార్చడంతో పాటు అదనపు నిఘా చర్యలు (ఎఎస్ఎం) తీసుకోవడం, ఐఎల్అండ్ఎఫ్ఎస్ సంక్షోభం కారణంగా షేర్లు భారీ నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చి హెడ్ వినోద్ నాయర్ అభిప్రాయపడ్డారు. కాగా, స్మాల్, మిడ్ క్యాప్ షేర్లను కొనడానికి దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. అయితే విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మాత్రం లార్జ్‌క్యాప్, బ్లూచిప్ కంపెనీల షేర్లను కొనుగోలు చేయడానికే మొగ్గు చూపారు.

ఎన్‌పీఏలు తగ్గుతున్నాయ్!

- **ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్**

ముంబై, డిసెంబర్ 31: మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) సమస్యతో సతమతమవుతున్న దేశీయ బ్యాంకింగ్ రంగం కోలుకుంటున్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పాలనాపరమైన సంస్కరణల అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. సోమవారం విడుదలైన ఆర్బీఐ అర్ధ వార్షిక ఆర్థిక సుస్థిరత నివేదిక (ఎఫ్ఎస్ఆర్)లోని ముందుమాటలో దాస్ స్పందిస్తూ సర్కారీ బ్యాంకుల్లో బలహీనంగా ఉన్న వాటికి రీక్యాపిటలైజేషన్ ద్వారా మద్దతునివ్వాల్సిన అవసరమూ ఉందని అన్నారు. 'భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థను చాలాకాలం నుంచి నిరర్థక ఆస్తులు వేధిస్తున్నాయి. అయితే ఇప్పుడు ఆ బాధ తగ్గుముఖం పడుతున్నది' అన్నారు. ఇదిలావుంటే ఐఎల్అండ్ఎఫ్ఎస్ రుణ సంక్షోభం నేపథ్యంలో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆర్థిక లావాదేవీలపై దృష్టి పెట్టినట్లు దాస్ చెప్పారు. వివిధ రంగాల్లో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు నిర్వర్తిస్తున్న చాలా సంస్థలకు నాయకత్వం వహిస్తున్న కార్పొరేట్ల ఆర్థిక సామర్థ్యాన్ని దగ్గరగా గమనిస్తున్నట్లు తెలిపారు. కాగా, 2018 సెప్టెంబర్‌తో ముగిసిన ఏడాది కాలంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల బ్యాలెన్స్ షీట్ పరిమాణం 17.2 శాతం పెరిగి 26 లక్షల కోట్లకు చేరినట్లు చెప్పారు. బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గి అందరికీ గృహ రుణాలు అందుబాటులోకి వచ్చినా.. గడిచిన ఐదేండ్లలో ఇండ్ల ధరలు తగ్గాయని ఆర్బీఐ తెలిపింది. ఏప్రిల్-జూన్‌లో 5.3 శాతం దిగువముఖం పట్టాయని పేర్కొన్నది. ఈ పరిణామం కొనసాగితే అన్ని వర్గాలకు సొంతింటి కల సాకారమయ్యే వీలున్నదన్నది. ఆర్థిక రంగ నియంత్రణ వ్యవస్థల్లో పరస్పర సహకారం అవసరమని ఆర్బీఐ అభిప్రాయపడింది. చిట్‌ఫండ్ సంస్థల మోసాలు, ఇటీవలి ఐఎల్అండ్ఎఫ్ఎస్ రుణ సంక్షోభం వంటి ఉదంతాల నివారణకు ఇది ఎంతగానో దోహదపడగలదన్నది.

దిగొచ్చిన మొండి బాకీలు


2018 మార్చిలో 11.5 శాతంగా ఉన్న స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి (జీఎన్‌పీఏ).. సెప్టెంబర్‌లో 10.8 శాతానికి తగ్గిందని దాస్ ఈ సందర్భంగా తెలిపారు. గత మూడేండ్లలో తగ్గుముఖం పట్టడం ఇదే తొలిసారని చెప్పారు. మార్చి 2015 తర్వాత సెప్టెంబర్‌లోనే జీఎన్‌పీఏ దిగివచ్చిందన్నారు. నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి (ఎన్ఎన్‌పీఏ) కూడా 6.2 శాతం నుంచి 5.3 శాతానికి జారిందని తాజా నివేదికలో ఆయన వివరించారు. ఇక ప్రభుత్వ రంగ బ్యాంకుల విషయానికొస్తే.. మార్చిలో జీఎన్‌పీఏ 15.2 శాతంగా, సెప్టెంబర్‌లో 14.8 శాతంగా ఉందన్నారు. ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఇది 4 శాతం నుంచి 3.8 శాతానికి తగ్గింది. మార్చి ఆఖరు నాటికి బ్యాంకింగ్ రంగంలో రూ.10.39 లక్షల కోట్ల ఎన్‌పీఏలున్నాయని ఆర్బీఐ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో ప్రభుత్వ బ్యాంకుల వాటా రూ.8.95 లక్షల కోట్లుగా ఉన్నది.

మార్కెట్ పెరిగింది సంపద కరిగింది!



2018లో స్టాక్ మార్కెట్ నికరంగా పెరిగినా.. ఇన్వెస్టర్ల సంపద మాత్రం హరించుకుపోయింది. ఈ ఏడాది కాలంలో నిఫ్టీ 332 పాయింట్లు పెరిగింది. అయితే ఇన్వెస్టర్ల సంపద మాత్రం రూ.7,25,401 కోట్లు కరిగిపోయింది. సెన్సెక్స్ గత ఏడాది కాలంలో 32,483 నుంచి 38,989 స్థాయిల మధ్య ట్రేడ్ అయింది. అయితే 2017తో పోల్చితే ప్రధాన సూచీలు చాల స్వల్పంగా పెరిగాయి. గత ఏడాది నిఫ్టీ 28.65 శాతం పెరిగితే, ఈ ఏడాది మాత్రం కేవలం 3.2 శాతం లాభపడింది. సెన్సెక్స్ ఈ ఏడాది కాలంలో 5.90 శాతం పెరిగి మొత్తం 2,011.5 పాయింట్లు లాభపడింది. కానీ, మొత్తం బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 7,25,401.31 కోట్ల మేర తగ్గిపోయింది. సెన్సెక్స్ గత ఏడాది 28 శాతం లాభపడింది. 2016లో కూడా ప్రధాన సూచీలు మూడు శాతం లాభాలకు పరిమితం అయ్యాయి.

ఊగిసలాటలో రోజంతా


సంవత్సరాంతం రోజున ప్రారంభ లాభాలు చివరి దాకా నిలువలేకపోయాయి. 53 పాయింట్ల లాభంతో ప్రారంభం అయిన నిఫ్టీ ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ చివరికి కేవలం మూడు పాయింట్ల లాభంతోనే స్థిరపడింది. సెన్సెక్స్ 8 పాయింట్ల స్వల్ప నష్టంతో ముగిసింది. రోజంతా ఊగిసలాట ధోరణితో ట్రేడ్ అయిన మార్కెట్‌లో మెటల్ షేర్లు మెరిశాయి. రూపాయి మారకం విలువ 16 పైసలు రికవరీ అయి ట్రేడ్ అవుతున్నప్పటికీ సెంటిమెంట్ మెరుగవ్వలేదు. సంవత్సరాంతం కావడంతో ట్రేడర్లు తక్కువ స్థాయిలో మార్కెట్లో పాల్గొన్నారు. మెటల్ ఇండెక్స్ గరిష్ఠంగా 1.36 శాతం లాభపడింది. ఫార్మా ఇండెక్స్ 0.62 శాతం, ఐటీ ఇండెక్స్ 0.38 శాతం, మీడియా ఇండెక్స్ 0.39 శాతం, బ్యాంక్ నిఫ్టీ, ఆటో ఇండెక్స్‌లు 0.13 శాతం చొప్పున లాభపడ్డాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.46 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.77 శాతం చొప్పున లాభపడ్డాయి. కాగా, రియల్టీ ఇండెక్స్ 0.36 శాతం, ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 0.09 శాతం చొప్పున నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో మొత్తం 1,071 షేర్లు లాభపడగా, 726 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలోని జెఎస్‌డబ్ల్యూ స్టీల్ 3.15 శాతం, టాటా స్టీల్ 1.59 శాతం, వేదాంత 1.38 శాతం, టాటా మోటార్స్ 1.29 శాతం, సన్‌ఫార్మా 1.16 శాతం చొప్పున లాభపడ్డాయి. కాగా, ఇన్‌ఫ్రాటెల్ 1.56 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 1.34 శాతం, హిందుస్తాన్ పెట్రోలియం 1.09 శాతం, హీరో మోటోకార్ప్ 1.04 శాతం చొప్పున నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో పది షేర్లు కొత్త 52 వారాల గరిష్ఠ స్థాయిలను నమోదు చేయగా, 43 షేర్లు 52 వారాల కనీస స్థాయిని నమోదు చేశాయి. ఈ ఏడాది చివరి రోజు ఎఫ్ఐఐలు రూ. 326.87 కోట్ల అమ్మకాలు జరుపగా, డీఐఐలు మొత్తం రూ. 321.98 కోట్ల కొనుగోళ్లు జరిపారు.

మనది ఏడో అతిపెద్ద స్టాక్ మార్కెట్

జర్మనీని వెనక్కినెట్టిన భారత్

మార్కెట్ క్యాపిటలైజేషన్‌వారీగా జర్మనీని అధిగమించి ప్రపంచంలోనే ఏడో అతిపెద్ద స్టాక్‌మార్కెట్‌గా దేశీయ స్టాక్ మార్కెట్ ఎదిగింది. 2.08 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో జర్మనీని అధిగమించినట్టు బ్లూమ్‌బర్గ్ తెలిపింది. 27 లక్షల డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో అమెరికా అగ్రగామిగా ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, జపాన్, హాంకాంగ్, బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఉన్నాయి. వర్ధమాన దేశాల మార్కెట్లన్నింటిలోకి ఇండియా మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతున్నది. దేశీయ ఉత్పత్తి రంగం వృద్ధిరేటు వేగం పుంజుకోనప్పటికీ దేశీయ మార్కెట్ మిగతా మార్కెట్ల కన్నా అధిక రాబడులను ఇచ్చింది. బీఎస్ఈ సెన్సెక్స్ గత ఏడాది కాలంలో రూపాయి మారకంలో 5 శాతం రాబడులను ఇస్తే, డాలర్ మారకంలో 4 శాతం నష్టపోయింది. అయితే మోర్గాన్ స్టాన్లీ ఎమర్జింగ్ మార్కెట్ల ఇండెక్స్‌తో పోల్చితే సెన్సెక్స్ అతి తక్కువగా పతనం అయింది. సాధారణంగా దేశీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అనుగుణంగా స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ పెరుగుతూ వస్తుంది. 2007లో దేశ జీడీపీ కన్నా 151 శాతం అధికంగా మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉండగా, ప్రస్తుతం 77 శాతం మాత్రమే ఉంది. దీంతో మరింత వృద్ధి చెందడానికే అవకాశాలున్నాయని విశ్లేషకుల అంచనా. 2027 నాటికి 6.7 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు దేశీయ స్టాక్ మార్కెట్ ఎదుగుతుందని అంచనా. మార్కెట్ క్యాపిటలైజేషన్ పెరిగేకొద్దీ బ్రోకింగ్, స్టాక్ ఎక్స్ఛేంజీలు, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల బిజినెస్ కూడా వృద్ధి చెందుతుంది.


HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
Combi Brake
HAPPY 2009
మిగతా ఇండస్ట్రీ అంతా ఈ సంవత్సరం వరకు చేరుకుంటూ ఉంటే,
మేము అప్పటికే కాంబి-బ్రేక్ సిస్టమ్‌ని ప్రవేశ పెట్టాం.
2 కోట్లకు* పైగా రైడర్లు హోండా కాంబి-బ్రేక్ సిస్టంలోని ఈక్వలైజర్ టెక్నాలజీని విశ్వసిస్తున్నారు.
నూతన సంవత్సర శుభాకాంక్షలు 2019
హోండా అంటే HONDA
Product shown in the picture may vary from the actual product. Accessories shown in the picture are not part of standard equipment.
*As per Honda Motorcycle and Scooter India Pvt. Ltd. dispatch figures.
Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49 - 50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 1 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



అదే గోదాదేవి తత్వం!

గత పదిహేను రోజులుగా హైదరాబాద్ మహానగరంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు 16వ రోజుకు చేరుకున్నాయి. నందగిరి హిల్స్‌లోని మైహోమ్ గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వరరావు నివాసంలో ఈ ఉత్సవాలు భక్తుల సమక్షంలో జరుగుతున్నాయి. జనవరి 14వ తేదీ వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామి ధనుర్మాస వ్రత విశేషాలను భక్తులకు వర్ణించి చెబుతున్నారు. గోదాదేవి ధనుర్మాస వ్రతంలో భాగంగా ఆచరించిన పద్ధతులను, ప్రవచించిన పాశురాలను ఆయన సవివరంగా ఉద్ఘాటిస్తున్నారు. 'జై శ్రీమన్నారాయణ' నామస్మరణతో భక్తులకు, శిష్యబృందానికి గోదాదేవి వ్రతకథా విధానాన్నంతా స్వామి తెలియజెప్పారు.

గోదాదేవి గోపికా జనాన్ని మేల్కొలిపి వారిని తనతోపాటు తీసుకొని నందగోప భవనం దగ్గరికి వచ్చింది. అక్కడ ఉన్న శ్రీకృష్ణుడిని ప్రార్థించాలన్నది ఆమె ఆలోచన. నందగోపుడిని అర్థించి, అతని ద్వారా శ్రీకృష్ణుడిని ప్రసన్నం చేసుకోవాలని తలచింది గోదాదేవి. ఆ ప్రాంతానికి రాజైన నందగోపుడు తన గోపుర భవనానికి పటిష్ఠమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడు. అందులోకి అందరూ ప్రవేశించడం సాధ్యం కాదు. కానీ, భగవంతుడిని చూడాలన్న సంకల్పంతో ఆ రక్షకభటులను తనతోపాటు వచ్చిన గోపికా జనాలతో కలిసి వేడుకుంటుంది గోదాదేవి.

తొలి ద్వారం దగ్గర కాపలా ఉన్న వ్యక్తి వారిని లోపలికి పంపాడు. కానీ, ప్రధాన ద్వారం దగ్గర ఉన్న రక్షకభటుడు మహా ఘటికుడు. ఎవరిని పడితే వారిని ఆయన లోపలికి వెళ్లనివ్వడు. ఆ ద్వారపాలకుడిని వేడుకొని నందగోప భవనంలోకి వెళ్లడం గురించి వర్ణించేదే 16వ రోజు ప్రస్తావించిన పాశురంలో వివరించారు చిన జీయర్ స్వామి వారు. మంత్రం ద్వారా, ప్రార్థన ద్వారా, దీక్ష ద్వారా మాత్రమే భగవంతుడిని దర్శించుకుంటాం. లేదంటే అది సాధ్యం కాదు. మరి, ఆ మంత్రం ఎలా తెలియాలి? దీక్ష ఎలా తెలుసుకోవాలి? అనే ప్రశ్నకు సమాధానం పాశురాలు తెలియజేస్తాయని అన్నారాయన. 'మంత్రం ద్వారా భగవంతుడిని ప్రసన్నం చేసుకోవాలంటే అది తెలిసి ఉండాలి. లేదంటే, ఆ మంత్రం తెలిసిన బ్రాహ్మణుడిని ఆశ్రయించాలని పేర్కొన్నారాయన. మంత్రం తెలిసిన బ్రహ్మ ద్వారా, బ్రాహ్మణుడి ద్వారా భగవంతుడు ప్రసన్నం అవుతాడు. భగవంతుడి ప్రసన్నం ద్వారా ప్రపంచాన్ని గెలవవచ్చు' అని స్వామి వివరించారు.

ఈ ప్రకృతిలో అపర ప్రకృతి, పరా ప్రకృతులు భగవంతుడి ఆధ్వర్యంలో ఉంటాయి. భూమి, ఆపహ, అనల, వాయు, కమ్, మనస్సు, బుద్ధి, అహంకారం అనే ఎనిమిది విభాగాలు అపర ప్రకృతిలో ఉంటాయి. ఇవన్నీ భగవంతుడు చెప్పినట్టు వింటాయి. మనిషి ఈ ఎనిమిది రకాల అపర ప్రకృతుల కంటే పై దశలో ఉంటాడు. అందుకే, జీవుడు పరా ప్రకృతిలో ఉంటాడు. అయినప్పటికీ, భగవంతుడి ఆధీనంలోనే ఉంటాడు. అతను స్వయంగా చలించలేడు. భగవంతుడి ఆజ్ఞ లేనిదే పరాపర ప్రకృతులు ఏవీ చలించవు అని బోధించారాయన.

'ధర్మబద్ధంగా జీవించాలి. సమాజంలో ఒక ప్రముఖ వ్యక్తిని కలువాలంటేనే, ఆ ప్రముఖుడికి పరిచయం ఉన్న మరో వ్యక్తిని సంప్రదిస్తాం. కేవలం మనుష్య మాత్రుడిని కలుసుకోవాలంటేనే అంత ప్రాసెస్ ఉంటే, ఈ సకల చరాచర సృష్టికి ఆధార భూతమై నడిపిస్తున్న భగవంతుడిని సాక్షాత్కారం చేసుకోవాలంటే ఎంత కష్టపడాలి. శరీరాన్ని, మనసును ఆయనకే అంకితం చేయాలి. ధర్మబద్ధమైన జీవితాన్ని ఆచరించాలి. దీనికి ఒక గురువును ఆశ్రయించాలి. ఆయన ఆధ్వర్యంలో, ఆయన సూచనలతో భగవంతుడిని చేరే మార్గం తెలుసుకుంటాం. చాలామంది భగవంతుడిని చేరే మార్గాన్ని అన్వేషించే క్రమంలో పలు గ్రంథాలు, ఇతిహాసాలు, వేదాలు, భగవద్గీత, మహాభారతం, రామాయణం వంటివి వల్లె వేస్తుంటారు' అని స్వామి వారు పేర్కొన్నారు.

అన్నింటి కంటే గొప్పవాడైన, మహనీయుడైన శ్రీకృష్ణ పరమాత్ముడు కూడా ఆ గోపభవనంలో నందగోపుడు చెప్పినట్టుగా వింటున్నాడు. అలాంటిది మానవ మాత్రులమైన మనం ఆ భగవంతుడిని చేరడానికి గురువు, బ్రాహ్మణుడు చెప్పినట్టు ఆచరించలేమా? గోపవనంలో అతి బలవంతుడైన శ్రీ కృష్ణుడిని రోలుకు కట్టేస్తే కదలకుండా అక్కడే పడి ఉన్నాడు. ఆ భగవంతుడిని కట్టి పడేసిన గోప బాలురను కలిస్తే ఆ భగవంతుడిని చేరుకోవచ్చు. ఆ పరమాత్ముడిని చేరుకునే మార్గంలో ఉండే ద్వారాల దగ్గర ద్వార శేషులను ప్రసన్నం చేసుకుంటేనే ఆ భగవంతుడు కొలువుండే ద్వారం వద్దకు చేరుకోగలుగుతాం. ఉదాహరణకు ఒక ఆఫీసులో పెద్ద ఆఫీసరుతో పని జరుగాలంటే నేరుగా ఆయనతోనే కాకుండా, ఆ ఆఫీసులో పనిచేసే గుమాస్తాను ప్రసన్నం చేసుకుంటే మన పని తొందరగా పూర్తవుతుంది. ఈ పద్ధతిని గోదాదేవి బాగా ఆకలింపు చేసుకుంది' అని చిన జీయర్ స్వామి వెల్లడించారు. ఆ నందుడిని చేరుకోవాలంటే, ప్రసన్నం చేసుకోవాలంటే అతనికి సేవ చేసే కిందివర్గం వారిని నిర్లక్ష్యం చేయకుండా వారిని దాటుకొని వెళ్లాలని స్వామి చెప్పారు. వారిని ప్రసన్నం చేసుకుంటేనే ప్రధాన అధికారి అయిన పరమాత్ముడిని చేరుకుంటాం. ఇదే పద్ధతి మానవ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన అన్నారు.

'నిన్ను నమ్మి, నిన్ను నువ్వు సక్రమంగా తెలుసుకోవాలని ప్రయత్నించినా అది సాధ్యం కాదు. భగవంతుడి ఉపాసన ద్వారానే అది సాధ్యపడుతుంది. ఎందుకంటే, జీవి ఉండేది భగవంతుడి ఆధీనంలోనే కాబట్టి. 'జరామరణ మోక్షాయ.. మామ్ ఆశ్రిత్య.. యేయతంతి' జనన మరణాలను అతిక్రమించిన జీవుడికి సైతం భగవంతుని సాక్షాత్కారం కావాలంటే కూడా నేను సంకల్పించాల్సిందే' అని పదమూడవ అధ్యాయంలో పరమాత్మ ప్రస్తావించాడు. బతికి ఉన్నప్పుడు మన దేహంలో, మనం ఉన్నప్పుడు ఆ దేహాన్ని మనం లీడ్ చేయగలుగాలి. ఆ దేహానికి నాయకత్వం వహించగలుగాలి. అహింస, మానవత్వం, అలంబిత్వం, శాంతి, అర్జవం, శౌచం, స్థైర్యం, ఆత్మనిగ్రహం, ఆచార్యోపాసనం అనేవి ప్రతి జీవుడు ఆచరించవలసినవి. దేవుడి దగ్గరకు వెళ్లాలంటే, జీవితానికి ఒక ముక్తి లభించాలంటే ఇవన్నీ పాటించాలి' అని చిన జీయర్ స్వామి వివరించారు.

పరమాత్ముడు మనకు సుపరిచితుడే!



'ఒకసారి మన మీద పడిన మచ్చ ఎన్ని ప్రయత్నాలు చేసినా పోగొట్టుకోలేం. భగవంతుడిని చేరుకునే క్రమంలో మనం తెలిసీ, తెలియక చేసిన తప్పులు కూడా కొన్నిసార్లు భగవత్ సాక్షాత్కారానికి అడ్డు కావచ్చు. ఎలా అయితే, ఆఫీసులో గుమాస్తాను నిర్లక్ష్యం చేసి, ఆఫీసరును కలువడానికి ఇబ్బంది పడుతామో ఇది కూడా అలాంటిదే అన్నమాట. అందుకే.. చిన్నవారైనప్పటికీ, ఆ పరమాత్ముడు మనకు సుపరిచితుడు. అత్యంత ప్రీతిపాత్రుడైనప్పటికీ ఆయనను సేవించే వారిని కూడా ప్రసన్నం చేసుకోవాలి. సంతోష పరచాలి. మన దైనందిన జీవితంలో కూడా చిన్న, పెద్ద అనే భేదం లేకుండా అందరినీ గౌరవించాలి. అందరినీ ఆదరించాలి, ప్రేమించాలి. అప్పుడే జీవితం బాగుంటుంది' అన్న సందేశం పదిహేనవ పాశురం ద్వారా గోదాదేవి మానవాళికి తెలియజెప్పిందని చిన జీయర్ స్వామి పేర్కొన్నారు.

... ప్రవీణ్‌కుమార్ సుంకరి



సిరిముగ్గు

20 చుక్కలు 10 వరుసలు 10 వచ్చేవరకు





హసిత
విద్యానగర్
హైదరాబాద్

ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10, హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com

కొత్త తీర్మానాలు

చాలామంది ఏవేవో సాధించేద్దామని పెద్ద పెద్ద తీర్మానాలు పెట్టుకుంటారు. అలా కాకుండా మీరు ఏవైతే చేయలగరో, మీకు ఏవైతో అంత్యంత అవసరమో మీకే తెలుస్తుంది. మీరూ నూతనంగా ఈ కొత్త ఏడాదిలో బతకాలనుకుంటే.. మీరేం పనులు చెయ్యాలో మీ మనసే చెబుతుంది. ఒక్కసారి గుండెమీద చెయ్యి వేసుకొని మీ మనసు మాట వినండి.



- 1వ తారీఖు నుంచే జిమ్‌కు వెళ్లాలని చాలామంది అనుకుంటుంటారు. ఇది మంచి ఆలోచనే. మనం ఆరోగ్యంగా ఉంటేనే ఏ పనైనా చెయ్యగలం. ఎలాంటి లక్ష్యాలనైనా అధిగమించగలం. ఆరోగ్యంపై శ్రద్ధను మీ తీర్మానాల్లో ఉండేలా ప్లాన్ చేసుకోండి.
- చాలామంది డబ్బునంతా 1వ తారీఖు నుంచే వృథాగా ఖర్చు చేస్తుంటారు. మీ ఎంజాయ్‌మెంట్‌ను ప్లాన్ చేస్తూనే ఖర్చు తక్కువగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోండి.
- అనాథలు, వికలాంగులు, వృద్ధుల కోసం చాలా ఆశ్రమాలున్నాయి. వారి జీవితంలో ఏ వేడుక ఉండదు. అలాంటి చోటికి వెళ్లి మీకు సంబంధించిన వేడుకలు వారితో కలిసి చేసుకోండి. వారికి అవసరమైన వస్తువులు కొనివ్వండి. ఖర్చు కొంచెం ఎక్కువైనా.. వారికి దొరికే సంతోషం వెలకట్టలేనిది.
- మీకు సమయం దొరికినప్పుడల్లా మీ బంధువుల్ని, స్నేహితుల్ని ఇంటికి పిలిచి చక్కని విందు ఏర్పాటు చేయండి. వారికి ఇష్టమైన డిషెస్‌ని మీరే స్వయంగా తయారు చేయండి. రుచి ఎలా ఉంటుందో అన్న ఆలోచన వద్దు. మీరు స్వయంగా వండి వడ్డించారంటే... అతిథులకు ఆ ఆనందమే వేరు. కొత్త సంవత్సరం తొలిరోజున స్నేహితులు, బంధువులతో మీ ఇల్లు కళకళలాడటం ఖాయం. వీలైతే 'ఫ్యామిలీ గెట్ టు గెదర్' పార్టీలు చేసుకోండి.
- నిత్యం ఉద్యోగం, వ్యాపారాల్లో మునిగిపోకుండా కుటుంబంతో కూడా గడిపేందుకు సమయం కేటాయించుకోండి. ఇందుకు టూర్స్ బాగా ఉపకరిస్తాయి. టూర్స్ అంటే వారం రోజులే వెళ్లక్కర్లేదు. రెండు రోజులకు దగ్గర్లో ఏదైనా మంచి టూరిస్ట్ స్పాట్ ఉంటే వెళ్లొచ్చు. తీరిక సమయాల్లో పిల్లలతో గడిపితే వచ్చే ఆనందమే వేరు.
- మీరు పార్టీలకు అవసర ఖర్చులకు ఉపయోగించే డబ్బులతో ఓ కుటుంబం నెలంతా సంతోషంగా బతుకుతుంది. రూ.5,000-రూ.10,000 వరకూ నిరుపేదలకు సాయం చేయండి. లేదంటే బొమ్మలు, పుస్తకాలు, దుస్తులు, బియ్యం కొనివ్వండి.

వరల్డ్‌కప్ పండుగ



క్రికెట్ అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న వరల్డ్‌కప్ పండుగ ఈ ఏడాదిలో జరుగనున్నది. ఇంగ్లాండ్ వేదిక మే నెల 30 నుంచి జులై 14 వరకు క్రికెట్ ఫీవర్ ప్రపంచమంతా పాకనున్నది. ఇందుకు విరాట్ సేన ఇప్పటి నుంచే కసరత్తులు, ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న టెస్ట్ మ్యాచుల్లో రెండు గెలిచి మంచి జోరుమీదున్న టీమిండియా ఈ ఏడాది వరల్డ్ కప్ కూడా కొట్టాలని కోరుకుందాం. వరల్డ్ కప్‌తో పాటు క్రేజ్ సంపాదించుకున్న ఐపీఎల్. మార్చి 29 నుంచి మే 19 వరకూ.. అంటే, వరల్డ్‌కప్‌కంటే ముందే క్రికెట్ అభిమానులకు మరింత వినోదాన్ని అందిస్తున్నది ఐపీఎల్.


అధ్యయనం

ధ్యానం కన్నా నడకే మిన్నా!

ఒత్తిడిని తగ్గించుకోవడానికి, ఏకాగ్రతను పెంచుకోవడానికి చాలామంది ధ్యానం చేస్తుంటారు. దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని కూడా నిరూపితమైన సంఘనటలు ఎన్నో ఉన్నాయి. అయితే ధ్యానం కన్నా బెటర్ ఆప్షన్ ఉంది అంటున్నారు ఆరోగ్య నిపుణులు.



సాధారణంగా ఒత్తిడి ఉన్నవారిలో హైబీపీ సమస్యలు ఉంటాయి. ప్రతీదానికి చిరాకు పడటం.. ఏకాగ్రత కోల్పోవడం.. కోపం తెచ్చుకోవడం వంటి లక్షణాలు తరచూ ప్రదర్శిస్తుంటారు. వీటన్నింటినీ నియంత్రణలో పెట్టుకోవడానికి మెడిటేషన్‌ను అయితే ఎలా సాధనంగా ఉపయోగిస్తున్నామో.. నడకను కూడా అలాగే సాధనంగా ఉపయోగించవచ్చు అంటున్నారు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ సైన్స్ పరిశోధకులు. హైబీపీ సమస్యలను పరీక్షించేందుకు వీరు 29,281 పరీక్షలు జరిపారు. 10,461 వలంటీర్లు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. మెడిటేషన్‌ను పాటిస్తున్న వారిపై జరిపిన 194 పరీక్షల్లో హైపర్‌టెన్సివ్ సమస్యల్లో పెద్దగా మార్పుల్లేనట్లు తేలాయి. నడకను పాటిస్తున్నవారిపై జరిపిన 400 పరీక్షల్లో హైపర్‌టెన్సివ్ సమస్య తగ్గినట్లుగా తేలింది. దీన్నిబట్టి మెడిటేషన్ కన్నా కూడా నడక మంచి ఉపయోగకారిగా పనిచేస్తుందని చెప్పవచ్చు అంటున్నారు యూకే శాస్త్రవేత్తలు. హైపర్‌టెన్షన్ సమస్యలు తగ్గించుకోవడానికి నడక మంచి ఔషధకారి అని వారు పేర్కొన్నారు. సాధారణ నడకతో పాటు తేలికపాటి వ్యాయామం చేస్తే ఇంకా మంచిదనీ అంటున్నారు.



నిండా ముంచేసే.. న్యుమోనియా!

ఇండియా వేగంగా అభివృద్ధి చెందుతున్నది. అభివృద్ధితో సమానంగా న్యుమోనియా కూడా వేగం పుంజుకుంటున్నది. ఇది యునిసెఫ్ చెప్పిన మాట. న్యుమోనియా కారణంగా లక్షలాది మంది పిల్లలు చనిపోతున్నారట. మరి.. తెలిసి కూడా న్యుమోనియాను ఇలానే చెలరేగనిద్దామా? న్యుమోనియా ఎందుకు వస్తుంది? చికిత్స ఏంటి? జాగ్రత్తలేంటి? తెలుసుకుందాం.

న్యుమోనియా వ్యాధి చిన్న పిల్లలకే కాదు.. పెద్దవాళ్లకూ సోకుతుంది. ఇది చాలా ప్రమాదకరం. ప్రాణాంతకం కూడా. ఇండియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాధుల్లో న్యుమోనియా ఒకటి. ఈ కారణంగానే ఐదేళ్లలోపు వయసున్న పిల్లలు చనిపోతున్న దేశాల జాబితాలో ఇండియా చేరింది. ఒక్క 2015 సంవత్సరంలోనే న్యుమోనియా వ్యాధి సోకి 12 లక్షల మంది చిన్నారుల ప్రాణాలు పోయాయని యునిసెఫ్ నివేదిక తెలియజేస్తున్నది.

వ్యాధి తీవ్రత

ఇండియాలో నెలలు నిండకుండా పుట్టడం వల్ల చనిపోయే చిన్నారుల సంఖ్య ఎక్కువ. ఆ తర్వాత స్థానం నిమోనియాదేనట. అంటే ఒక్క న్యుమోనియా వ్యాధి వల్ల భావి జీవితాలకు ఏవిధమైన ప్రమాదం పొంచి ఉందో అర్థం చేసుకోవచ్చు. న్యుమోనియా వ్యాధిని అరికట్టడం మన చేతుల్లోనే ఉంది. అప్రమత్తంగా ఉండి న్యుమోనియా పట్ల అవగాహన ఏర్పరచుకుంటే పిట్టల్లారాలిపోతున్న పిల్లల్ని బతికించుకోవచ్చు.

న్యుమోనియా అంటే?

ఊపిరితిత్తులు అందించే శ్వాస ద్వారానే మనిషి ప్రాణాలు నిలుస్తాయి. ముక్కు నుంచి వెళ్లిన గాలి జీవక్రియలకు అవసరమైన ఆక్సిజన్‌ను ఊపిరితిత్తుల చివరి భాగమైన అల్వియోలై అనే గాలి గదిలో మార్పిడి చేస్తుంది. అక్కడి నుంచి జీవక్రియల్లో విడుదలైన హానికర వ్యర్థ వాయువులైన కార్బన్‌డయాక్సైడ్ వంటి వాటిని అక్కడి నుంచి బయటకు తీసుకువస్తుంది. ఈ చర్య నిరంతరం జరుగుతూ ఉండటం వల్లనే మనం జీవించగలుగుతున్నాం. ఊపిరితిత్తుల్లోని అత్యంత కీలకమైన గాలి గది అల్వియోలై భాగంలో ఆక్సీజన్, కార్బన్‌డయాక్సైడ్‌ల మార్పిడి జరుగుతుంది. ప్రమాదవశాత్తు అల్వియోలైలో ద్రవాలు చేరితే శ్వాసక్రియ సక్రమంగా జరగదు. ఈ పరిస్థితినే న్యుమోనియా అంటారు.

ఎన్ని రకాలు?

న్యుమోనియాను కమ్యూనిటీ ఎక్వైర్డ్, హాస్పిటల్ ఎక్వైర్డ్, హెల్త్‌కేర్ అసోసియేటెడ్, వెంటిలేటర్ అసోసియేటెడ్ అని విభజించారు. పరిసరాల ప్రభావం వల్ల వస్తే కమ్యూనిటీ ఎక్వైర్డ్ న్యుమోనియా అంటారు. హాస్పిటల్‌లో ఉండగా వారికి 48 గంటల తర్వాత న్యుమోనియా వస్తే దానిని హాస్పిటల్ ఎక్వైర్డ్ అంటారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉండి లేదా ఇతర కారణాల వల్ల న్యుమోనియా సోకితే దానిని హెల్త్‌కేర్ అసోసియేటెడ్ అంటారు. న్యుమోనియా వ్యాధిలోని రకాలన్నీ ప్రమాదకరమైనవే. వీటిలో డ్రగ్ రెసిస్టెన్స్ కూడా ఎక్కువగా ఉండవచ్చు. అలాంటి పరిస్థితుల్లో తగు పరీక్షలు చేసి మందులు వాడితే మంచిది.

ఎవరికి సోకుతుంది?

న్యుమోనియా ఊపిరితిత్తులకు సోకే ఇన్ఫెక్షన్. ఏ వయసులో వారికైనా ఈ వ్యాధి సోకుతుంది. ఇన్ఫెక్షన్‌కు గురైన ఐదేళ్ల లోపు చిన్న పిల్లల నుంచి 60 ఏళ్లు పైబడ్డ వారిలోనూ ఈ వ్యాధి వస్తుంది. గుండె సమస్యలు, మధుమేహం, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారికి ఎక్కువగా న్యుమోనియా వస్తుంది.

ఎప్పుడు వస్తుంది?

చలికాలంలో న్యుమోనియా ఎక్కువగా వస్తుంది. అల్వియోలైలో కలిగే శ్వాస అంతరాయ సమస్యలు చలికాలంలోనే ఎక్కువగా ఉంటున్నాయనీ.. ఈ కాలంలో జాగ్రత్తగా ఉండాలనీ.. ఏ చిన్న శ్వాస సంబంధిత సమస్య వచ్చినా డాక్టర్‌ను సంప్రదించాలని నిపుణులు చెప్తున్నారు. చలికాలంలోని శీతలాన్ని తప్పించుకునేందుకు చాలా మంది పొగ ఎక్కువగా తాగుతుంటారు. ఇలాంటి వారిలో న్యుమోనియా ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది.

లక్షణాలేంటి?

దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు, తీవ్ర చలిగా ఉండటం, ఒక్కోసారి ఆకలి లేకపోవడం, దగ్గితే కఫం రావడం. లేదా అసలే రాకపోవడం. ఒకవేళ కఫం వస్తే తెల్లగా ఉండటం.. లేదా పూర్తి పసుపు రంగులో ఉండటం.. రక్తపు చారికతో ఉండటం వంటి లక్షణాలు ఉంటే న్యుమోనియాగా భావించవచ్చు. కొన్నిసార్లు వ్యాధి ఊపిరితిత్తి పొరకు చేరినప్పుడు ఛాతి నొప్పి కూడా వస్తుంది. మరీ తీవ్రంగా ఉంటే ఆయాసం కూడా వస్తుంది. ఒక్కోసారి శ్వాస ప్రక్రియ విఫలం అయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అస్తమా లాంటిదా?

న్యుమోనియా వ్యాధి లక్షణాలు అస్తమా లక్షణాలను పోలి ఉంటాయి. చాలామంది న్యుమోనియా వ్యాధి గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల అస్తమా అని భ్రమపడి దానికి సంబంధించిన ఇంటి వైద్య చిట్కాలను పాటిస్తుంటారు. కానీ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. అస్తమాలో పిల్లి కూతలు ఉంటాయి. న్యుమోనియాలో ఉండవు. గాలి పీలుస్తున్నా లోపలికి వెళ్లదు. దీనివల్ల శరీరానికి కావాల్సిన ఆక్సీజన్ అందదు. ఊపిరితిత్తులు సక్రమంగా పనిచేయవు.



చికిత్స ఏంటి?

న్యుమోనియాకు తగిన యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేయాలి. దీని మోతాదును నిర్ణయించి డాక్టర్ల పర్యవేక్షణలో ఇవ్వాలి. మూడు రోజులు జ్వరం, ఛాతీనొప్పి, ఊపిరి తీసుకోకపోవడం లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకోవాలి.

వ్యాధి నిర్ధారణ

న్యుమోనియా లక్షణాలను బట్టి సీబీపీ, సీఎక్స్‌రే పరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారిస్తారు. శ్వాస సంబంధిత సమస్యల కోసం ఛాతీ సీటీ స్కానింగ్, కళ్లె పరీక్షలు నిర్వహించి న్యుమోనియా ఉందో లేదో నిర్ధారిస్తారు. కొన్ని సందర్భాల్లో యూరిన్ యాంటిజెన్ పరీక్ష, రక్త పరీక్షలు, రక్తంలోని ఆక్సిజన్ శాతం పరీక్ష వంటి వాటి ద్వారా నిమోనియా వ్యాధిని నిర్ధారిస్తారు.

నిర్లక్ష్యం చేస్తే?

న్యుమోనియాను యాంటీ బయాటిక్స్‌తో తేలిగ్గా తగ్గించవచ్చు. దీనిని నిర్లక్ష్యం చేస్తే చాలా దుష్ప్రభావాలు ఉంటాయి. ముఖ్యంగా సీఓపీడీ, కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు ఉన్నవారిలో దీని దుష్ప్రభావాలు ఎక్కువగా ఉంటాయి.

... దాయి శ్రీశైలం



ప్రమాదకరం

న్యుమోనియా సాధారణంగా బాక్టీరియా, వైరస్ లేదా రెండుకాని ఎటిపికల్ ఆర్గానిజమ్స్ వల్ల వస్తుంది. ఇది ఒకరి నుంచి ఇంకొకరికి కూడా రావచ్చు. రాకుండా ఉండాలంటే వ్యక్తి శారీరక, పరిసరాల పరిశుభ్రత చాలా అవసరం. న్యుమోనియా వల్ల కొందరిలో ఊపిరితిత్తుల చుట్టూ నీరు లేదా చీము చేరుతుంది. నీరు ఎక్కువగా ఉండి ఆయాసం బాగా ఉన్నా, చీము అని నిర్ధారణ అయినా, పరీక్షలను బట్టి నీరు తీసేయాలి అని నిర్ధారించినా ఛాతీలోకి గొట్టంవేసి తీసేయాల్సి ఉంటుంది. కిడ్నీలు దెబ్బతింటే కూడా దానిని సీరియస్ న్యుమోనియా అంటారు. ఇలాంటి వారిని ఐసీయూలో చేర్చి ట్రీట్‌మెంట్ చేయాలి. కొందరిలో ఊపిరి తీసుకునే కండరాలు ఫెయిల్ కావడంగానీ ఏఆర్‌డీఎస్ అనే ప్రమాదకర స్థితికి చేరుకోవడంగానీ జరుగుతాయి. అలాంటివారిని వెంటిలేటర్‌పై ఉంచి కోలుకునే దాకా కృత్రిమ శ్వాస అందించాల్సి ఉంటుంది. న్యుమోనియా నిర్ధారణ అయినప్పుడు ఎంత తొందరగా యాంటీబయోటిక్ మందులు వాడటం ప్రారంభిస్తే అంత మంచిది. మందులు కూడా అన్ని రకాల క్రిములను చంపే విధంగా సెలక్ట్ చేసుకోవాలి. చుట్టు పక్కల ప్రాంతాల్లో క్రిములకు డ్రగ్ రెసిస్టెన్స్ ఎంత ఉంది అనే విషయం కూడా పరిగణలోకి తీసుకోవాలి. లేదంటే మందులు వాడుతున్నా జబ్బు ముదిరి సీరియస్ అయ్యే ప్రమాదం ఉంటుంది. ఒకసారి సీరియస్ అయ్యిందంటే ఖర్చు పెరుగుతుంది. దాంతోపాటు ప్రాణహాని కూడా పెరుగుతుంది. అంతేకాకుండా పేషెంట్‌కు ఐవీ ఫ్లూయిడ్స్, ఆక్సీజన్ ఇవ్వాల్సి ఉంటుంది. వీటన్నింటికీ గైడ్‌లైన్స్ ఉన్నాయి కాబట్టి ఎంత తొందరగా పల్మనాలజిస్ట్‌ను సంప్రదిస్తే అంత మంచిది.

–డాక్టర్ ఎస్ఏ రఫీ, కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్

సూచన

ఐవీఎఫ్ థెరపీతో.. మాతృత్వ భాగ్యం!

ప్రస్తుత జీవనశైలి సంతానోత్పత్తికి ఆటంకాలు కలుగజేస్తున్నది. వ్యయ, ప్రయాసలకు ఓర్చినా పిల్లలు కావాలనే ఆశ.. ఆశగానే మిగులుతుందని చాలామంది ఆందోళన చెందుతున్నారు. అలాంటివారికి వరం లాంటిది ఐవీఎఫ్ థెరఫీ. దీని ద్వారా రెండు సెషన్లుగా సుమారు నెల రోజుల పాటు చికిత్స చేసి గర్భాశయ గోడల మందాన్ని పెంచుతారట.



మాతృత్వ భాగ్యం పొందడానికి ఐవీఎఫ్ థెరపీ దోహదపడుతుందని చెప్తున్నారు నిపుణులు. ఈ థెరఫీని ప్లేట్‌లెట్స్ రిచ్ ప్లాస్మా థెరఫీ అంటారు. దీని ఆధారంగానే గర్భాశయ గోడల మందం తక్కువగా ఉన్నవారిలోనూ సంతానం సాఫల్యం చేస్తున్నారు వైద్యులు. తాజాగా బెంగళూరుకు చెందిన ఓ అథ్లెట్ గర్భాశయం 6మిల్లీ మీటర్స్ మాత్రమే ఉన్నప్పటికీ ఆమె గర్భం ధరించేట్లు విజయవంతమైన ప్రయోగం చేశారు. సాధారణంగా గర్భాశయ గోడల మందం 7-12 మిల్లీ మీటర్లు ఉండాలి. మహిళ అండోత్సర్గం జరగాలన్నా, గర్భధారణ సాధ్యం కావాలన్నా మహిళ శరీరం కనీసం 22% కొవ్వుతో ఉండాలి. కానీ ఆమెలో దానికి సగానికి తగ్గి కొవ్వు శాతం ఉండటంతో ఇక గర్భధారణ అసాధ్యమే అనుకున్నారు. కానీ బెంగళూరు వైద్యులు దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఐవీఎఫ్ థెరపీ ద్వారా ఆమెకు పిల్లలు పుట్టే భాగ్యం కలిగించారు. వైద్యరంగంలో వచ్చిన అడ్వాన్స్‌మెంట్ వల్ల తనలాంటి వారికి పిల్లలు కలిగే భాగ్యం ఏర్పడుతుందని.. సదరు క్రీడాకారిణి ఆనందం వ్యక్తం చేసింది.

ప్రయోజనం



అన్నీ ఉసిరిలోనే

అన్ని కాలాల్లో కొనదగింది.. తినదగింది ఉసిరి అంటున్నారు సౌందర్య నిపుణులు. రోజూ ఉసిరి సమ్మిళిత ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు అందం కూడా సొంతం చేసుకోవచ్చని సూచిస్తున్నారు. బ్యూటీ ఐకాన్‌గా పేరుగాంచిన షెహనాజ్ హుస్సేన్ ఈ ఉసిరి పాఠాలు చెప్తున్నారు.

పాలీఫెనోల్స్, ఐరన్, న్యూట్రిషియన్స్, మినరల్స్ శరీరానికి అవసరం. ఇవి తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారు. అయితే ఇవన్నీ వేర్వేరుగా తీసుకోవాలంటే వ్యయ, ప్రయాసలు తప్పవు. అప్పుడు ప్రత్యామ్నాయ ఆహార పదార్థాల గురించి వెతుకుతుంటాం. అలా కాకుండా అన్నీ ఒకేసారి పొందాలంటే ఉసిరిని ఆశ్రయించాలని సూచిస్తున్నారు షెహనాజ్. ఒక్క విటమిన్ల విషయాన్నే తీసుకుంటే 100 గ్రాముల ఉసిరిలో 1700 ఎంజీ విటమిన్ విలువలు ఉంటాయట. ఇలా ఆరోగ్యానికి అవసరమైన ప్రతీ పదార్థం ఉసిరిలో ఉంటుంది. ఉసిరితో పచ్చళ్లు పెట్టుకోవచ్చు. నూనె తీసుకోవచ్చు. ఫేస్‌ప్యాక్ చేసుకోవచ్చు. జ్యూస్‌గా తీసుకోవచ్చు. కాఫీగా చేసుకోవచ్చు. ఉసిరి పండ్లు తినవచ్చు. షాంపూగా వాడుకోవచ్చు. హెయిర్ ప్యాక్‌గా మలచుకోవచ్చు. కాబట్టి ఉసిరి మనకు ఆరోగ్యాన్ని ప్రసాదించే సిరిగా భావించి రోజూ తినండి అని షెహనాజ్ వంటి నిపుణుల సలహా.

సుడోకు

డైలీ సుడోకు 23 సమాధానం

4	5	2	7	8	3	9	1	6
8	1	6	9	4	5	2	3	7
7	3	9	2	1	6	4	5	8
9	4	7	8	5	1	3	6	2
1	2	8	3	6	9	5	7	4
3	6	5	4	2	7	8	9	1
6	8	1	5	3	4	7	2	9
2	9	3	1	7	8	6	4	5
5	7	4	6	9	2	1	8	3

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 24

		3					7	
	9					1		
		5						
				6	5	9		3
		7		9			6	8
				4		2	1	
4			2	7				
6		9			8			2
		2	3	1				9

సాధారణ సమస్యలు కావు.. క్యాన్సర్ కారకాలు!



సలహా

కొందరికి బాగా తలనొప్పి వస్తుంది. పని ఒత్తిడిలే అనుకుంటారు. ఆయాసం వస్తే.. తిన్నది జీర్ణంగాక కావచ్చు అనుకుంటారు. విపరీతమైన గొంతునొప్పి వస్తే.. వాతావరణంలో మార్పులనుకుంటారు. కానీ.. వీటిలో ఏది తీవ్రంగా ఉన్నా అది క్యాన్సర్‌కు దారితీస్తుందనే విషయం తెలుసుకోరు!

జ్వరంగా ఉందనుకోండి.. ఏం చేస్తాం? డాక్టర్ దగ్గరకు గానీ.. మెడికల్ షాప్‌కు గానీ వెళ్లడానికి కుదరదు. కారణం బిజీలైఫ్. ఏవైనా గడ్డలైతే ఏం చేస్తాం? వేడి చేయడం వల్ల అలా అయుండొచ్చు.. గతంలో తగిలిన దెబ్బల చిహ్నాలై ఉండొచ్చు అనుకుంటాం. కానీ ఇవేంటి అని జాగ్రత్త పడని వాళ్లు చాలామంది ఉన్నారు. ఇలాంటి వాళ్లకు క్యాన్సర్ గురించి తెలియదు. పైగా వీటన్నింటినీ లైట్ తీసుకుంటారు.

ఎందుకు?: నిరక్షరాస్యత.. గ్రామీణ నేపథ్యం.. ఆర్థిక పరిస్థితులు.. అమాయకత్వం వంటివి ఇలాంటి ఆరోగ్య సమస్యలకు ఒక కారణం అయితే బిజీలైఫ్ మరో కారణం. ఫోన్లోనో లేక ఇంటర్నెట్‌లోనో వైద్య సలహాలు పొందుతారు. వీటివల్ల తాత్కాలిక ఉపశమనం వస్తుండొచ్చు కానీ దీర్ఘకాలికంగా అలాగే ఉంటే మాత్రం క్యాన్సర్ ముప్పు పొంచి ఉన్నట్లే.

అవగాహన అవసరం: క్యాన్సర్‌ను గుర్తించాలంటే ముందు ఆ వ్యాధిపట్ల అవగాహన కావాలి. ముందు దశలోనే దానిని గుర్తిస్తే ఆధునిక వైద్య చికిత్సలను అనుసరించి నయం చేసుకోవచ్చు. అందుకోసం అత్యాధునిక విధానంలో చికిత్స అందించేందుకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్ పని పడితే ఆరోగ్యంగా ఉండొచ్చు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించాలంటే కొన్ని సర్వ సాధారణ లక్షణాలను గుర్తించాల్సి ఉంటుంది. ముఖ్యంగా తలనొప్పి, గొంతునొప్పి, ఆయాసం, దగ్గు, కడుపు ఉబ్బరం, మూత్ర వ్యవస్థలో తేడాలు, మలవిసర్జన సమస్యలు గుర్తించి డాక్టర్‌ను సంప్రదిస్తే క్యాన్సర్‌ను అరికట్టవచ్చు.

తలనొప్పి: మామూలుగా అందరికీ వస్తుంది. చికాకు, పనుల ఒత్తిడి, ఎండ, కొన్ని రకాల వాసనలు, ఆకలి వంటి కారణాలతో మైగ్రెయిన్ లేక అప్పుడప్పుడు తలనొప్పి రావటం సహజమే. తలనొప్పి లక్షణాలు కన్పించగానే సొంత వైద్యం చేసుకునేందుకు ఎడాపెడా ఇష్టమొచ్చిన మందులు వాడితే లివర్, కిడ్నీలపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. కాబట్టి ముందుగా చేయాల్సింది తలనొప్పికి కారణం తెలుసుకోవాలి. నిర్దిష్టకాలం పాటు సరైన మందులు వాడాలి. ఇలా చేస్తేనే సమస్యను అధిగమించవచ్చు.

గొంతునొప్పి: చల్లటి పదార్థాలు తీసుకోవడం వల్ల.. వాతావరణంలో మార్పుల వల్ల.. ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు.. గొంతు సమస్యలు వస్తుంటాయి. ఈ సమస్యలు రెండు మూడు రోజుల్లో తగ్గకపోతే డాక్టర్ సలహ ప్రకారం కోర్సుగా మందులు వాడాల్సి ఉంటుంది. థైరాయిడ్ క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ లక్షణాలు తొలిదశలో ఇలాగే ఉంటాయి.

దగ్గు, ఆయాసం: సిగరెట్లు తాగేవారు తమకు ఇలాంటివి అలవాటే అనుకుంటారు కానీ వీరికి లంగ్ క్యాన్సర్‌తో పాటు అనేక రకాల ఇతర క్యాన్సర్స్ వచ్చే ముప్పు ఎక్కువ. గొంతులో నస, ఆగని దగ్గు, కళ్లెలో రక్తం, ఆయాసం టీబీ వంటివి లంగ్ క్యాన్సర్ లక్షణాలు.




కడుపు ఉబ్బరం, మంట: ఆహార వేళల్లో టైమ్ సెన్స్ లేకపోవడం, నోరూరించే అనారోగ్య ఆహారపదార్థాలు తినడం, నిద్రలేమి, ఒత్తిడి వంటి కారణాల వల కడుపులో మంట, త్రేన్పులు, ఉబ్బరం, ఆకలి తగ్గటం, వికారం వంటి లక్షణాలు కనిస్తుంటాయి. ఇవి పిల్లలు, పెద్దలు అందరిలో ఉంటాయి. సరైన జీవనశైలి అలవర్చుకుంటే ఇలాంటి సమస్యలు రావు. నీరు ఎక్కువగా తాగాలి. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఇవి జీర్ణ వ్యవస్థను మెరుగు పరుస్తాయి. ఎండోస్కోపి, స్కానింగ్ లాంటి పరీక్షలతో జీర్ణాశయంకు సంబంధించిన క్యాన్సర్స్, లివర్, ప్యాంక్రియాజ్, గాల్ బ్లాడర్ క్యాన్సర్స్‌ను తొలిదశలోనే కనుక్కోవచ్చు.

మూత్ర వ్యవస్థలో తేడాలు: మూత్రంలో రక్తం పడటం, మూత్రం ఆగి రావడం, మంటగా ఉండటం మొదలైనవి చూస్తూ వేడిచేసిందనుకుంటారు. సాధారణంగా నీళ్లు తక్కువగా తాగటం, ఇన్ ఫెక్షన్స్, కిడ్నీస్టోన్స్ వంటి కారణాల వల్ల ఈ లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాలు తీవ్రంగా ఉండి చికిత్సలకు లొంగకపోతే యూరినరి బ్లాడర్‌కు సంబంధించిన క్యాన్సర్స్ కావచ్చు అని గమనించుకోవాలి. 50 ఏళ్ల పైబడిన పురుషులలో ప్రొస్టేట్ గ్రంధి సమస్యలు, క్యాన్సర్ లక్షణాలు ఈ విధంగానే ఉండవచ్చు. నెలసరి మధ్య రక్తస్రావం, పొట్ట భారంగా ఉండటం, ఆకలి మందగించటం స్త్రీలు నెలసరి ముందు ఉంటే సమస్యలుగా (PMS) పొరబడచ్చుకాని కొన్ని సందర్భాలలో ఒవేరియన్, యుటిరైన్ క్యాన్సర్స్ కావచ్చు.

మలవిసర్జనలో తేడాలు : అజీర్తి, విరోచనాలు, మలంలో రక్తం వంటి సింప్టమ్స్ ఆహారపు అలవాట్లు మారినప్పుడు పైల్స్, ఫిషర్స్, ఫిస్టులా వంటి సమస్యలున్నప్పుడు కన్పించవచ్చు. కాని ఎప్పుడూ మలవిసర్జన సమయంలో పడే రక్తాన్ని పైల్స్ అనుకున్నట్లయితే పొరబడుతున్నాట్లే. దక్షిణ భారతదేశంలో పురుషులలో ఎక్కువగా కన్పించే కోలన్ క్యాన్సర్ లక్షణాలు కూడా కావచ్చు.

పరీక్షలు: మామూలు గడ్డలే అని, పాలగడ్డలు అని రొమ్ములో దీర్ఘకాలంపాటు కన్పించే కణితులను అశ్రద్ధ చేస్తే కణితి ఇతర భాగాలకు పాకి ప్రమాదం పొంచిఉన్నట్లే, అలసట, రక్తహీనతతో పాటు, చర్మం మీద ఊదారంగు మచ్చలు, తేలికగా కమిలిపోవటం, బ్లడ్ క్యాన్సర్‌గా హెచ్చరించవచ్చు. గోళ్లలో మార్పులు, ముందుకు వంగినట్లు ఉండటం లివర్, లంగ్ క్యాన్సర్స్ కు సూచనలు కావచ్చు. సిగ్మాయిడోస్కోపి, కొలనోస్కోపి వంటి పరీక్షలతో సమస్య ఏమిటో తేలిపోతుంది. ఇలాంటి లక్షణాలు కన్పించే సరికే క్యాన్సర్ ఇతర భాగాలకూ వ్యాపించి చికిత్సకు లొంగకుండా తయారవుతుంది. చాలావరకు క్యాన్సర్ ముదిరిన దశలోనే ట్రీట్‌మెంట్ చేయించుకుంటారు. ఇలా చేయొద్దు. అంతకుముందే మీకు అనుమానం ఉంటే రెగ్యులర్ హెల్త్ చెకప్స్, స్క్రీనింగ్ టెస్టు, గైనిక్ చెకప్ చేయించుకోవాలి.



డా. సీహెచ్ మోహన వంశీ
చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్, ఒమేగా హాస్పిటల్స్
హైదరాబాద్: 9848011421
కర్నూల్: 08518 273001
గుంటూర్: 08632 223300

ఎలాగంటే?



సామాన్యులకు అర్థం కాని విషయమేమిటంటే, ఇటు వర్షం ద్వారా, అటు నదులద్వారా వచ్చే నీరే సముద్రాలలో కలుస్తున్నప్పుడు ఆ జలాలు ఉప్పుగా ఎందుకు ఉంటాయని! సముద్రాలలో లవణ గుణం ఎలా ఏర్పడిందో తెలుసుకోవాలంటే, భూమి ఎప్పుడు పుట్టింది, భూమిపై సముద్రాలు ఎప్పుడు ఏర్పడ్డాయో తెలుసుకోవాలి. భూమి మీదున్న ఖనిజ లవణాలు నదీజలాల ద్వారా సముద్రాలలోకి చేరుతాయి. సముద్రం నుంచి శుద్ధజలం మాత్రమే ఆవిరి రూపంలో వాతావరణంలో కలుస్తుంది. మరి, అందులో అప్పటికే చేరిన ఖనిజ లవణ లక్షణాలు ఎక్కడికి పోవాలి? అదీ ఏ కొద్ది కాలమో కాదు, కొన్ని లక్షల ఏండ్లుగా అందులో జమవుతున్నపుడు ఆ లక్షణాన్ని సముద్రాలు ఎలా వదిలేసుకోగలవు! ఒక అంచనా మేరకు సుమారు 1000 గ్రాముల సముద్రజలాల్లో 35 గ్రాముల లవణాలుంటాయి. అంటే, ఈ లెక్కన సగటున 3.5 శాతం లవణగుణం ఉన్నట్టు. ఒక్కోచోట ఒక్కో శాతం మేర లవణ గుణం ఉంటుంది. ఇక, ప్రపంచంలోనే అత్యధిక లవణగుణంతో కూడిన జలాలున్న మృత సముద్రంలో అయితే మరీ ఎక్కువ.

ఎవరేమన్నారు?



వైద్యం ఒక అనిశ్చిత విజ్ఞానశాస్త్రం. కాకపోతే, అదొక సంభవాత్మక కళ.
- విలియమ్ ఆస్లర్

సుచరిత

మానవ జలరవాణకు సముద్రమంత (అంతులేని) లోతైన చరిత్రే ఉంది. పడవలు, ఓడలు తయారు చేయడానికి ముందు అత్యంత ప్రాచీన కాలంలో మనుషులు తెప్పలు/ బల్లకట్లు వంటి వాటిపై నీటి మార్గాలలో ప్రయాణించే వారు. అంతకంటే ముందు జంతువుల చర్మాన్ని తెప్పల్లా వాడినట్లు కూడా తెలుస్తున్నది. పెద్ద తటాకాలు, కాల్వలు, నదులు, సముద్రాలలో చేపలు పట్టి వాటిని అమ్మి జీవనం సాగించే మత్స్యకారులకు జలప్రయాణం తప్పనిసరి. ఈ లెక్కన పడవలు (Vessels) వంటివి కనీసం 10,000 సంవత్సరాల కిందే ఆవిర్భవించి ఉంటాయని చరిత్రకారుల అంచనా. ఇవాళ్టికి భారీ స్థాయిలో వేల టన్నుల బరువును మోస్తూ అఖాతాలలో సాగరవీరుల్లా కదిలిపోతున్న ఓడలను మనం చూస్తున్నాం. సెయిల్ బోట్స్‌తో వారు ఎర్ర సముద్రంలో ప్రయాణించినట్లు తెలుస్తున్నది. అప్పట్లోనే 143 అడుగుల పొడవు పడవలు నిర్మితమైనట్టు చెబుతున్నారు. 20వ శతాబ్దపు తొలి దశాబ్దం (1911) లోనే మహా విషాదాన్ని మిగిల్చిన 'ఆర్ఎంఎస్ టైటానిక్' వంటి భారీ, విలాసవంతమైన ఓడలు రంగ ప్రవేశం చేశాయి. 2005లో జర్మనీకి చెందిన కొలంబో ఎక్స్‌ప్రెస్ ప్రపంచంలోనే అతిపెద్ద కంటెయినర్ ఓడలలో ఒకటి. క్రీ.పూ.3000 కాలంలో ప్రాచీన ఈజిప్షియన్లు 'ప్లాంక్' (పొడవాటి కలప తెప్పలు)లను వాడారు.



అద్భుత రోబో బొద్దింక

ఆధునిక సాంకేతికత



సూక్ష్మ రోబోలలో సంచలన ప్రక్రియగా ఉభయచర స్వయంచలిత (రోబో) బొద్దింకను అమెరికాలోని పరిశోధకులు సృష్టించారు. ఇది నేలపైన నడుస్తున్నంత తేలిగ్గా నీటి ఉపరితలంపైనా కదిలి పోగల అద్భు త సాంకేతికతను పుణికి పుచ్చుకోవడం విశేషం.

నేలపైన సాధారణంగా నడవడమేకాక, నీటి ఉపరితలంపై ఈదుతూ కూడా వెళ్లగల ఒక ఉభయచర రోబోటిక్ బొద్దింకను శాస్త్రవేత్తలు నిర్మించారు. ఇది నీటి లోపలి నేలలనూ కనుగొనగలుగుతుంది. 'ఆంబులేటరీ మైక్రోరోబో' (Ambulatory Microrobot- HAMR) గా పిలిచే ఈ సూపర్ రోబో బొద్దింక పనితనం అసాధారణం. దీని కాలి కుదుర్లు బహుళ క్రియాత్మకమైనవి. నీటిలో మునిగిపోకుండా దీని కాళ్ల పదార్థానికి, నీటి ఉపరితలానికి మధ్య విద్యుత్తును సృష్టించుకుంటూ స్పర్శకోణాన్ని తగ్గించుకొనే సాంకేతికతతో ఇది పనిచేస్తుంది. ఈ విధానాన్ని 'ఎలక్ట్రోవెట్టింగ్' (electrowetting) గా పిలుస్తున్నారు. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు దీనిని ఆవిష్కరించారు.



ఈ 'రోబోటిక్ సూపర్ కాక్రోచ్' (హెచ్ఎఎంఆర్) బరువు 1.65 గ్రాములు కాగా, నీటిపైన మునిగిపోకుండా అది మోసే బరువు ఏకంగా 1.44 గ్రాములు. నీటి లోపలకు వెళ్లిన తర్వాత జలగర్భ నేలపైన కూడా సాధారణ పొడినేలపైన నడిచిన రీతి భంగిమనే అనుసరించగలదని కూడా పై పరిశోధకులు అంటున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నీటి ఉపరితలంపై ఈ రోబో బొద్దింక బరువు కంటే రెండు రెట్ల అధిక ఒత్తిడి పనిచేస్తుంది. అయినా, దీని సాంకేతికత వోల్టేజీ (విద్యుచ్ఛక్తి) సహాయంతో నీటిలో మునిగిపోకుండా నడకను సాఫీగా సాగేలా చేస్తుందని వారు చెబుతున్నారు.

చెదజీవుల్లోనూ అలైంగిక పునరుత్పాదన

పురుషజాతితో సంబంధం లేకుండానే స్త్రీ జాతి చెదజీవులు తమంతట తాముగా పునరుత్పాదన జరుపుకోవడాన్ని పరిశోధకులు తొలిసారిగా గుర్తించారు.

సజీవ శాస్త్రం



సంక్లిష్ట జంతు సమాజానికి చెందిన చెదజీవుల్లో మొట్టమొదటిసారిగా అలైంగిక రీతిలో పునరుత్పాదన జరుగుతుండడాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. 'బీఎంసి బయాలజీ' పత్రికలో ప్రచురితమైన ఒక పరిశోధనా వ్యాసం ఈ విషయాన్ని ఇటీవల వెల్లడించింది. 'గ్లిప్టోటెర్మెస్ నకజిమాయ్' (Glyptotermes nakajimai) జాతులకు చెందిన చెదజీవుల్లో ఇది సాధ్యమవుతున్నట్టు పై పరిశోధన పేర్కొంది. ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ, జపాన్‌లోని క్యోటో విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులతో కూడిన సంయుక్త బృందం ఈ అధ్యయనాన్ని జరిపింది. గతంలో చీమలు, తేనెటీగలలోనే పూర్తిగా పురుష జాతి అంతరించడం చూశాం. కానీ, ఇప్పుడు పై జాతికి చెందిన చెదజీవుల్లోనూ ఇదే జరిగింది. పురుషజాతి తోటిజీవులతోనే గతంలో వీటిలో పునరుత్పాదన జరిగేదని, కాగా, ఇటీవల దీనికి విరుద్ధంగా అలైంగిక పునరుత్పాదన కూడా జరుగుతుండడాన్ని తాము గుర్తించామని వారు తెలిపారు.

మహా సిద్ధాంత శోధన

సృష్టి రహస్యాలు

విశ్వశక్తి, పదార్థాలకు చెందిన అన్ని సూత్రాలూ అమరిపోగల మహా ప్రాకృతిక సిద్ధాంతాన్ని అన్వేషించే దిశగా శాస్త్రవేత్తలు ఇప్పుడు తమ దృష్టిని మళ్లించారు. దీన్ని కనుక వారు ఆవిష్కరించగలిగితే వైజ్ఞానిక శాస్త్రరంగంలోనే మనిషి అత్యంత బృహత్ లక్ష్యాన్ని సాధించిన వాడవుతాడు.



భూమిపై ఆవిర్భవించిన విశ్వపదార్థాలలో మనిషి ఒకడు. ఇంకా అనేక రకాల పదార్థ స్వరూపాలు ఇక్కడ నెలకొని ఉన్నాయి. కొండలు, కోనలు, సముద్రాలు, అగ్నిపర్వతాలు, పశుపక్ష్యాదులు, జంతువులు మొత్తంగా మన కంటికి కనబడే సమస్త ప్రాకృతిక జీవ నిర్జీవ వ్యవస్థలన్నీ ఈ విశ్వపదార్థంలో భాగమే. అందుకే, విశ్వంతోపాటు పుట్టిన ప్రాథమిక ప్రాకృతిక శక్తులన్నీ మనిషితోపాటు వీటన్నింటిపైనా తమ ప్రభావాన్ని చూపుతున్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. గత కొన్ని వందల ఏళ్ల కృషి అనంతరం సృష్టితోపాటు ఆవిర్భవించినట్టుగా భావిస్తున్న నాలుగు ప్రధాన ప్రాథమిక (మౌలిక) శక్తులను వారు గుర్తించారు. వాటిని 'దుర్బల అణు ప్రతిస్పందన', 'దృఢతర అణు ప్రతిస్పందన', 'విద్యుదయస్కాంతత్వం', 'గురుత్వాకర్షణ'గా చెబుతున్నారు. మొత్తం విశ్వంలోని అంతర చర్యలన్నింటికీ ఇవే ప్రధాన ఆధారాలుగా ఉంటున్నట్టు వారు గత కొన్నాళ్లుగా నమ్ముతున్నారు.

ఇవే కాకుండా విశ్వంలో అనంత స్థాయిలో విస్తరించి వున్న అదృశ్యశక్తి (Dark Energy) ని కొందరు శాస్త్రజ్ఞులు 'అయిదో ప్రాథమిక శక్తి'గా భావిస్తున్నారు. దీని మిస్టరీ అయితే ఇప్పటికింకా తేలలేదు. అయితే, గురుత్వాకర్షణకు దీనికి ఎంతో తేడా ఉందని శాస్త్రజ్ఞులు అంటున్నారు. గురుత్వాకర్షణ శక్తి మాదిరిగా ఇది (అదృశ్యశక్తి) ద్రవ్యరాశిపై కాకుండా కేవలం ద్రవ్యంపైనే తన ప్రభావం చూపుతున్నట్టుగా వారు అనుమానిస్తున్నారు. దీని ఉనికి, రహస్యాలు అన్నీ జెనీవా సమీపంలో, స్విట్జర్లాండ్- ఫ్రాన్స్ సరిహద్దుల్లో నిర్మితమైన 'కణత్వరణ (particle accelerator) భారీయంత్రం' ఎల్‌హెచ్‌సి (లార్జ్ హేడ్రన్ కొలైడర్)లో జరుగుతున్న పలు ప్రయోగాలలో తెలియవచ్చునని వారు భావిస్తున్నారు. రాబోయే కాలంలో అయిదో అదృశ్య శక్తి స్థితిగతులు తేలగలవని వారు నమ్ముతున్నారు. విశ్వంలో పదార్థ సృష్టి జరిగిన తీరుతెన్నులు, దాని తదనంతర పర్యవసానాలు అన్నీ మొత్తంగా అక్కడి పరిశోధనలలో వెల్లడి కావచ్చునని కూడా అంటున్నారు.

సుమారు 15 బిలియన్ (1500 కోట్లు) సంవత్సరాల కిందటి సృష్టి ఆవిర్భావం, ఆ సందర్భంగా ఉద్భవించిన పదార్థం పరివ్యాప్తమైన విధానాన్ని పరిశీలిస్తే ప్రాథమిక శక్తుల తీరుతెన్నులు అర్థమవుతాయి. మౌలిక స్థాయిలో అత్యధిక సాంద్రతతో కూడిన అయస్కాంత క్షేత్రం తొలుత విద్యుత్ క్షేత్రంగా విక్షేపణం (చెల్లాచెదురు) చెందింది. తర్వాత విద్యుత్ క్షేత్రం నుంచి విద్యుదయస్కాంత క్షేత్రం, ఈ విద్యుదయస్కాంత క్షేత్రం నుంచి వాయువు, ద్రవరూపాలలోకి పదార్థం విస్తరించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ విశ్వ పదార్థ విస్తృతి (పరిణామం) ఇంతటితో ఆగలేదు. అదే క్రమానుశ్రేణిలో వాయు, ద్రవరూప పదార్థం కాస్తా ఘనరూపంలోకీ పరివర్తన చెందినట్లు వారంటున్నారు.

ఈ సృష్టి పరంపరంలోకి వర్తింపని విషయం ఒకటుందని కూడా శాస్త్రవేత్తలు అంటున్నారు. అదేమిటంటే, 'విధ్వంసక విశ్వగురుత్వాకర్షణ క్షేత్రం'. ఇది మిగిలిన అన్ని ప్రాథమిక శక్తులకన్నా పూర్తిగా స్వతంత్ర పోకడతో కూడుకున్నది. పైన పేర్కొన్న నాలుగు శక్తులు, అయిదో శక్తి సహా అన్నీ పదార్థంతోపాటు విశ్వంలో పరివ్యాప్తం కాగా, విధ్వంసక గురుత్వాకర్షణ క్షేత్రం పరిస్థితి మాత్రం వేరే రకంగా ఉన్నట్టు శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఇక, గురుత్వాకర్షణ క్షేత్రం మాత్రం విద్యుత్, అయస్కాంత క్షేత్రాల కంటే భిన్నమైందని వారు అంటున్నారు. ఇది ఆకర్షణ గుణంతో కూడిన శక్తి కేంద్రం. అలాగే, విద్యుదావేశిత శక్తి కూడా విశ్వంలోని వివిధ వ్యవస్థల్లోని కనిపించని పదార్థం, పరమాణువుల స్థాయిలో, సృష్టి ఆరంభం నుండీ కొనసాగుతున్నట్టు చెబుతున్నారు. వ్యవస్థల రూపకల్పనకు దారితీసే పరమాణుస్థాయి మార్పిడులు, ఎలక్ట్రాన్ ఆవేశిత వాటాల ఆధారంగా సంభవించే ఆధునిక సైద్ధాంతిక భావనలతో సహా ఇదంతా ఒక 'పరిపూర్ణ ప్రాకృతిక ప్రాథమిక ఒప్పందం'లా ఉన్నట్టు శాస్త్రవేత్తలు అభివర్ణించారు.

దీన్నిబట్టి అర్థమవుతున్న విషయం ఏమిటంటే, సృష్టికి దారితీసిన సంఘటన పరంపరలన్నింటికీ 'సాధారణ మూలం' (మౌలిక శక్తి) ఒకటుంటుందని! ఇదే నిజమైతే అవన్నీ ఆ 'సాధారణ భౌతిక శక్తి'పైనే విధిగా ఆధారపడి ఉండాలని కూడా శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. ఇటీవలి 'ది సైంటిస్ట్.కామ్'లో ప్రచురితమైన ఒక వ్యాసం కూడా ఇదే విషయాన్ని తెలియపరిచింది. అన్ని ప్రాథమిక శక్తుల ఈ ఏకీకరణ సిద్ధాంతానికి సువిశాల దృష్టితో కూడిన పరిశోధనారీతి కావాలని, అత్యంత జిజ్ఞాస భరితమైన సూక్ష్మస్థాయి విశ్లేషణలూ ఉండాలని, అప్పుడే అది సాధ్యపడగలదని వారు సూచించారు.


ప్రఖ్యాత సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తన జీవితంలోని ఆఖరి నాలుగు దశాబ్దాల కాలాన్ని ఈ ఏకీకృత సాధారణ మహా సిద్ధాంత అన్వేషణకే వెచ్చించారన్న సంగతి కూడా మనల్ని ఆశ్చర్యపరుస్తుందని ప్రొ. ఎ.వి.మొహరిర్ పేర్కొన్నారు. విశ్వంలోని శక్తి, పదార్థాలకు చెందిన అన్ని ప్రాథమిక సమీకరణలనూ చేర్చుకోగల ఈ రకమైన మహా ప్రాకృతిక సిద్ధాంతం కోసమే ఐన్‌స్టీన్ దీర్ఘకాలిక పరిశోధన సాగినట్టు ఆయన తెలిపారు. మానవజాతి సహా ఇతర జంతు, పక్షి, వృక్ష జాలాలు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవజాతుల మనుగడతోపాటు వీటన్నింటి ఆవిర్భావానికి పదార్థ, వ్యవస్థల ప్రపంచంలోని సంఘటనల నడుమ సంభవించిన అంతర సంబంధాలలోని అసలు మూలాన్ని అర్థంచేసుకోవలసిన అవసరం ఈ నేపథ్యంలో ఎంతైనా ఉంది. ఇదే మానవజాతి ఉనికికి అంతిమలక్ష్యం కావాలని కూడా ప్రొ. మొహరిర్ తన వ్యాసంలో అభిప్రాయపడ్డారు.

జీవ చైతన్యమూ ప్రాథమిక శక్తే!



మనిషిలోని 'చేతనత్వం' (consciousness) కూడా పరిశోధకులలో ఈ సందర్భంగా చర్చకి వస్తున్నది. ఇది శాస్త్రవేత్తల అంచనాలకు అందకుండా అత్యంత సంక్లిష్టంగా, గందరగోళకరంగా ఉంటున్నది. జీవులలో స్పృహ (చైతన్యం) అన్నది ఎలా ఉద్భవిస్తుంది? దాని పుట్టుకతోసహా ప్రకృతి, గుణగణాలు, అభివ్యక్తులు, ఇవన్నీ విడివిడిగా, మళ్లీ మొత్తంగా ఆవృతమయ్యే విధానం వంటివేవీ వారికి ఇన్నాళ్లుగా ఒకింత అర్థం కాకుండానే ఉన్నాయి. పైన పేర్కొన్న నాలుగు మౌలిక శక్తుల క్రమంలోనే జీవుల్లో ఉద్భవించే ఈ 'చైతన్యాన్ని' కూడా ఒక మౌలిక (ప్రాథమిక) ప్రాకృతిక శక్తిగానే శాస్త్రలోకం పరిగణించవలసిన అవసరం ఉందని న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్, డివిజన్ ఆఫ్ ఫిజిక్స్‌కు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్, హెడ్ అయిన ఎ.వి.మొహరిర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'యూనివర్సిటీ న్యూస్' మేగజైన్ (2018 అక్టోబర్ 1-7 నాటి సంచిక)లో ఆయన ప్రచురించిన పరిశోధనాత్మక వ్యాసం ఈ కీలకాంశాన్ని ప్రస్తావించింది.

పనితనం



మనిషి అద్భుత సృష్టికి ఒక చిన్ని నిదర్శనం కంప్యూటర్ చిప్. దీని పనితనం అనూహ్యం. ప్రతీ ఒక్క కంప్యూటర్‌కూ ఇది తప్పనిసరి. సిలికాన్, లోహంతో వీటిని తయారుచేస్తారు. 'ఇంటెగ్రల్ సర్క్యూట్'గానూ దీనిని పిలుస్తారు. ఇందులోని ట్రాన్సిస్టర్స్ అన్నీ కలిపి ప్రాసెసర్‌గా రూపొంది కావలసిన పనుల్ని చేస్తాయి. ఈ ట్రాన్సిస్టర్స్ అనేక మిలియన్ల సంఖ్యలో ఉంటాయి. అంత చిన్న చిప్‌లోనే బోలెడంత సమాచారం నిక్షిప్తమవుతుంది. అంతకంతకూ చిన్నసైజులో తయారవుతున్న చిప్ భాష ఆధారంగా సమాచార చేరవేత, ఇతరత్రా పనుల్ని నిర్వర్తిస్తుంది. వీటి ప్రోగ్రామింగ్‌లనే 'అసెంబ్లీ లాంగ్వేజ్' అంటారు. అవే బేసిక్, సి, C++. చిప్ ప్రధానంగా మూడు రకాల (అంక/ తర్క ప్రమాణాలతో గణిత సమీకరణలు, ఒక చిప్‌నుంచి మరొక దానికి సమాచార బదిలీ, కావలసిన నిర్ణయాలు తీసుకోవడం, వాటికి కావలసిన సూచనలు చేయడం) పనులను నిర్వర్తిస్తుంది. చిప్‌లలోని రెండు రకాల మెమొరీలలో ఒకటి (ROM) శాశ్వత సమాచారాన్ని కలిగి వుంటే, మరొకటి (RAM) చదవడానికి, రాయడానికి అనువుగా తాత్కాలిక పద్ధతిలో కంప్యూటర్ షట్‌ఆఫ్ చేయగానే వెళ్లిపోయేదిగా ఉంటుంది.

కొత్త జాతి రాక్షసబల్లులు

పురాజీవ శాస్త్రం



సుమారు 100 మిలియన్ సంవత్సరాల కిందట భూమిపై ప్రత్యేకించి ఆస్ట్రేలియాలో పెద్ద మొత్తంలో నడయాడినట్లుగా భావిస్తున్న కొత్త రాక్షసబల్లి జాతికి చెందిన శిలాజ భాగాలను లుప్తజీవ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. వీటి నడక రెండుకాళ్లపైనే సాగినట్లు వారు చెబుతున్నారు.

'వీవర్రసారస్ పోబెనీ' (Weewarrasaurus pobeni) పేర్న పిలిచే ఒక కొత్త జాతి రాక్షసబల్లి శిలాజాలను ఆస్ట్రేలియాలోని వీ వర్రా (Wee Warra) ప్రాంతంలోని ఒక లోతైన భూగర్భ గనిలో లుప్తజీవ శాస్త్రవేత్తలు ఇటీవల కనుగొన్నారు. లభ్యమైన కింది దవడ ఎముక శిలాజ భాగాల ఆధారంగా ఈ రకం రాక్షసబల్లులు సుమారు 100 మిలియన్ సంవత్సరాల కిందటివిగా వారు గుర్తించారు. ఒక పెద్ద కుక్క అంత పరిమాణంలో ఈ జాతి డైనోసార్స్ (రాక్షసబల్లులు) ప్రధానంగా రెండు కాళ్లపైనే తిరిగినట్లు వారు భావిస్తున్నారు. తూర్పు ఆస్ట్రేలియాలోని క్రెటేసియస్ వరద మైదానాలలోనే ఇలాంటివి ఎక్కువగా నడయాడి ఉంటాయన్నది వారి అంచనా. ఆస్ట్రేలియన్ ఓపల్ సెంటర్, యూనివర్సిటీ ఆఫ్ ఇంగ్లాండ్, క్వీన్స్‌లాండ్‌లకు చెందిన పరిశోధకుల బృందం ఈ శిథిలాలను విశ్లేషించి, దీనిని నిర్ధారించింది. కాగా, పై ప్రదేశం న్యూ సౌత్‌వేల్స్‌లోని లైటింగ్ రిడ్జ్‌కు దాదాపు 25 మైళ్ల దూరంలోని గ్రావిన్/ గ్లెంగ్రీ రత్నాల గనుల క్షేత్రానికి దగ్గరగా ఉంది. 'లైటెనింగ్ రిడ్జ్' స్ఫటిక గనులలో లభ్యమైన ఇతర శిలాజాల మాదిరిగానే ఈ దవడ ఎముక శిలాజ భాగాలు కూడా సురక్షితంగానే ఉన్నట్లు వారు తెలిపారు.

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

ఈసీఐఎల్‌లో 2100 ఖాళీలు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐఎల్) వివిధ జోన్లు/హెడ్ క్వార్టర్లలో ఖాళీగా ఉన్న జూనియర్ కన్సల్టెంట్/టెక్నికల్ ఆఫీసర్ (కాంట్రాక్ట్ ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- మొత్తం ఖాళీలు: 2100
- **జోన్లు/హెడ్ క్వార్టర్ల వారీగా ఖాళీలు:**
- హైదరాబాద్-650, న్యూఢిల్లీ-550, బెంగళూరు-225, ముంబై-25, కోల్‌కతా-650
- **జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ -1470 ఖాళీలు**
- **అర్హత:** ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ లేదా ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ.19,188 (కన్సాలిడేటెడ్ పే)
- **జూనియర్ కన్సల్టెంట్ ఫీల్డ్ ఆపరేషన్ (గ్రేడ్-1)-315 ఖాళీలు**
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఎలక్ట్రానిక్ & కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో మూడేండ్ల డిప్లొమా/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ.17,654 (కన్సాలిడేటెడ్ పే)
- **జూనియర్ కన్సల్టెంట్ ఫీల్డ్ ఆపరేషన్ (గ్రేడ్-2)-315 ఖాళీలు**
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఎలక్ట్రానిక్ మెకానిక్ లేదా రేడియో అండ్ టీవీ, ఎలక్ట్రికల్, ఫిట్టర్ ట్రేడ్‌లలో ఐటీఐ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 16,042(కన్సాలిడేటెడ్ పే)
- **గమనిక:** సంబంధిత రంగం లేదా ఇండస్ట్రీ రంగంలో కనీసం ఆరు నెలలపాటు పనిచేసిన అనుభవం ఉండాలి.
- **వయస్సు:** జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌కు 1988 డిసెంబర్ 31 తర్వాత, మిగతా పోస్టులకు 1993 డిసెంబర్ 31 తర్వాత జన్మించి ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ 200/- (ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీలకు ఫీజు లేదు)
- **ఎంపిక:** అకడమిక్ మార్కుల ఆధారంగా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చిరునామా:** ECIL, Nalanda Complex, CLDC, TIFR Road, Hyderabad – 500 062.
- **చివరితేదీ:** 2019 జనవరి 5
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌లో



గాంధీనగర్‌లోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ఇన్నోవేషన్ ఫెలో తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- ఇన్నోవేషన్ ఫెలో-25 ఖాళీలు
- **అర్హత:** లైఫ్ సైన్స్, ఫార్మస్యూటికల్ సైన్స్/ఐటీ, బిజినెస్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, మెడికల్/ఆయుర్వేదిక్ సైన్స్, వెటర్నరీ, ఇండస్ట్రియల్ & ప్రొడక్ట్ డిజైన్, మెకానికల్/అగ్రికల్చర్ ఇంజినీరింగ్, గ్రాఫిక్ డిజైన్‌లో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో రెండేండ్ల అనుభవం.
- **జీతం:** నెలకు రూ.60,000/-
- అడ్మినిస్ట్రేషన్ అసోసియేట్/ మేనేజర్-5 ఖాళీలు
- **అర్హత:** కామర్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కమ్యూనికేషన్‌లో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో మూడేండ్ల అనుభవం.
- **జీతం:** అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ నెలకు రూ.50,000/-అడ్మినిస్ట్రేషన్ అసోసియేట్ నెలకు రూ. 30,000/- చెల్లిస్తారు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2019 జనవరి 14
- **వెబ్‌సైట్:** www.nifindia.org

జిప్‌మర్‌లో 70 ఉద్యోగాలు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్)లో వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



- మొత్తం పోస్టులు-70 (జనరల్-40, ఓబీసీ-18, ఎస్సీ-3, ఎస్టీ-9)
- **విభాగాలవారీగా ఖాళీలు:** జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-3, టెక్నికల్ అసిస్టెంట్ (న్యూక్లియర్ మెడిసిన్-2, యూరాలజీ-1), నర్సింగ్ ఆఫీసర్-60, స్టెనోగ్రాఫర్ (గ్రేడ్-3)-3, ఎంటీఎస్ (కాబ్లర్)-1
- **అర్హత:** మాస్టర్ డిగ్రీ (హిందీ/ ఇంగ్లిష్), న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ/మెడికల్ రేడియేషన్ టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ, జనరల్ నర్సింగ్ & మిడ్‌వైఫరీలో డిగ్రీ/ డిప్లొమా, ఇంటర్/పదోతరగతిలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** స్టెనోగ్రాఫర్/ఎంటీఎస్ పోస్టులకు 27 ఏండ్లు, మిగతా పోస్టులకు 35 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** నర్సింగ్ ఆఫీసర్‌కు రూ. 44,900-1,42, 400 (పోస్టులను బట్టి పేస్కేల్స్‌లో తేడాలు ఉన్నాయి)
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2019 జనవరి 28
- **వెబ్‌సైట్:** www.jipmer.edu.in

ఏఎంపీఆర్ఐలో

సీఎస్ఐఆర్-అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ & ప్రాసెస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఏఎంపీఆర్ఐ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- మొత్తం ఖాళీలు: 10 (జనరల్-5, ఓబీసీ-2, ఎస్సీ-2, ఎస్టీ-1)
- పోస్టు పేరు: సైంటిస్ట్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంఈ/ ఎంటెక్ లేదా పీహెచ్‌డీ ఉండాలి.
- వయస్సు: 32 ఏండ్లకు మించరాదు.
- పే స్కేల్: 67,700/-
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: 2019 జనవరి 29
- వెబ్‌సైట్: www.ampri.res.in

జర్నలిజం కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం 2019-20 విద్యా సంవత్సరానికి వివిధ జర్నలిజం (డిప్లొమా) కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.

కోర్సుల వివరాలు
- పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం
- డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం
- డిప్లొమా జర్నలిజం కోర్సులన్నీ రెగ్యులర్‌గాను లేదా కరస్పాండెన్స్‌లోను చేయవచ్చు.
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో. పూర్తి వివరాలకు మొబైల్ నంబర్: 9848512767లో సంప్రదించవచ్చు.
- చివరితేదీ: 2019 జనవరి 12
- వెబ్‌సైట్: http://apcj.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
మంగళవారం 1 జనవరి 2019

త్రివిక్రమ్‌తో తీన్‌మార్

అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ పతాకాలపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు), అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. 'జులాయి' 'సన్నాఫ్ సత్యమూర్తి' తర్వాత అల్లు అర్జున్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రాబోతున్న మూడో చిత్రమిది కావడం విశేషం. ఈ సందర్భంగా నిర్మాతలు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ నెలలోనే ఈ చిత్రాన్ని ప్రారంభిస్తాం. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం' అని తెలిపారు.


అల్లు అర్జున్


త్రివిక్రమ్


అల్లు అరవింద్


రాధాకృష్ణ

స్టైలిష్ మహర్షి


'మహర్షి' చిత్రంలో మహేష్ బాబు

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మహర్షి'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్, పీవీపీ సినిమా సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. వంశీపైడిపల్లి దర్శకుడు. పూజా హెగ్డే కథానాయిక. నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని చిత్రబృందం సోమవారం మహేష్‌బాబు సెకండ్‌లుక్‌ను విడుదలచేసింది. ఇందులో చుట్టూ అనుచరులతో స్టైలిష్ అవతారంలో మహేష్ బాబు కనిపిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'మహేష్‌బాబు హీరోగా నటిస్తున్న 25వ సినిమా ఇది. ఇందులో రిషి అనే యువకుడిగా ఆయన పాత్ర వైవిధ్యంగా ఉంటుంది. సమాజ హితాన్ని కాంక్షిస్తూ రిషి సాగించిన ప్రయాణమే ఈ చిత్ర ఇతివృత్తం. ఇటీవలే రామోజీఫిల్మ్ సిటీలో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. తదుపరి షెడ్యూల్‌ను ఈ నెల రెండో వారంలో ప్రారంభిస్తాం. మార్చి వరకు సాగే ఈ షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది. ఏప్రిల్‌లో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేస్తాం. అల్లరి నరేష్ పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది' అని తెలిపారు.


ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు కార్తికేయ వివాహం జగపతిబాబు సోదరుడు, రామ్‌ప్రసాద్ కుమార్తె పూజా ప్రసాద్‌తో రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఆదివారం వైభవంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రభాస్, అనుష్క, రానా, నాగార్జునతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలందజేశారు.


శిరీష్, వరుణ్‌తేజ్, వెంకటేష్, గంటా శ్రీనివాసరావు, దేవిశ్రీప్రసాద్, అనిల్ రావిపూడి, దిల్‌రాజు, లక్ష్మణ్

సంక్రాంతి అల్లుళ్ల వినోదం

'**అ**నిల్ రావిపూడి కథ చెప్పినప్పుడే మా బ్యానర్‌లో మరో సూపర్ హిట్ సినిమా రాబోతుందని అనిపించింది. భార్యాభర్తల బంధంలో ఉండే ఫన్, ఫ్రస్ట్రేషన్‌ను ఆవిష్కరిస్తూ ఆద్యంతం వినోదభరితంగా రూపొందించిన చిత్రమిది' అని అన్నారు దిల్‌రాజు. శిరీష్, లక్ష్మణ్‌లతో కలిసి శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ఆయన నిర్మిస్తున్న మల్టీస్టారర్ చిత్రం 'ఎఫ్-2-ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్'. వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ నాయకానాయికలుగా నటించారు. అనిల్ రావిపూడి దర్శకుడు. దేవిశ్రీప్రసాద్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు ఆదివారం వైజాగ్‌లో విడుదలయ్యాయి. ఏపీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆడియో సీడీలను విడుదలచేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ''సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాతో మహేష్ రూపంలో మంచి సోదరుడు దొరికితే ఈ సినిమాతో వరుణ్‌తేజ్ లభించాడు. గత సినిమాలకు మించిన నటనను నా నుండి రాబట్టుకున్నారు అనిల్ రావిపూడి. సంక్రాంతికి మా సినిమాతో పాటు విడుదల అవుతున్న బాలకృష్ణ, రజనీకాంత్, రామ్‌చరణ్ చిత్రాలు విజయవంతమవ్వాలి' అని తెలిపారు. వెంకటేష్‌తో కలిసి నటించడం గర్వంగా ఉందని, స్నేహితుడిగా, గైడ్‌లా తనను ప్రోత్సహించారని వరుణ్‌తేజ్ చెప్పారు. 'పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. రెండున్నరగంటల పాటు నవ్విస్తూనే ఉంటుంది. ఇద్దరు హీరోల్లో ఒకరు ఆంధ్రా అల్లుడిగా, మరొకరు తెలంగాణ అల్లుడిగా కనిపిస్తారు. అందుకే సినిమాకు 'సంక్రాంతి అల్లుళ్లు' అనే క్యాప్షన్‌ను జోడించాం.ఈ నెల 12న ఈ సినిమా విడుదలకానుంది' అని దిల్‌రాజు పేర్కొన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'దిల్‌రాజు సంస్థలో నేను చేస్తున్న మూడో సినిమా ఇది. ఈ సినిమాలో వెంకటేష్ తన కామెడీ టైమింగ్‌తో అబ్బాయిగారు, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, నువ్వునాకు నచ్చావ్ రోజుల్లోకి తీసుకెళతారు. వరుణ్‌తేజ్ తొలిసారి కామెడీ కథాంశంతో చేస్తున్న సినిమా ఇది. సంక్రాంతికి కుటుంబమంతా కలిసి నవ్వుకునేలా ఉంటుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవిశ్రీప్రసాద్, కాసర్లశ్యామ్, బాలాజీ, శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

చిన్న సినిమాల్లో పెద్ద విజయం


సత్యదేవ్, గోపీగణేష్, నందితాశ్వేత, శివలెంక కృష్ణప్రసాద్

'**తె**లుగు ప్రేక్షకుల్ని మెప్పించేలా దర్శకుడు గోపీగణేష్ అర్థవంతంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.' ప్రతి పాత్రను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇలాంటి చిన్న సినిమాల్ని ఆదరిస్తే భవిష్యత్తులో వినూత్న కథాంశాలతో కూడిన మరిన్ని మంచి చిత్రాలు రావడానికి ఆస్కారం ఉంది' అని అన్నారు దర్శకుడు మారుతి. సత్యదేవ్, నందితాశ్వేత జంటగా నటించిన చిత్రం 'బ్లఫ్‌మాస్టర్'. శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో రమేష్.పి పిళ్లై నిర్మించారు. గోపీగణేష్ పట్టాభి దర్శకుడు. ఇటీవల ఈ చిత్రం విడుదలైంది. సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'చిన్న సినిమాల్లో పెద్ద విజయమిది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అభినందిస్తున్నారు. నిర్మాతగా మాకు సంతృప్తిని మిగుల్చుతుందని నమ్ముతున్నాం' అని చెప్పారు. తమిళ మాతృక విడుదలైన తర్వాత నేరాలు తగ్గాయని, తెలుగులో కూడా ఆ ప్రభావాన్ని చూపించగలిగితే మా ప్రయత్నం విజయవంతమైనట్లేనని దర్శకుడు గోపీగణేష్ పేర్కొన్నారు. సత్యదేవ్ మాట్లాడుతూ 'సినిమాకు లభిస్తున్న ఆదరణ చూస్తుంటే గర్వంతో పాటు ఆనందంగా ఉంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందితాశ్వేత, లక్ష్మీభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

కుర్రాళ్లకి అర్థమవుతుందిలే!


ఈశ్వర్, టుయా చక్రవర్తి

ఈశ్వర్, టుయా చక్రవర్తి, అంకిత మహారాణా నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్లకి అర్థమవుతుందిలే' ఉపశీర్షిక. ఆర్. రఘురాజ్ దర్శకుడు. ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ పతాకంపై దొమ్మరాజు, హేమలత, దొమ్మరాజు ఉదయకుమార్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ ''కలుసుకోవాలని' తర్వాత సుదీర్ఘ విరామం అనంతరం తెలుగులో నేను దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. నేటి తరం మనోభావాలకు దర్పణంలా ఉంటుంది. ప్రేమ, పెళ్లి విషయాల్లో యువత ఆలోచనలు, అభిరుచులు ఎలా ఉన్నాయనేది వాస్తవిక కోణంలో ఆవిష్కరిస్తున్నాం. హైదరాబాద్‌లో టాకీపార్ట్, బ్యాంకాక్‌లో పాటలను చిత్రీకరించాం' అని తెలిపారు. 'యూత్‌ఫుల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇది. త్వరలో ఆడియోను, సినిమా విడుదల తేదీని వెల్లడిస్తాం' అని నిర్మాతలు తెలిపారు. కౌసల్య, అన్నపూర్ణ, సత్యకృష్ణ, పోసాని కృష్ణమురళి కీలక పాత్రలను పోషిస్తున్న ఈ చిత్రానికి: పాటలు: సురేష్ ఉపాధ్యాయ, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కథ, మాటలు, ఎడిటింగ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఆర్. రఘురాజ్

కొడితే సిక్స్ కొట్టాలి!

ఏ ఆటలోనైనా అంతిమ లక్ష్యం గెలుపే. ఇక జీవితమనే ఆటలో విజయం తప్ప మరో ప్రత్యామ్నాయానికి ఆస్కారం ఉండదు. అదే ఆశయంతో ఓ క్రికెటర్ గెలుపు కోసం చేసిన పోరాటం ఎలాంటిదో తెలుసుకోవాలంటే మా సినిమా చూడాల్సిందే అంటున్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జెర్సీ'. గౌతమ్ తిన్ననూరి ('మళ్లీ రావా' ఫేమ్) దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. క్రికెట్ జెర్సీలో తదేకంగా చూస్తున్న నాని ఫొటో అందరిని ఆకట్టుకుంటున్నది. ఏప్రిల్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాలో నాని క్రికెటర్ పాత్రలో కనిపించబోతున్నారు. 1996-97 నేపథ్యంలో జరిగే కథ ఇదని సమాచారం. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సను వర్గీస్, సంగీతం: అనిరుధ్, ఆర్ట్: అవినాష్, సమర్పణ: పీడీవీ ప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి.


'జెర్సీ' చిత్రంలో నాని